శుక్రవారం
08-11-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 47
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కొత్త శకంలో కలిసి ముందుకెళదాం: జిన్‌పింగ్

బీజింగ్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ గురువారం శుభాకాంక్షలు తెలిపారు. కొత్త శకంలో కలిసి ముందుకెళ్లేందుకు సరైన మార్గాన్ని అన్వేషిద్దామని సూచించారు. మనస్పర్థలు, విభేదాలను మరిచి కొత్తగా మొదలు పెడతామని కోరారు. అలా జరిగితే అమెరికా, చైనాతో పాటు ప్రపంచానికి ప్రయోజనం ఉంటుందన్నారు. సహకరించుకుంటే లాభం పొందుతామని... ఘర్షణ పడితే నష్టపోతామని చైనా, అమెరికా దేశాల చరిత్ర నేర్పుతోందని జిన్‌పింగ్ అన్నారు. చైనా, అమెరికా మధ్య సుస్థిర సంబంధాలు కోరుకుంటున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ సమాజ ఆకాంక్షలకు అనుగుణంగా పరస్పర ప్రయోజనాల దృష్ట్యా రెండు దేశాలు కలిసి ముందుకెళ్లాలని నొక్కిచెప్పారు.

త్వరలో 2 లక్షల ఉద్యోగాల భర్తీ

ఏటా జాబ్ క్యాలెండర్

- సివిల్స్ మెయిన్‌కు ఎంపికైతే రూ.లక్ష ప్రోత్సాహం
- హైదరాబాద్‌లో యూపీఎస్సీ శిక్షణ కేంద్రం ఏర్పాటు అభినందనీయం: భట్టి విక్రమార్క

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని అశోక్ నగర్ లో గురువారం సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ... ఇప్పటికే 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. ఉద్యోగాల భర్తీకి ప్రతి ఏటా వార్షిక క్యాలెండర్ విడుదల చేస్తున్నామని చెప్పారు. గ్రూప్ -1 పరీక్షలు విజయవంతంగా నిర్వహించామని, గ్రూప్ -2 నిర్వహించబోతున్నామని వెల్లడించారు. ప్రశ్నపత్రాల లీకేజీ, ఇతర ఇబ్బందులు లేకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. నిరుపేదలు, మధ్య తరగతి వర్గాలవారు ఆర్థిక ఇబ్బందులతో యూపీఎస్సీ పరీక్షలకు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారిని గుర్తించి ఆర్థికంగా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. మన రాష్ట్రం నుంచి మెయిన్స్‌కు ఎంపికైన ఒక్కొక్కరికి రూ.లక్ష ప్రోత్సాహంగా అందించినట్లు చెప్పారు., ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి కూడా రూ.లక్ష అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి మెటీరియల్, ప్రత్యేక శిక్షణకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు వివరించారు. సివిల్ సర్వీస్ కు మన రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున ఎంపిక అయితే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. యూపీ క్యాడర్లో పనిచేస్తున్నప్పటికీ ప్రాంతీయ అభిమానంతో తెలుగు వారైన మోహన్ రావు, అరుణ అధ్వర్యంలో హైదరాబాద్‌లో యూపీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయం అన్నారు. ఉత్తర భారత దేశంలో ఎక్కువ అకాడమీలు అందుబాటులో ఉండడంతో ఆయా రాష్ట్రాల నుంచి సివిల్ సర్వీసెస్ కు ఎక్కువమంది ఎంపిక అవుతున్నారని చెప్పారు. మన రాష్ట్రానికి మేలు జరగాలంటే పెద్ద సంఖ్యలో సివిల్స్ కోచింగ్ అకాడమీలు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

కోల్‌కతా హత్యాచార కేసు బదిలీకి సుప్రీం తిరస్కృతి

న్యూదిల్లీ: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం కేసును పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి వేరొక చోటుకు బదిలీ చేయడానికి సుప్రీంకోర్టు గురువారం తిరస్కరించింది. ఆధారాలను పరిశీలించిన తర్వాత అవసరమని పిస్తే మరొక దర్యాప్తునకు ఆదేశించే అధికారం విచారణ కోర్టు జడ్జికి ఉంటుందని సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వ ధర్మాసనం తెలిపింది. సీబీఐ తాజాగా దాఖలు చేసిన ఆరవ స్టేటస్ రిపోర్టును పరిశీలించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌పై ఈనెల 4న అభియోగాలను

- మిగతా 2 లో

శారదా పీఠం భూముల స్వాధీనం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: విశాఖలోని శారదా పీఠానికి గత వైసీపీ ప్రభుత్వం కేటాయించిన 15 ఎకరాల భూముల్ని రెవిన్యూ శాఖ స్వాధీనం చేసుకుంది. భీమిలి మండలం కొత్తవలసకు సమీపంలో రిషికొండ వద్ద కోట్లాది రూపాయల విలువైన 15 ఎకరాలను ఎకరా లక్ష రూపాయల వంతున శారదా పీఠానికి గత జగన్ సర్కార్ కట్టబెట్టిన విషయం తెలిసిందే. ఎకరా రూ.15 కోట్లు విలువ చేసే భూమిని లక్ష రూపాయలకే ఇచ్చేయడంపై కూటమి ప్రభుత్వం దర్యాప్తు చేయించింది. దర్యాప్తు నివేదిక

- మిగతా 2 లో

ఏడుగురికి ఐపీఎస్ హోదా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఏపీకి చెందిన ఏడుగురు సీనియర్ పోలీస్ అధికారులకు నాన్-క్యాడర్ ఎస్పీ హోదా నుండి ఐపీఎస్ హోదా లభించింది. ఐపీఎస్ హోదా పొందిన సీనియర్ అధికారుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. వీరికి ఇటీవల కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నాన్-కేడర్ ఎస్పీల నుంచి ఐపీఎస్ హోదా కల్పించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ హోదా లభించిన అధికారుల జాబితాను విడుదల చేస్తూ జీవోను జారీ చేసింది. 2022 బ్యాచ్‌లో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ట్రంప్‌ని మీరే దగ్గరుండి గెలిపించారని ఒక ప్రకటన ఇమ్మంటారా!

జెట్ ఎయిర్‌వేస్ కథ కంచికే...

లిక్విడేషన్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూదిల్లీ: దేశీయ విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్‌కు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆర్థికంగా కుదేలైన ఈ విమానయాన సంస్థ లిక్విడేషన్ ప్రక్రియకు గురువారం ఆదేశాలు జారీ చేసింది. దివాలా పరిష్కార ప్రక్రియ ప్రయత్నాలు విఫలం కావడంతో ఈ ఆదేశాలిచ్చింది. రుణ దాతలు, ఉద్యోగుల ప్రయోజనార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఆస్తుల విక్రయానికి లిక్విడేటర్‌ను నియమించాలని ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్‌ను ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో జెట్ ఎయిర్‌వేస్ కథ ముగిసినట్లు అయింది. ఆర్థిక కష్టాలతో జెట్ ఎయిర్‌వేస్ 2019లోనే కార్యకలాపాలు నిలిపివేసింది. దీంతో ఈ వ్యవహారం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు వెళ్లగా... అక్కడ దివాలా ప్రక్రియ మొదలైంది. ఇందులో జలాన్-కర్లాక్ కన్సార్షియం బిడ్డింగ్‌లో జెట్ ఎయిర్‌వేస్‌ను దక్కించుకుంది. తర్వాత కన్సార్షియానికి, రుణదాతలకు మధ్య విభేదాలు నెలకొన్నాయి. దీంతో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని రుణదాతలు ఎన్‌సీఎల్ఏటీకి వెళ్లారు. యాజమాన్య హక్కుల బదిలీ విషయంలో ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన ఆదేశాలను అప్పిలేట్ ట్రిబ్యునల్ సమర్థించింది. అప్పిలేట్ ట్రిబ్యునల్ తీర్పునకు వ్యతిరేకంగా ఎస్‌బీఐ, ఇతర రుణదాతలు సుప్రీంకోర్టు తలుపుతట్టారు. దీనిపై విచారణ జరిపిన సీజేఐ, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది. ఎన్‌సీఎల్ఏటీ ఆదేశాలను పక్కనపెట్టింది. దివాలా ప్రక్రియలో విమానయాన సంస్థను చేజిక్కించుకున్న జలాన్ కర్లాక్ కన్సార్షియం... ఉద్యోగుల జీత భత్యాలు, నిధులు వెచ్చించడంలో విఫలమైనందున రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించి లిక్విడేషన్‌కు ఆదేశాలు ఇచ్చింది. రుణదాతలు, ఉద్యోగులు, ఇతర భాగస్వామ్య పక్షాల ప్రయోజనార్థం ఈ ఆదేశాలు జారీ చేసింది.



రెడ్‌బుక్ దుమారం

రాజ్యాంగంపై అధికార-విపక్షాల రాజకీయం

అర్బన్ నక్సల్స్ వర్గమంటూ కాంగ్రెస్‌పై బీజేపీ విమర్శలు

రెండు పార్టీల మాటల యుద్ధం

న్యూదిల్లీ: అధికార, విపక్షాలు రాజ్యాంగంపై రాజకీయం చేస్తున్నాయి. ఎన్నికల వేళ 'రెడ్ బుక్' పేరిట వివాదానికి తెరతీశాయి. రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటే మాకు ఓటు వేయండని ప్రతిపక్ష పార్టీలు ఓటర్లను కోరుతున్నాయి. మరోవైపు కాంగ్రెస్‌కు ఓటేస్తే రాజ్యాంగాన్ని ఖూనీ చేసినట్లేనని బీజేపీ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారు. దీంతో 'రెడ్ బుక్' రాజకీయాలు వేడెక్కాయి. కాంగ్రెస్, బీజేపీ-వాటి మిత్రపక్షాలైన శివసేన, ఎన్‌సీపీ వర్గాల మధ్య మాటల యుద్ధం తీవ్రరూపం దాల్చింది. (రాజకీయాల్లో ఎరుపు రంగు మార్క్సిస్టు, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు సూచిక). ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాజ్యాంగ ప్రతిని చూపుతూ ప్రసంగించడం ఎన్నికల సభల్లో నిత్యం కనిపించే దృశ్యం. ఎరుపు రంగులో ఉన్న రాజ్యాంగ ప్రతిని ఆయన ప్రదర్శించడంపై కాషాయ వర్గం రాద్ధాంతం మొదలు పెట్టింది. అర్బన్ నక్సలిజం, అరాచకవాదం పదాలను తెరపైకి తెచ్చింది. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల బరిలో హేమాహేమీలు నిలిచిన వేళ నాగపూర్ సభలో రాహుల్ తన చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని చేసిన ప్రసంగంపై రాజకీయ వివాదం సాగుతోంది. రాహుల్ రాజ్యాంగాన్ని ప్రదర్శిస్తూ దీని వెనుక ఆలోచనలు వెయ్యేళ్ల నాటివన్నారు. రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కేలా బీజేపీ, ఆర్ఎస్ఎస్ తీరు ఉన్నదని విమర్శించారు. దీంతో ఆయనపై, ఆయన పార్టీపై బీజేపీ విరుచుకుపడింది. రెడ్ బుక్ అంటూ విమర్శలు గుప్పించసాగింది. కాంగ్రెస్‌కు మద్దతివ్వడమంటే రాజ్యాంగాన్ని ఖూనీ చేయడమే అంటూ బీజేపీ మహారాష్ట్ర నేత ఒకరు ఘాటు విమర్శలు చేశారు.

ఏప్రిల్-జూన్ ఎన్నికల్లోనూ రాజ్యాంగంపైనే కాంగ్రెస్ ప్రచారం సాగింది. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందని, ప్రజాస్వామ్యాన్ని

- మిగతా 2 లో

ప్రైవేటీకరణ కుట్రలు ఆపండి

- విశాఖ ఉక్కు రక్షణకు కేంద్రంపై టీడీపీ ఒత్తిడి చేయాలి
- యురేనియం తవ్వకాల నిలిపివేతపై స్పష్టత ఇవ్వండి
- వామపక్ష పార్టీల డిమాండ్

2లో

తేమ, తరుగు పేరుతో రైతును దగా చేయొద్దు

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

విశాలాంధ్ర-కొత్తగూడెం: తేమ, తరుగు పేరుతో రైతులను దగా చేయొద్దని, కొనుగోలు కేంద్రంపై అధికారులు, సొసైటీ బాధ్యుల పర్యవేక్షణ అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సూచించారు. మండల పరిధిలోని పెనగడపలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ నియోజక వర్గ వ్యాప్తంగా సహకార సంఘాల అధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచడం ద్వారా రైతులకు రవాణా ఖర్చులు ఆదా అవుతాయన్నారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం అమ్ముకోవాలని, మద్దతు ధరతోపాటు బోనసు పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. రైతులు

- మిగతా 2 లో

కశ్మీర్ అసెంబ్లీ రణరంగం

కొట్టుకున్న ఎమ్మెల్యేలు

ప్రత్యేక హోదా పునరుద్ధరణ తీర్మానంపై దుమారం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ రణరంగాన్ని తలపించింది. ప్రత్యేక హోదా పునరుద్ధరణ తీర్మానం మీద గురువారం శాసనసభ దద్దరిల్లింది. అధికార-విపక్షాల విమర్శలు, ప్రతివిమర్శలతో గందరగోళం నెలకొంది. సభ మొదలు కాగానే బీజేపీ సభ్యులు నిరసనకు దిగారు. దీంతో సభ రసాభాస అయింది. నిరసనకు దిగిన విపక్ష ఎమ్మెల్యే లను బయటకు తీసుకెళ్లాలని మార్షల్స్‌కు స్పీకర్ అబ్దుల్ రహీం ఆదేశించారు. ఆ సమయంలో మార్షల్స్‌తో బీజేపీ ఎమ్మెల్యేలు గొడవ పడ్డారు. మరోవైపు ప్రత్యేక హోదా పునరుద్ధరణ కోసం పీడీపీ, పీపుల్స్ కాన్ఫరెన్స్ సభ్యులు తాజా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 'అధికరణ 370 పునరుద్ధరణ' పోస్టర్ కారణంగా జమ్మూకశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ నేత సజాద్ లోనె సహా అనేక మంది ఎమ్మెల్యేలు బాహాబాహీకి దిగారు. ఈ సందర్భంగా నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ)పై సజాద్ లోనె మండిపడ్డారు. సభ ఆమోదించిన తీర్మానాన్ని ఓ నాటకంగా వ్యవహరించారు. తాము దానికి మద్దతిస్తే... బీజేపీ మిత్రపక్షంగా ఎన్‌సీ అధికార ప్రతినిధి విమర్శించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్ష నేత సునీల్ శర్మ మాట్లాడుతుండగా షేక్ ఖుర్షీద్ (ఎమ్మెల్యే-బారాముల్లా ఎంపీ ఇంజినీర్ రషీద్ సోదరుడు) వెల్‌లోకి దూసుకెళ్లారు. అధికరణ 370, అధికరణ 35ఎ పునరుద్ధరణ, రాజకీయ ఖైదీల విడుదలకు డిమాండ్ చేస్తూ బ్యానర్ ప్రదర్శించారు. వెంటనే బీజేపీ సభ్యులు ఆయన మీదకు వెళ్లి దానిని లాక్కొని చించిపారేశారు. సజాద్ లోనె జోక్యం చేసుకొని, వారిని ఆపేందుకు ప్రయత్నించారు. ఇది వారి మధ్య ఘర్షణకు దారితీసింది. మార్షల్స్ వెంటనే పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అయితే ఈ తీర్మానంపై అనుకూల, వ్యతిరేక స్వరాలు వినిపించాయి. ఖుర్షీద్‌పై దాడి జరిగినప్పుడు ఎన్‌సీ సభ్యులు ఆయనకు మద్దతివ్వక పోవడాన్ని లోనె తప్పుపట్టారు. 'తోటి కశ్మీరీగా దాడిని ఆపేందుకు నేను వెళ్లాను కానీ నేషనల్ కాన్ఫరెన్స్ నుంచి ఎవరూ రాలేద'ని ఆయనన్నారు.

కమ్యూనిజానికి ప్రత్యామ్నాయమే లేదు

సీపీఐ సభ్యత్వ పునరుద్ధరణ సభలో పువ్వాడ

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం లేదని, కరుడుకట్టిన పెట్టుబడిదారి దేశాలు సైతం సంక్లిష్ట స్థితిలో మార్క్స్ ఆలోచనలను పరిగణలోకి తీసుకుంటున్నాయని సీపీఐ సీనియర్ నేత, మాజీ శాసనసభ్యుడు పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. కమ్యూనిస్టు శక్తులు పురోగమించడంతో వివిధ దేశాలలో ప్రజాస్వామ్య వాదులు అధికారంలోకి రావడం దీనికి సంకేతమన్నారు. సీపీఐ వందేళ్ల సభ్యత్వ పునరుద్ధరణ కార్యక్రమాన్ని గురువారం

- మిగతా 2 లో

జాతీయ విముక్తి ఉద్యమాలకు 'అక్టోబరు విప్లవం' బాసట

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్/ ఖమ్మం: అక్టోబరు విప్లవం జాతీయ విముక్తి ఉద్యమాలకు బాసటగా నిలిచిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం అక్టోబరు విప్లవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ... సోవియట్ విప్లవం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడి దారులు, భూస్వాముల గుండెల్లో ప్రకంపాలు సృష్టించిందన్నారు. ప్రపంచ పరిణామాల దశ, దిశను మార్చి ప్రపంచ మానవాళి చరిత్రను మలుపు తిప్పిన ఘటన అక్టోబర్ విప్లవానిదని కొనియాడారు.

కష్టజీవుల ఆశాజ్యోతి సోషలిజం: బాల మల్లేశ్

కష్టజీవుల ఆశాజ్యోతిగా సోషలిజం నిలిచిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.బాల మల్లేశ్ అన్నారు. 1886 తర్వాత ఎనిమిది గంటల పని దినంకై సాగుతున్న ప్రపంచ కార్మిక వర్గ పోరాటాలకు సోవియట్‌లోనే పరిష్కారం దొరికిందని అన్నారు. అక్టోబరు విప్లవం తర్వాత ఎనిమిది గంటల పని దినం చట్టపరంగా అమలు చేశారన్నారు. సామాజిక భద్రత అంశాలు అమల్లోకి వచ్చాయని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కేవియల్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, రాపోలు సుదర్శన్, చంద్రమోహన్ గౌడ్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమాలకు ప్రేరణ: హేమంతరావు

అక్టోబరు విప్లవం... ప్రపంచ దేశాల్లో స్వాతంత్ర్య ఉద్యమాలకు ప్రేరణ అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. ఈ విప్లవం ప్రపంచగతిని మార్చివేసిందని, అనేక దేశాలు స్వాతంత్ర్యం పొందడానికి స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్ర్య నినాదానికి కారణమైందన్నారు. సీపీఐ జిల్లా సమితి అధ్వర్యంలో గురువారం

- మిగతా 2 లో

ట్రంప్ గెలుపుపై ఫిలడెల్ఫియా, చికాగోలో నిరసన

2 లో

ట్రంప్ గెలుపుపై ఫిలడెల్ఫియా, చికాగోలో నిరసన

చికాగో: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించడంపై ఫిలడెల్ఫియా, చికాగో ప్రజల్లో నైరాశ్యం నెలకొంది. ఈ ఫలితాలు నిరాశపర్చినట్లు పేర్కొంటూ ట్రంట్ గెలుపుకు నిరసనగా ఫిలడెల్ఫియా, చికాగో ప్రజలు వీధుల్లోకి వచ్చి ర్యాలీలు నిర్వహించారు. 'ఆయన నాకు అధ్యక్షుడు కాదు', 'పలస్తీనాకు స్వేచ్ఛ', మా స్వేచ్ఛ కోసం పోరాటం' అంటూ నినాదాలు ఇచ్చారు. ప్రధాన మార్గాలను దిగ్బంధించారు. మహిళల గర్భధారణ హక్కులు, ట్రాన్స్ హక్కులు, తుపాకీ చట్టాలకు సంబంధించి నినదించారు. ఫిల్లీ (ఫిలడెల్ఫియా)లో ఫాసిజాన్ని స్వాగతించబోం', ఫలితాలు తీవ్ర ఆందోళనకరం' అన్న ప్లకార్డులను ప్రదర్శించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. చికాగోలోనూ ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలు జరిగాయి. యునైటెడ్ స్టేట్స్ పలస్తీనా కమ్యూనిటీ నెట్‌వర్క్ అధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ట్రంప్ గెలుపు నిరాశపర్చిందని నిరసనకారులు తెలిపారు. ఈ దేశం సెక్సిజం, హోమోఫిబియా, ఫాసిజాన్ని అంగీకరించదు. ఇక్కడ వివక్షకు తావులేదు. తాజా ఫలితాలు ఆందోళన కలిగిస్తున్నాయి... భయపెడుతున్నాయి' అని ఫిలడెల్ఫియా ర్యాలీలో పాల్గొన్న ఇసాబెల్ అన్నారు. అమెరికన్లు ఏమనుకొని ట్రంప్‌ను గెలిపించారో అర్థం కావడంలేదని క్యాతీ ఓ కోనల్ చెప్పారు. 'తన కోసం అధికారాన్ని కోరుకున్న వ్యక్తికి పట్టం కట్టడం ఏమిటో అంతు పట్టడంలేదు. ఫిలడెల్ఫియా మాత్రం కమలా హారిస్‌ను ఎన్నుకుంది' అని ఆమె అన్నారు.

ట్రంప్‌ను అమెరికన్లు గెలిపిస్తారని ఊహించలేదని డెన్వర్ రాబిన్స్ అనే నిరసనకారుడు తెలిపారు. ఏ ఉద్దేశంతో అమెరికన్లు ఆయనను ఎన్నుకున్నారో తెలియడం లేదన్నారు. ఎన్నికల వేళ ఫిలడెల్ఫియా అల్లర్లు, హింస జరగకపోవడం, అంతా ప్రశాంతంగా ఉండటంపై హర్షం వ్యక్తంచేశారు. కాగా, ఫిలడెల్ఫియాలో 78.29శాతం మంది డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌కు ఓటేశారు.

అసాధారణ స్థితుల్లో హారిస్ చారిత్రక ప్రచారం: బైడెన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో తమ పార్టీ తరపున కమలా హారిస్ చారిత్రక ప్రచారాన్ని నిర్వహించారని అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. అసాధారణ పరిస్థితుల్లో చరిత్రాత్మకంగా ప్రచారాన్ని నిర్వహించిన కమలా హారిస్ సమగ్రత, సాహసం, వ్యక్తిత్వం ప్రశంసనీయమన్నారు. 'ఆమెను నేను అభిమానిస్తాను. ఆమె మంచి సహోద్యోగి. సాహసోపేతంగా ముందుకెళ్లగలిగిన ప్రజా సేవకురాలు' అని బైడెన్ కొనియాడారు. 2020లో అధ్యక్ష పదవి కోసం నామినేట్ అయినప్పుడు నేను తీసుకున్న మొదటి నిర్ణయం ఆమె పేరును ఎంపిక చేయడమే అని చెప్పుకొచ్చారు. అమెరికా కథల్లో ఉత్తమ గాథ ఆమెదని, ఈ గాథను ఆమె రాయడం కొనసాగిస్తారనడంలో సందేహం లేదని బైడెన్ అన్నారు. దృఢ నిశ్చయం, సంకల్పం, ఉత్సాహంతో ఈ పోరాటాన్ని హారిస్ కొనసాగిస్తారని చెప్పారు. అమెరికన్లకు చాంపియన్‌గా నిలుస్తారని, మన పిల్లలకు నాయకురాలిగా కొనసాగుతారని, రాబోయే తరాలకు దిక్సూచిగా నిలుస్తారని, భవిష్యత్ అమెరికా భవితవ్యంపై తన ముద్ర వేస్తారని బైడెన్ ఆకాంక్షించారు.

ఓటమి అంగీకరిస్తున్నాగానీ: కమలా హారిస్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. 295కుపైగా ఓట్లతో రాణించారు. దీంతో దేశ ఉపాధ్యక్షురాలు, డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ ఆయనకు గురువారం ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు తన ఓటమిని అంగీకరిస్తూ ఒక ప్రకటన చేశారు. తమ పోరాటం ఆగబోదన్నా. కన్నీళ్లు పెట్టుకున్న తన మద్దతుదారులను ఉద్దేశించి వాషింగ్టన్‌లో భావోద్వేగంగా ప్రసంగించారు. 'బాధపడకండి... మనోధైర్యాన్ని కోల్పోకండి... పోరాటాన్ని కొనసాగించండి' అని కోరారు. 'ఓటమిని అంగీకరిస్తున్నానే తప్ప మనోధైర్యాన్ని కోల్పోవడంలేదు. ఈ ప్రచారానికి ఆజ్యం పోసిన పోరాటాన్ని ఆపడం లేద'ని హార్వర్డ్ వర్సిటీలో ఆమె కొద్దిసేపు మాట్లాడారు. మనకిది గడ్డు కాలమని కొందరు భావిస్తున్నారు కానీ అలాంటిదేమీ జరగదని తన మద్దతుదారుల్లో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. 'స్వేచ్ఛ... న్యాయం... మనం కోరునే భవిష్యత్‌ను నిర్మించుకోవడం కోసం చైతన్యవంతులు అయ్యేందుకు ఇదే సమయం' అని కమలా హారిస్ పిలుపునిచ్చారు.

'అక్టోబరు విప్లవం' బాసట

(మొదటిపేజీ తరువాయి)

అక్టోబరు విప్లవ దినోత్సవం, లెనిన్ శతవర్ధంతి సభలను నిర్వహించారు. శింగు నర్సింహారావు అధ్యక్షతన జరిగిన సభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ రష్యాలో... జార్ చక్రవర్తుల నిరంకుశపాలనకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక, అట్టడుగువర్గాలు సాధించిన మహత్తర విజయమే అక్టోబరు విప్లవం అన్నారు. కారల్ మార్క్స్ మార్క్సిజాన్ని వాస్తవంలోకి తెచ్చిన మహనీయుడు లెనిన్ అని, రష్యాలో ఆర్థిక అంతరాలు లేని నవీన సమాజాన్ని లెనిన్ నిర్మించారన్నారు. భారతదేశంలో 1925లో కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భావానికి కారణమైందన్నారు. లెనిన్ చారిత్రక పురుషుడని, ఆయనే మరణించి వందేళ్లు అయినా... కోట్లాది మంది మదిలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. మతోన్మాదం పెచ్చురిల్లిన ప్రస్తుత పరిస్థితులలో అభ్యుదయ భావజాలంతో ప్రజా సమస్యల పరిష్కారానికి సిద్ధం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు. తొలుత పార్టీ కార్యాలయంపై పతాకాన్ని జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆవిష్కరించారు. పువ్వాడ నాగేశ్వరరావు, పోటు ప్రసాద్, దండి సురేశ్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి పాల్గొన్నారు.

'రెడ్‌బుక్' దుమారం

(మొదటిపేజీ తరువాయి)

పరిరక్షించేందుకు విపక్ష సంఘటనకు ఓటు వేయాలని 'ఇండియా' పిలుపునిచ్చింది. నాగపూర్ సభలో రాహుల్ గాంధీ రాజ్యాంగ ప్రతి 'రెడ్ బుక్' చూపి అర్బన్ నక్సల్స్, అరాచకవాదుల ఓట్లు కోరారని బీజేపీ నేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవంద్ర ఫడ్నవీస్ విమర్శించారు. ఆయన వ్యాఖ్యలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్రంగా ఖండించారు. ఫడ్నవీస్ భారత రాజ్యాంగాన్ని నిందిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాతల్లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ముఖ్యులన్నారు. మనుస్మృతి ముద్ర కనిపించకపోవడంతో రాజ్యాంగంపై ఆర్‌ఎస్‌ఎస్ 1949లో దాడికి దిగిందని జైరాం రమేశ్ గుర్తుచేశారు. నల్ల అంచు-ఎర్ర రంగులో ఉండే రాజ్యాంగ ప్రతులను ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్వీకరిస్తున్న చిత్రాలను తన పోస్టుకు ఆయన జతపరిచారు. అర్బన్ నక్సల్స్ అనే పదాన్ని కేంద్రం వినియోగించదన్న హోంశాఖ వ్యాఖ్యలను జైరాం రమేశ్ దుయ్యబట్టారు. తన వ్యాఖ్యలకు ఆధారంగా 2020 మార్చిలో రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ పదాన్ని హోంశాఖ సహాయ మంత్రి వాడటాన్ని చూపారు. ఫడ్నవీస్ ఆలోచించి మాట్లాడాలని జైరాం రమేశ్ హితవు పలికారు.

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, బీజేపీ మహారాష్ట్ర అధికార ప్రతినిధి కేశవ ఉపాధ్యాయ కూడా కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగారు. బీజేపీ ప్రత్యర్థులు నాటకాలాడుతున్నారని రిజిజు విమర్శించారు. నాగపూర్‌లో జరిగిన సంవిధాన్ సమ్మాన్ సమ్మేళనంలో రాహుల్ గాంధీ చూపినది ఖాళీ పుస్తకమని చెప్పుకొచ్చారు. రాజ్యాంగం ప్రతిగా కనిపించే ఖాళీ పుస్తకాలను సభకు తెచ్చారన్నారు. వాటిని సభికులకు పంచారని వ్యాఖ్యానించారు. అది రాజ్యాంగం కాదు... ఖాళీ పుస్తకమని చెబుతూ సంబంధిత వీడియోను బీజేపీ మహారాష్ట్ర శాఖ పోస్టు చేసింది. ఇదిలావుంటే అర్బన్ నక్సల్స్ వైపు మొగ్గు చూపుతున్నారంటూ రాహుల్ గాంధీపై తాను చేసిన ఆరోపణలు నిజమని తేలాయని ఫడ్నవీస్ అన్నారు. 'రెడ్ బుక్ చూపి అర్బన్ నక్సల్స్ మద్దతు (రాజకీయంగా) కోరారు. దీని ద్వారా రాహుల్ గాంధీ ఏం సందేశం ఇవ్వాలనుకున్నారో' అని ఆయన వ్యాఖ్యానించారు.

కమ్యూనిజానికి ప్రత్యామ్నాయమే లేదు

(మొదటిపేజీ తరువాయి)

గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో పువ్వాడ మాట్లాడుతూ కమ్యూనిజానికి మరణం లేదని అన్నారు. సృష్టి ఉన్నంతకాలం, దోపిడీ ఉన్నంతకాలం కమ్యూనిజం ఉంటుందన్నారు. ఆటు పోట్లు, నిర్బంధాలు , జయాపజయాలు కమ్యూనిస్టుపార్టీకి కొత్తకాదన్నారు. పెట్టుబడిదారీ, కార్పొరేట్ శక్తులు కమ్యూనిస్టు భావజాలాన్ని... ఉనికిని నియంత్రించడానికి ప్రయత్నిస్తుంటాయన్నారు. ప్రజల సమస్యలే అజెండాగా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. తొలుత హేమంతరావు, పోటు ప్రసాద్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు, వివిధ ప్రజా సంఘాల బాధ్యులకు పార్టీ సభ్యత్వం ఇచ్చిన పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఖమ్మం రూరల్, చింతకాని, ఖమ్మంనగరం, రఘునాధపాలెం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పువ్వాడతో సహా కమ్యూనిస్టుపార్టీ నాయకుల సమక్షంలో సభ్యత్వాన్ని పునరుద్ధరించుకున్నారు.

కోల్‌కతా హత్యాచార కేసు బదిలీకి సుప్రీం తిరస్కృతి

(మొదటిపేజీ తరువాయి)

కోల్‌కతా కోర్టు నమోదు చేసినట్లు సర్వోన్నత ధర్మాసనం గుర్తించింది. వైద్య వృత్తిదారుల రక్షణ ప్రోటోకాల్ రూపొందించేందుకు ఏర్పాటైన నేషనల్ టాస్క్ ఫోర్స్ (ఎన్‌టీఎఫ్) తమ నివేదికను కోర్టుకు సమర్పించగా, దీనిని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో పంచుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేసు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. కాగా, ఈ కేసులో రోజువారీ విచారణ 11వతేదీ నుంచి జరగనుంది.

ప్రైవేటీకరణ కుట్రలు ఆపండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కుట్రలు ఆపాలని, కర్నూలు జిల్లాలో యురేనియం తవ్వకాలను నిలిపివేస్తూ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. విజయవాడ సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం పి.ప్రసాద్ (న్యూ డెమోక్రసీ) అధ్యక్షతన గురువారం జరిగింది. సమావేశానికి కె.రామకృష్ణ, జల్లి విల్సన్(సీపీఐ), వి.శ్రీనివాసరావు, సీహెచ్ బాబురావు (సీపీఎం), సుధీర్ (ఎస్‌యూసీఐ), మోహన్ (న్యూ డెమోక్రసీ), ఖాదర్ బాషా (ఎంసీపీఐ), పోలారి (న్యూ డెమోక్రసీ), కల్యాణకృష్ణ (ఎంఎల్) లిబరేషన్) తదితరులు హాజరయ్యారు. సమావేశంలోని వివిధ అంశాలను చర్చించి కీలక తీర్మానాలు చేశారు. అనంతరం మీడియాకు పార్టీ నేతలు ఓ ప్రకటన విడుదల చేశారు. మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయటానికి రకరకాల కుట్రలు కొనసాగిస్తోందని, కార్మికులు, ప్రజల ఆందోళనతో తాత్కాలికంగా వెనక్కి తగ్గినా...ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఆపలేదని నాయకులు తెలిపారు. ప్రైవేటీకరణ అపుతామని ప్రకటించిన టీడీపీ, జనసేన నేతలు చిత్తశుద్ధితో కేంద్రంపై ఒత్తిడి చేయడం లేదని, సర్వే పేరుతో ఉద్యోగులకు మోసపూరితమైన వీఆర్‌ఎస్ ప్రకటించిందని తెలిపారు. కేంద్రం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించకపోవడం, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి ప్రయత్నించడం, సెయిల్‌లో విలీనంపై ప్రకటన చేయకపోవడం కేంద్రం కుట్రలకు అద్దం పడుతోందన్నారు. సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంపైన, మోదీపైన ఒత్తిడి తీసుకొచ్చి విశాఖ ఉక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ ప్రతిపాదనలను ఉపసంహరించుకున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయాలని, వీఆర్‌ఎస్ ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. విశాఖ ఉక్కును కాపాడటానికి బదులుగా అనకాపల్లి జిల్లాలో మిత్తల్ అధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ పెడతామనడంలో రాష్ట్ర ప్రజలను మోసగించడమేనని, రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం వెంటనే చేపట్టాలన్నారు. ప్రభుత్వ పారిశ్రామిక విధానంలో కడప ఉక్కు ప్రస్తావనే లేదని, కేంద్రం విద్రోహానికి ఇదో మచ్చుతునకని తెలిపారు. కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల ప్రాంతంలో యురేనియం తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైందని, ఇందుకుగాను కొంతకాలం నుంచి ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. స్థానిక ప్రజలు పెద్దఎత్తున ఉద్యమం చేపట్టడంతో పాలకులు తవ్వకాలు లేవని చెప్పి నమ్మించు ప్రయత్నిస్తున్నారన్నారు. యురేనియం తవ్వకాల వల్ల అనేక ప్రమాదాలు ఉన్నాయని, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నందున ఈ తవ్వకాలను నిలిపివేస్తున్నట్లుగా అధికారికంగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజలు చేస్తున్న ఆందోళనకు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాయని స్పష్టంచేశారు. కృష్ణానది, బుడమేరు, గోదావరి తదితర నదుల వరదలతో లక్షల మంది ప్రజలు తీవ్రంగా నష్ట పోయారన్నారు. వరద బాధితులందరికీ ఇంకా పూర్తిగా సహాయం అందలేదని, బాధితులు అనేకచోట్ల ఆందోళనలు చేస్తున్నారని గుర్తుచేశారు. మళ్లీ దరఖాస్తులు పెడుతున్నప్పటికీ... పూర్తిస్థాయిలో న్యాయం జరగడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతి ఒక్క వరద బాధితుడికి సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు.

అఘోరి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తెలంగాణలో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ మహిళా అఘోరి హల్‌చల్ చేస్తున్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి క్షేత్రానికి గురువారం వచ్చిన ఆమె ఆలయంలోకి వెళ్లాలనుకున్నారు. వస్త్రాలు లేకుండా శివయ్య గోపురం ద్వారా గుడిలోకి ప్రవేశించబోగా హోంగార్డులు, ప్రైవేటు భద్రతా సిబ్బంది ఆమెను అడ్డుకున్నారు. దీనికి నిరసనగా ఆమె తనతో తెచ్చుకున్న పెట్రోల్‌ను శరీరంపై, తన కారుపై పోసి అంటించుకోవడానికి ప్రయత్నించారు. భద్రతా సిబ్బంది ఆమెకు బట్టలు తొడిగారు. ఆలయ సీఎస్వో నాగభూషణం యాదవ్ పోలీసులకు సమాచారం అందించారు. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ గోపి ఘటన స్థలానికి చేరుకొని ఆమెను అక్కడి నుంచి పంపడానికి ప్రయత్నించారు. దీంతో ఆమె పోలీసులపై విరుచుకుపడ్డారు. మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని... చంపేస్తున్నారని... అక్కడికి వెళ్లని పోలీసులు తనను అడ్డుకోవడానికి వచ్చారని మండిపడ్డారు. మీ దగ్గర ఆయుధం ఉంది కదా నన్ను కాల్చేయండి అంటూ ఎదురు తిరిగారు. తాను అఘోరినని ఎంత మందినైనా చంపడానికి తనకు అధికారం ఉందని చెప్పారు. కాణిపాకం ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకున్నానని... ఎవరూ అభ్యంతరం చెప్పలేదన్నారు. కొద్దిసేపు ఉదికత్త తర్వాత దేవస్థానం అంబులెన్స్‌లో ఆమెను బుచ్చినాయుడుకండ్రిగ అవతల దింపినట్లు సీఐ గోపి తెలిపారు. అఘోరి రాత్రి 7.30గంటలప్పుడు చీర కట్టుకుని ఆలయానికి రావడంతో దర్శనానికి అధికారులు అనుమతించారు. దీంతో ఆమె పోలీసు బందోబస్తు మధ్య దర్శనం చేసుకున్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

అన్నింటా ప్రభుత్వ వైఫల్యం: వైసీపీ అధినేత జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది... చీకటి రోజులు నడుస్తున్నాయి...ప్రశ్నించే స్వరం లేకుండా అణగదొక్కే చర్యలు కన్పిస్తున్నాయంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వ తప్పుడు కేసులపై న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో చంద్రబాబు కూటమి నేతలు ఏం చెప్పారు?, ఏం చేస్తున్నారు?, రెండింటికీ పొంతనలేదని మండిపడ్డారు. ఐదు నెలలు గడిచినా సూపర్6 లేదూ, సెవెన్ లేదన్నారు. ప్రతి వర్గాన్ని మోసగించారని, అన్ని వ్యవస్థలను నీరుగార్చారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు. గోరుముద్ద నిర్వీర్యమైంది. ప్రభుత్వం అన్నింటా పూర్తిగా విఫలమైంది. దాదాపు లక్షన్నర పెన్షన్లు తీసేశారు. కొత్త పెన్షన్లు లేవు. వాటిపై ప్రశ్నించే వారిని కేసులు పెట్టి భయభ్రాంతుల్ని చేస్తున్నారు. అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. విజయవాడ వరద సహాయ పనులు, ఉచిత ఇసుక, నూతన మద్యం పాలసీ తదితర అంశాల్లో ప్రభుత్వం వైఫల్యాల్ని ప్రశ్నించినందుకు అన్యాయంగా కేసులు నమోదు చేస్తారా? అని నిలదీశారు. కరెంటు చార్జీలు ఐదేళ్లు పెంచబోమన్నారని, ఇప్పటికే రూ.6 వేల కోట్ల భారం వేశారన్నారు. వచ్చే నెల రూ.1100 కోట్ల భారం పడనుందని వివరించారు. 41(ఏ) కింద నోటీసు ఇచ్చి విచారణ చేయాలన్న సుప్రీం ఆదేశాలను పోలీసులు ధిక్కరిస్తున్నారని... నేరుగా సీఎం, ఆయన కుమారుడు, డిప్యూటీ సీఎం, డీజీపీ దగ్గరుండి ఇవన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తే... చూస్తూ ఊర్కోబోమని... మళ్లీ తమ ప్రభుత్వం వచ్చాక ఎక్కడున్నా వారిని రప్పిస్తామని హెచ్చరించారు. ఈ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదనే విషయాన్ని పోలీసులు గుర్తెరగాలన్నారు. తప్పు చేసిన ప్రతి పోలీసు అధికారిపై ప్రైవేట్ ఫిర్యాదు చేస్తామని, ప్రతి బాధితునికి వైసీపీ సంపూర్ణ మద్దతిస్తుందని జగన్ భరోసా ఇచ్చారు. అధికారం ఎల్లకాలం ఉండబోదనీ, జమిలీ ఎన్నికలు అంటున్నారని...ఎన్నికలు త్వరలోనే రావొచ్చు లేదా ఉండేది నాలుగేళ్లే అని జగన్ వ్యాఖ్యానించారు.

విద్యుత్ చార్జీలు పెంచం

వైసీపీ హయాంలో విద్యుత్ రంగం విధ్వంసం

అధిక ధరలకు కొనుగోళ్లు...1.29 లక్షల కోట్ల నష్టం

ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గత వైసీపీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని విధ్వంసం చేసిందని, ఐదేళ్లలో దాదాపు రూ.1.26 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని పరిధిలోని తాళ్లాయపాలెంలో రూ.505 కోట్లతో నిర్మించిన 400/220 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ విద్యుత్ ఉపకేంద్రాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఇదే ప్రాంగణం నుండి రాష్ట్రంలో రూ.702 కోట్లతో నిర్మించిన 5 సబ్ స్టేషన్లు ప్రారంభించి, రూ.4,665 కోట్లతో చేపట్టనున్న 14 ఏపీ ట్రాన్స్ కో పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రసంగించారు. గత ప్రభుత్వంలో విద్యుత్ రంగంలో దొరికినచోటల్లా అప్పులు తెచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు తాకట్టు కూడా పెట్టారు. సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులతో చేసుకున్న ఎంఓయూలు రద్దు చేసి వేధించారు. దేశం మొత్తం ఛీ కొట్టింది. దేశానికే పెట్టుబడులు రావని హెచ్చరించినా వినలేదు. సోలార్ ప్యానెల్‌కు చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం ఖర్చు చేయాల్సి ఉంది.కానీ ప్యానెల్స్ నుండి వచ్చే విద్యుత్ ను తీసుకోలేదు. దీంతో విద్యుత్ వాడకుండానే రూ.9 వేల కోట్లు డబ్బులు చెల్లించాల్సి వచ్చింది. రూ.9 సార్లు కరెంట్ చార్జీలు పెంచారు. రూ.32 వేల కోట్లకు పైగా భారాన్ని వినియోగదారులపై మోపారు. నాటి శని ఇంకా కొనసాగుతోంది. విండ్ పవర్ వాడకపోవడంతో రూ.500 కోట్లు కట్టారు. హిందూజా వద్ద ఒప్పందం ప్రకారం కొనుగోలు చేయకపోవడంతో రూ.1,235 కోట్లు చెల్లించారు. కృష్ణపట్నం, వీటీపీఎస్ పూర్తి చేయకపోవడంతో ఇప్పుడు ఖర్చులు పెరిగాయి. పోలవరం హైడల్ ప్రాజెక్టు పూర్తి చేయకపోవడంతో దానికి కూడా ఇప్పుడు భారం పడుతోంది. దుర్మార్గులకు అధికారం ఇచ్చినందుకు పరిహారం ప్రజలు చెల్లించాల్సి వస్తోంది. ప్రజల సొమ్మును ఇష్టారీతిన దుర్వినియోగం చేశారని విమర్శించారు. 2019-24 మధ్య 43,416 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొనుగోళ్లకు రూ.26 వేల కోట్లు ఖర్చు పెట్టారు. యూనిట్ ను రూ.7.61 రూపాయలకు కొన్నారు. అందుకే ముందుగానే అగ్రిమెంట్ చేసుకుంటే తక్కువ ధరకు వస్తుంది. మిగులు ఉంటే పవర్ గ్రిడ్ కు ఇవ్వవచ్చు. 2019కి ముందు యూనిట్ ధర రూ.4.70 పైసలకు కొంటే గత ప్రభుత్వం రూ.7.61లకు కొనుగోలు చేసింది. యూనిట్ ను రూ.3 లు అదనంగా కొనుగోలు చేశారు. కమీషన్లకు కక్కుర్తి పడి ఎక్కువ ధరకు విద్యుత్ కొన్నారని చంద్రబాబు గత ప్రభుత్వ పనితీరుపై ధ్వజమెత్తారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమని చంద్రబాబు స్పష్టం చేశారు. అయితే విద్యుత్ వినియోగదారులపై కూటమి ప్రభుత్వం విధించిన ఆరువేల కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీల భారంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. సీఎం దీని ఊసెత్తకపోవడం గమనార్హం.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టే సైకోలపై కఠిన చర్యలు

సోషల్ మీడియాలోనూ కొందరు సైకోలు ఇష్టానుసారం పోస్టులు పెడుతున్నారు. అడ్డూఅదుపు లేకుండా ఆడబిడ్డలపై పోస్టులు పెట్టి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. వెధవలకు కుటుంబాలు లేవేమో... కానీ మనం గౌరవంగా బతుకుతున్నాం. నా సతీమణి గురించి అసెంబ్లీలో అసభ్యకరంగా మాట్లాడినప్పుడు కన్నీళ్లు పెట్టుకున్నా. అలాంటి మాటలు విన్నప్పుడు ఎంతటి సహనం గల మనిషికైనా బాధ, రోషం కలుగుతుంది. మదమెక్కిన ఆంబోతుల మాదిరి సోషల్ మీడియాలో చెప్పకూడని భాషలో పోస్టులు పెడుతున్నారు.

పవన్‌తో హోంమంత్రి అనిత భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులో లేకపోతే తానే హోంమంత్రి పదవి సైతం తీసుకుంటానని పవన్ కల్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఇటు ప్రజల్లో, అటు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్రంలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తుండగా... గురువారం రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను హోంమంత్రి వంగలపూడి అనిత మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఫేక్ పోస్టులపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, హోంశాఖ తీసుకుంటున్న చర్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి అనిత తీసుకెళ్లారు. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఆడబిడ్డలకు అన్యాయం చేసిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని అనితకు ఉప ముఖ్యమంత్రి సూచించారు. కూటమిలో కలహాలు లేవన్న సంకేతం ఇచ్చేలా ఉప ముఖ్యమంత్రి పవన్ తో భేటీ అనంతరం అందుకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ... ఫోటోలను హోంమంత్రి అనిత తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్టు చేశారు. దీనిపై నెటిజన్లు రకరకాలుగా వ్యాఖ్యలు చేస్తున్నారు.

జగన్ డ్రామాలు: దీపక్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత జగన్ మీడియా సమావేశం నాటకీయంగా ఉందని సీడ్ ఏపీ ఛైర్మన్ దీపక్ రెడ్డి విమర్శించారు. మహిళలను కించపరుస్తూ వైసీపీ మూకలు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతుంటే వారిపై చర్యలు తీసుకోకుండా జగన్‌లా ముద్దాడాలా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దీపక్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యాచారాలు, లైంగిక దాడులకు జగన్ గంజాయే కారణమన్నారు. హోంమంత్రి అనితపై అసభ్య పోస్టులు పెట్టలేదా? ఉపముఖ్యమంత్రి కుమార్తెలను సామాజిక మాధ్యమంలో ఏడ్పించించి నిజం కాదా? అని ప్రశ్నించారు. తాడేపల్లి ప్యాలెస్ పక్కనే దళిత యువతిపై సామూహిక అత్యాచారం జరిగితే పరామర్శించని జగన్... అత్యాచారాలపై మాట్లాడటం రాక్షసులు వేదాలు వల్లించినట్లు ఉందని దీపక్‌రెడ్డి ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయకత్వంలో మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఐదేళ్లు అధికారమిస్తే పట్టించుకోకుండా... నేడు గుడ్‌బుక్ పెట్టి గుర్తు పెట్టుకుంటామంటే... మీ పార్టీ నేతలే నమ్మరని జగన్‌నుద్దేశించి అన్నారు. దమ్ముంటే ఈనెల 11న అసెంబ్లీకి రావాలని దీపక్‌రెడ్డి సవాల్ విసిరారు.

రైతును దగా చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకువచ్చిన ధాన్యాన్ని జాప్యం లేకుండా మిల్లర్లు కొనుగోలు చేయాలని కోరారు. గోనె సంచుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డీఏంఓ త్రినాథ్ బాబు, ఏడీఏ నర్సింహారావు, తహసీల్దార్ పి.కృష్ణ, డీటీ ఉమా మహేశ్వరరావు, టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు, ఏఓ రాజేశ్వరి, డీసీసీబీ మేనేజర్ శాంతి రాఘమయి, ఉపాధ్యక్షులు కూచిపూడి జగన్నాధరావు, డైరెక్టర్ చంద్రగిరి శ్రీనివాస్‌రావు, ఏఈఓ మమత, పర్యవేక్షణ అధికారి జయశ్రీ, ఆడిటర్ హనుమాన్, సంఘం కార్యదర్శి పండ్ల సారయ్య, రైతులు సలిగంటి శ్రీనివాస్, ననీడాల సుధాకర్, మన్నెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శారదా పీఠం భూముల స్వాధీనం

(మొదటిపేజీ తరువాయి)

అందిన తర్వాత భూమిని స్వాధీనం చేసుకోవాలని రెవిన్యూ శాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సుమారు 225 కోట్ల రూపాయల విలువ చేసే ఆ భూములను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియాకి రెవిన్యూ అధికారులు సమాచారం పంపారు. శారదా పీఠానికి భూమి కేటాయింపునకు గాను ఆ సమయంలో ధర నిర్ణయించాలని అప్పటి కలెక్టర్‌ను జగన్ ప్రభుత్వం కోరగా... రిజిస్ట్రేషన్ విలువ పరిగణలోకి తీసుకుని ఎకరాకు రూ.1.8 కోట్లకు ఇవ్వొచ్చని సిఫార్సు చేశారు. అయినా కూడా ప్రభుత్వం ఎకరాను కేవలం లక్ష రూపాయాలకే కేటాయించారు. విచారణలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు అధికారులు తేల్చారు. గత మంత్రివర్గ సమావేశంలో కూటమి ప్రభుత్వం ఈ భూముల కేటాయింపులను రద్దు చేయాలని తీర్మానించగా... రెవెన్యూ శాఖ అందుకు తగినట్టుగా చర్యలు చేపట్టింది.

ఏడుగురికి ఐపీఎస్ హోదా

(మొదటిపేజీ తరువాయి)

ఎ.రమాదేవి, బి.ఉమా మహేశ్వర్, జె. రామ్మోహనరావు, ఎస్. శ్రీదేవి రావు, అశోక్‌కుమార్ ఐపీఎస్ హోదా పొందగా, 2023 బ్యాచ్‌లో కేజీవీ సరిత, కె.చక్రవర్తి ఐపీఎస్ హోదా పొందారు. గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశాన్ని ప్రభుత్వం త్వరితగతిన పూర్తిచేసి జీవో రూపంలో ఉత్తర్వులు జారీ చేసినందుకు వీరు డీజీపీ ద్వారకా తిరుమల రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతల సుస్థిర స్థాపనకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు.

ఆదివాసీ ప్రజలకు అండగా ఉంటాం : సీఐ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఆదివాసీ ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటామని టేకులపల్లి సిఐ. సురేష్ అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఆళ్లపల్లి మండల పరిధిలోని బూర్సాయి గుత్తికోయ గ్రామాన్ని గురువారం ఆళ్లపల్లి పోలీసులు సందర్శించారు. వలస ఆదివాసి ప్రజలు నివసిస్తున్న ఈ గ్రామంలో మలేరియా, డెంగ్యూ లాంటి విష జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. సమాచారాన్ని తెలుసుకొని అక్కడ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు పలు రకాల వైద్య పరీక్షలు చేయించి, ఉచితంగా మందులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామంలోకి ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు. వలస ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం జిల్లా ఎస్పీ సారథ్యంలో వారికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లపల్లి ఎస్సై రితీష్, టి ఎస్ ఎస్పి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజా వ్యతిరేకత

ఇల్లందు - విశాలాంధ్ర: గత ఎన్నికల్లో అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలను మోసం చేసిందని, పది నెలల్లోనే ఈ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ విమర్శించారు. గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు శీలం రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రేగా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా సర్వే, ఇతర కార్యక్రమాల పేరుతో కాలయాపన చేస్తూ ప్రజల నమ్మకాలను వమ్ము చేశారని ఆరోపించారు. ముఖ్యంగా రైతులకు రైతుభరోసా ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. బోనస్ ఇస్తామని ప్రభుత్వం మాటలకే పరిమితమయ్యిందన్నారు. ఉచిత బస్సు పథకం పూర్తిగా విఫలం అయిందని ఎద్దేవా చేసారు. మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పి 10 నెలలు గడిచినా దిక్కులేదన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజల గుండెల్లో నిలిచిన కేసీఆర్ పట్ల పెరుగుతున్న ఆదరణను ఓర్వలేక కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నదన్నారు. ప్రశ్నించిన సోషల్ మీడియా గొంతులను నలిపేస్తున్నట్లు విమర్శించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు నూ కక్షపూరితంగా జైలుకు పంపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసే కక్షపూరితమైన అరాచకాలకు చక్ర వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉద్యమ నాయకులు దిండిగాల రాజేందర్, రేణుక, ప్రమోద్, లాల్ సింగ్, సిలివేరి సత్యనారాయణ, జెకె శ్రీను, యలమద్ది రవి, ఘాజీ పాల్గొన్నారు.

ఒక్క పూట బడులతో చదువు కొనసాగేదెలా...

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి

విశాలాంధ్ర-ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వం కులగణన కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉపయోగించి ఒక్కపూట బడులు నిర్వహించడం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడమేనని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర్ శర్మకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే చేయడం కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉపయోగించడం, అందుకోసం ప్రాథమిక పాఠశాలలకు ఈనెల 6 నుండి 30 వరకు ఒక్కపూట బడులు నిర్వహించడం జరుగుతుందని, అన్నారు. జిల్లా వ్యాప్తంగా 750 పైగా ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని, దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాబోధన సరిగా అందకపోవడమే కాకుండా, ప్రభుత్వ పాఠశాల విద్యపై పెను ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడానికే కులగణనకు ఉపాధ్యాయులను ఉపయోగించవద్దని డిమాండ్ చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కులగణనకు ఉపాధ్యాయులను ఉపయోగించకుండా ఇతర ఉద్యోగుల ద్వారా కులగణన సర్వే చేపట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో శివ నాయక్ వంశీ రాకేష్ ప్రతాప్ సునీల్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలి

విశాలాంధ్ర - కొమరం భీమ్ : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియలు కుటుంబ సభ్యుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. గురువారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని ఓల్డ్ కాలనీలో కొనసాగు తున్న సర్వే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు.

కాటన్ మిల్లుపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-హుస్నాబాద్: పత్తి రైతులను మోసం చేస్తున్న బాలాజీ కాటన్ మిల్లు యజమాని పై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపీపీ గడిపె మల్లేష్ తెలిపారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తికి పత్తి రైతులను మోసం చేస్తున్న బాలాజీ కాటన్ మిల్లు యజమాని శివనాథుని కృష్ణమూర్తి, సీసీఐ అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిపంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముతుండగా, సీసీఐ అధికారులు కాటన్ ఇండస్ట్రీస్ యజమానితో కుమ్మక్కై తేమ, తరుగు పేరుతో తక్కువ ధరకు కొంటూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. త్వరలోనే విచారణకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తామని ఆర్డీవో తెలిపారన్నారు. సీపీఐ నాయకులు ఐలేని సంజీవరెడ్డి, రఘుపతి గౌడ్, జనగాం రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో-మహబూబాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేదల అభ్యున్నతి కోసం ఇందిరాగాంధీ మొదలుకొని నేటి వరకు పేదల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో భాగంగా పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్వి రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గత పది సంవత్సరాలు పాలించిన బి.ఆర్.ఎస్ పార్టీ ఏడు లక్షల పంతొమ్మిది కోట్లు అప్పు చేసిందని, ఆ అప్పుకు వడ్డీ చెల్లిస్తూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ, ఉచిత విద్యుత్తు, ఉచిత బస్ సర్వీసు, 500 కే గ్యాస్ అందిస్తున్నామన్నారు. తెలంగాణలో ఉన్న భూములను ధరణి పేరుతో కొల్లగొట్టిన వారే కాంగ్రెస్ ప్రభుత్వం పై గుడ్డ కాల్చి మీద వేసే పనిలో బావా బామ్మర్దులు ఉన్నారన్నారు. నెల రోజుల్లో స్మార్ట్ కార్డు అందించబోతున్నామని, ఆ కార్డు ద్వారా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం 1,52,000 టెండర్లు పిలిచి 82,000 ఇండ్లు పూర్తి చేశారని, మిగిలిన ఇండ్లు మొండి గోడలతో దర్శనం ఇచ్చిందని, ఇది కేసీఆర్ పాలనకు నిదర్శనం అన్నారు. గత ప్రభుత్వం రైతు సంక్షేమమని చెప్పి లక్ష రూపాయల రైతు రుణమాఫీ దశలవారీగా చేసి వడ్డీలకే సరిపోయిందన్నారు. కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేశామని, మిగిలిన వాటిని కూడా డిసెంబర్ లోపు పూర్తి రుణమాఫీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. దొరల కోసం తీసుకువచ్చిన ధరణి అండతో కబ్జాల చేసిన వాటిని నెల రోజుల్లో ధరణి ప్రక్షాళన చేస్తామని చెప్పారు.

ఎట్టి పరిస్థితుల్లో రైతుబంధు తీసివేయ మని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. అన్ని వర్గాలకు అండగా ఉంటూ సంక్షేమాన్ని ముందుకు తీసుకెళుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పేద విద్యార్థుల కోసం 40 శాతం మెస్ చార్జీల పెంచమన్నారు. గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే భుజాలు తరుముకున్నట్టు ఉంది అన్నారు. బాంబులేవీ అంటున్నారు వారికి టపాసుల శబ్దం వినపడడం లేదన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని, తప్పు చేసాము అనుకుంటే సరెండర్ కావాలని హితవు పలికారు. ఖమ్మం జిల్లాలో తాను పార్టీలో చేరుతున్నప్పుడు లక్షలాది కార్యకర్తల సమక్షంలో నీవు పక్కన ఉండగానే, ఒక తండ్రిలా భావించి మీ తండ్రి కాళ్లు పట్టుకున్నా, కానీ నమ్మించి తడిగుడ్డతో గొంతు కోశారన్నారు. ఈ సమీక్ష సమావేశంలో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోతు రామచంద్ర నాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, రాజయ్య, పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి, కాకిరాల హరిప్రసాద్, నూతనంగా మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం చేసిన తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బట్టు నాయక్, పాలకవర్గం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి

ఇల్లందు - విశాలాంధ్ర : ఇల్లందు, టేకులపల్లి మండలాల్లో మద్యం దుకాణ దారులంతా కలిసి సిండికేట్ గా మారి ఎంఆర్పీ కన్నా అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారని బెల్ట్ షాప్‌లకు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన నేతలు డిమాండ్ చేసారు. గురువారం జిల్లా అధ్యక్షుడు మాలోత్ శివ నాయక్, ఇల్లందు టేకులపల్లి మండల అధ్యక్షులు భూక్య దేవ్ సింగ్ నాయక్, యువసేన అధ్యక్షుడు సురేష్ నాయక్ కలిసి ఎక్సైజ్ సీఐకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధన లకు వ్యతిరేకంగా అన్ని మండలాల్లో అక్రంగా మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు ఆరోపించారు. దింతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలపై అధిక భారం పడుతుందన్నారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలకు విరుద్ధంగా గ్రామపంచాయతీలలో ప్రతి వీధికి ఇష్టారాజ్యాంగ బెల్ట్ షాపుల ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజలను దోపిడీ చేస్తున్నట్లు ఆరోపించారు. పగలు రాత్రి తేడా లేకుండా అమ్మకాలు చేస్తూ ముఖ్యంగా యువతను బానిస చేస్తున్నారని విమర్శించారు. తక్షణమే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ నాయక్, నరేష్ నాయక్, అంజి నాయక్, రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ఎస్సీ ఎస్టీలకు భారత రాజ్యాంగం, చట్ట ప్రకారం ఉన్న హక్కులు, సంక్షేమం కోసం పాటుపడాలని ప్రభుత్వాలు చేస్తున్న కృషిని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. ఐడి ఓసి లోని మందిరంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ కేసులపై కలెక్టర్ అధ్యక్షతన రివ్యూ మీటింగ్ జరిగింది. ఇందులో హాజరైన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎస్పీ రోహిత్ రాజు, కమిషన్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సభ్యుల నుదేశించి మాట్లాడుతూ ఈ వర్గాలకు భారత రాజ్యాంగం, చట్టప్రకారం హక్కులు, సంక్షేమం కోసం ప్రభుత్వాలు చేస్తున్న కృషిని వివరించారు. పౌర హక్కుల దినం రోజున కేవలం ఎస్సీ ఎస్టీ హక్కుల కోసం మాత్రమే కాకుండా వారి సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించేలన్నారు. పథకాలలో ప్రథమ ప్రాధాన్యత ఎస్సి, ఎస్టీలకు ప్రభుత్వాలు ఇస్తున్నాయన్నారు. భద్రాచలం మొబైల్ కోర్టులో జడ్జి లేకపోవడం వల్ల అనేక కేసులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏ పీ ఓ జనరల్ ఐటీడీఏ డేవిడ్ రాజు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి అనసూయ, జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, సిపిఓ సంజీవరావు, కలెక్టరేట్ ఏవో రమాదేవి, ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు ఎనుమురి లక్ష్మీబాయి, చింతల రవికుమార్, లౌడియా సామ్య లకావత్ వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. గురువారం మెదక్ జిల్లా రాయన్‌పల్లి ప్రాజెక్టులో చేప పిల్లలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మాట్లాడుతూ మత్స్య కార్మికుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మెదక్ జిల్లాలో 82 చెరువులలో 66 లక్షల 24 వేల చేప పిల్లలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులో 92 వేల చేప పిల్లలను వదిలారు. జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం తహసిల్దార్ లక్ష్మణ్ బాబు ఆర్ఐ లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ చౌదరి, హఫీజుద్దీన్, శంకర్ పాల్గొన్నారు.

ఐఎఫ్‌సీ నుంచి 25 మిలియన్ డాలర్లను సేకరించినప్రొఫెక్టస్ క్యాపిటల్

ముంబయి : ప్రొఫెక్టస్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై (ఎంఎస్ఎంఈలు) దృష్టిసారించిన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ, ప్రపంచబ్యాంక్ గ్రూప్‌లో సభ్యుడైన ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ)కి నాన్-కన్వర్టబుల్ డిబెంచర్లు (ఎన్‌సీడీలు) జారీ చేయడం ద్వారా 25 మిలియన్ డాలర్లను (సుమారు రూ.205 కోట్లు) సమీకరించింది. భారతదేశంలోని ఎంఎస్ఎంఈల కోసం ఎనర్జీ ఎఫిషియెంట్ (ఈఈ) మెషినరీ అనేది ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండస్ట్రీలో ఒక ప్రత్యేక అసెట్ క్లాస్, ఇటువంటి యంత్రాలకు ఫైనాన్సింగ్ చేయడంలో ఇది ఐఎఫ్‌సీ మొదటి పెట్టుబడి. ఇంటర్నేషనల్ క్యాపిటల్ మార్కెట్ అసోసియేషన్ గ్రీన్ బ్రాండ్ ప్రిన్సిపల్‌కు అనుగుణంగా ప్రొఫెక్టస్ క్యాపిటల్, గ్రీన్ బ్రాండ్ ఫ్రేమ్‌వర్క్‌ను అభివృద్ధి చేసింది.

సామ్‌సంగ్ ఆరవ తరం ఫోల్డబుల్ గెలాక్సీ ఫోన్లపై భారీ ఆఫర్లు

గురుగ్రామ్: భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్ తాజాగా తమ అత్యంత ప్రజాదరణ పొందిన ఆరవ తరం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్‌లు - గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6పై అద్భుతమైన రీతిలో పరిమిత కాల ఆఫర్‌లను ప్రకటించింది. గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6ని కొనుగోలు చేసే వినియోగదారులు 24 నెలల నో-కాస్ట్ ఈఎంఐతో పాటుగా రూ.144999 కంటే తక్కువ ధరకే స్మార్ట్‌ఫోన్‌ను పొందుతారు. అదేవిధంగా, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6ని కొనుగోలు చేసే వినియోగదారులు పరిమిత కాలపు పండుగ ఆఫర్‌లో భాగంగా 24 నెలల నో-కాస్ట్ ఈఎంఐతో పరికరాన్ని కేవలం రూ.89999కి పొందుతారు. గెలాక్సీ జెడ్ ఫోల్డ్6 ధర రూ.164999 మరియు గెలాక్సీ జెడ్ ఫ్లిప్6 ధర రూ.109999 నుండి ప్రారంభమవుతుంది. మెరుగైన రీతిలో సరసమైన ధరలను కోరుకునే వినియోగదారులు గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6ను రూ. 2500 నుండి, గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6ను రూ. 4028 తో ప్రారంభమయ్యే సౌకర్యవంతమైన ఈఎంఐ అవకాశాల ద్వారా కొనుగోలు చేయవచ్చు.

క్రిమ్సన్‌కు వెల్ హెల్త్-సేఫ్టీ సర్టిఫికేషన్

హైదరాబాద్: ఇంటర్నేషనల్ వెల్ బిల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐడబ్ల్యూబీఐ) నుండి ప్రతిష్ఠాత్మకమైన వెల్ హెల్త్-సేఫ్టీ రేటింగ్ (వెల్ హెచ్ఎస్ఆర్) అందుకున్న మొదటి భారతీయ పాఠశాలగా నగరానికి చెందిన క్రిమ్సన్ నిలిచింది. హైదరా బాద్, బెంగళూరులోని ఐదు క్రిమ్సన్ పాఠశాల భవనాలు, సౌకర్యాలు, ఫిల్టర్, పీల్చదగిన గాలి, శుద్ధి చేసిన త్రాగదగిన నీరు, శుభ్రపరచడం, శానిటైజేషన్ విధానాలు, ఆవిష్కరణ, అత్యవసర పరిస్థితుల నివారణ, సంసిద్ధత తదితర 29 ప్రమాణాలలో 16 ప్రమాణాలను అందుకోవటం ద్వారా ఈ సర్టిఫికేట్ పొందింది. హైదరాబాద్‌లోని సర్టిఫైడ్ క్రిమ్సన్ స్కూల్స్‌లో సుచిత్ర, కీసరలోని సెయింట్ ఆండ్రూస్ స్కూల్, సెయింట్ మైఖేల్స్ స్కూల్, అల్వాల్ ఉండగా, బెంగళూరులో వైట్‌ఫీల్డ్, జక్కూర్‌లోని విన్‌మోర్ అకాడమీ ప్రపంచ ప్రఖ్యాత సర్టిఫికేషన్ పొందాయి. ఇప్పటివరకు, ప్రపంచ వ్యాప్తంగా కేవలం 14 విద్యా వృత్తిపరమైన శిక్షణా సంస్థలు మాత్రమే ఈ సర్టిఫికేషన్ పొందాయి.

టాటా ప్లే సౌత్ టాకీస్‌లో రోమాంటిక్ మూవీ 'తెల్లవారితే గురువారం'

హైదరాబాద్: టాటా ప్లే సౌత్ టాకీస్‌లో 8 నవంబరు 2024న తెలుగులో రాత్రి 7 గంటలకు ప్రసారమయ్యే 'తెల్లవారితే గురువారం'తో రొమాన్స్, నవ్వుల సుడిగాలిలో తేలిపోండి! ఆకర్షణీయమైన నట త్రయం శ్రీ సింహా కోడూరి, చిత్రా శుక్లా, మిషా నారంగ్ నటించిన ఈ చిత్రం ప్రేమ, హాస్యం, ఊహించని మలుపుల సమ్మేళనాన్ని అందిస్తుంది. వరుడు తన పెళ్లి రాత్రి ఒక్కసారిగా డీలాపడిపోవడం, మిమ్మల్ని కట్టిపడేసే ఘటనలు, ఉల్లాసకరమైన సంఘటనలతో కూడిన సన్నివేశాలతో వీక్షకులకు ఆహ్లాదాన్ని అందిస్తూ కథనం కొనసాగుతుంది. ఈ సినిమాను ఇస్ రాత్ కీ సుబహ్ నహీ పేరిట హిందీలోకి డబ్ చేశారు. కనుక, తెలుగు చలనచిత్ర పరిశ్రమ నుంచి ఈ ఆధునిక రొమాంటిక్ కామెడీని ఆస్వాదించేందుకు పాప్‌కార్న్‌ని తింటూ, సర్వీస్ నంబర్ 350ను (టాటా ప్లేలో మాత్రమే) ట్యూన్ చేసుకోవాలని కోరుతోంది.

ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ త్రైమాసిక ఆదాయాల వెల్లడి

ముంబయి: ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ తన బలమైన వృద్ధి బాటలో ముందంజలోకి వెళుతూ, 30 సెప్టెంబరు 2024తో ముగిసిన రెండవ త్రైమాసికంలో ఏకీకృత ఫలితాలను ప్రకటించింది. బ్యాంక్ త్రైమాసిక ఆదాయం రూ.674 కోట్లు కాగా గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 58%, గత త్రైమాసికంతో పోల్చితే 10% పెరిగింది. బ్యాంక్ నికర లాభాలు రూ.11.2 కోట్లు కాగా, ఏడాది నుంచి ఏడాదికి పోల్చితే ఇది 45% వృద్ధి చెందింది. ఏడాది నుంచి ఏడాదికి పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికం (క్యూ2 ఎఫ్‌వై25)లో ఈబీఐటీడీఏ 87% వృద్ధితో రూ.76.1 కోట్లకు చేరుకుంది. ఈ మైలురాయిలో, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ నెలవారీ లావాదేవీల వినియోగదారు సంఖ్య 102 మిలియన్లకు చేరుకోగా, ఇది ఏడాది నుంచి ఏడాదికి 76% వృద్ధి చెందింది. వార్షిక స్థూల సరుకుల విలువ 40 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటగా, ఇది బ్యాంక్ డిజిటల్ సేవింగ్స్ ఖాతాలు, ఇతర ఉత్పత్తులను స్వీకరించడాన్ని ప్రతిబింబిస్తుంది.

15 నుంచి కామిక్ కాన్ ఇండియా

హైదరాబాద్: ఉపఖండంలోని అతిపెద్ద పాప్ కల్చర్ వేడుక అయిన కామిక్ కాన్ ఇండియా హైదరాబాద్ లో జరగనుంది. నగరంలోని హైటెక్స్‌లో ఈ సంవత్సరం మొదటిసారిగా, హైదరాబాద్ కామిక్ కాన్ మూడు యాక్షన్ ప్యాక్డ్ రోజులలో నవంబర్ 2024 15, 16, 17వ తేదీలలో మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఇది అనిమే, గేమింగ్ పాప్ సంస్కృతి ప్రేమికులకు అసాధారణమైన అనుభవాన్ని అందిస్తుందని కామిక్ కాన్ ఇండియా వ్యవస్థాపకుడు జతిన్ వర్మ చెప్పారు. అంతిమ ఉత్సవం గీకీ నగరానికి తిరిగి రావడంతో, మునుపెన్నడూ లేనంత పెద్దదిగా, మెరుగ్గా, ఉత్సాహంతో కామిక్ కాన్ నిర్వహిస్తామన్నారు. మారుతి సుజుకి అరేనా హైదరాబాద్ కామిక్ కాన్ 2024ని ప్రదర్శిస్తుందన్నారు. ఇది క్రంచైరోల్ ద్వారా అందించబడుతుందని, ఇక్కడ హాజరైన ప్రతి ఒక్కరూ రేడియంట్ బ్లాక్ కామిక్ నంబర్ 1 సంచికను అందుకుంటారని, అలాగే యెన్ ప్రెస్ ద్వారా ప్రత్యేక సోలో లెవలింగ్ పోస్టర్, స్మారక కామిక్ కాన్ ఇండియా బ్యాగ్ అందించనున్నట్టు చెప్పారు.

పుణేలో మొదలైన అభయ్ ప్రభవన మ్యూజియం

పుణే: జైన తత్వశాస్త్రం, భారతీయ వారసత్వం గొప్పదనాన్ని ప్రతిబింబిస్తూ అభయ్ ప్రభవన మ్యూజియాన్ని పుణెలో నెలకొల్పారు. ప్రస్తుతం ఈ మ్యూజియాన్ని 'మ్యూజియం ఆఫ్ ఐడియాస్'గా అభివర్ణిస్తున్నారు. ఈ అభయ్ ప్రభవన మ్యూజియాన్ని అమర్ ప్రేరణ ట్రస్ట్ చైర్మన్ అభయ్ ఫిరోదియా స్థాపించారు. ఈ మ్యూజియానికి ఆయనే వ్యవస్థాపకుడు కూడా. ఈ మ్యూజియం ఏర్పాటు ద్వారా భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని సంరక్షించడంలో, ప్రచారంచేయడంలో ఒక కీలకమైన మైలురాయిని ఇది సూచిస్తుంది. ఈ అద్భుతమైన కార్యక్రమానికి ఎంతోమంది ప్రముఖులు, సాహితీవేత్తలు, చరిత్రకారులు హాజరయ్యారు. భారతీయవ్యవస్థలో జైన మత విలువలు చూపిన ఔచిత్యం గురించి లోతైన అవగాహన కల్పించడమే ఈ మ్యూజియం ఏర్పాటు ముఖ్య ఉద్దేశం. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్రమంత్రివర్యులు నితిన్ గడ్కరీ, కేంద్రమంత్రి వర్యులు, గ్వాలియర్ మహారాజా అయినటువంటి జ్యోతిరాదిత్య సింధియా హాజరయ్యారు. హేగ్‌లోని ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ న్యాయమూర్తి దల్వీర్ భండారీ ఈ వేడుకకు అధ్యక్షత వహించారు.

ఐఈఈఈ జీఆర్ఎస్ఎస్ ఎస్‌వైడబ్ల్యును నిర్వహించిన కెఎల్‌హెచ్ అజీజ్‌నగర్

న్యూఢిల్లీ: హైదరాబాదులోని కెఎల్‌హెచ్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ, ఐఈఈఈ జియోసైన్స్, రిమోట్ సెన్సింగ్ సొసైటీ (జీఆర్ఎస్ఎస్) స్టూడెంట్, యంగ్ ప్రొఫెషనల్, ఉమెన్ కాంగ్రెస్ (ఐఈఈఈ జీఆర్ఎస్ఎస్ ఎస్‌వైడబ్ల్యు 2024)ని తమ అజీజ్ నగర్ క్యాంపస్‌లో నవంబర్ 7, 2024న సగర్వంగా నిర్వహించింది. ఐఈఈఈ జీఆర్ఎస్ఎస్ ప్రొఫెషనల్ యాక్టివిటీస్, ఐఈఈఈ జీఆర్ఎస్ఎస్ గ్లోబల్ యాక్టివిటీస్, ఐఈఈఈ రియాక్ట్ ఇండియా ఇనిషియేటివ్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. 'మెషిన్ లెర్నింగ్ అండ్ జిఐఎస్ ఇన్ అగ్రి-ఫుడ్ సిస్టమ్స్' అనే నేపథ్యంపై కాంగ్రెస్ దృష్టి సారించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ అధునాతన సాంకేతికతలు వ్యవసాయం, ఆహార వ్యవస్థలను ఎలా విప్లవాత్మకంగా మారుస్తున్నాయనేది ఇది తెలుపుతుంది. ప్లానెట్ (యుఎస్ఏ)లో సమాచార వనరుల వైస్ ప్రెసిడెంట్ కీలీ రోత్, ఐఈఈఈ జిఆర్ఎస్ఎస్ కోశాధికారి, డిఎల్ఆర్ (జర్మనీ), ఫైరూజ్ స్టాంబౌలి, ఐఈఈఈ జిఆర్ఎస్ఎస్‌లో డిఎల్ స్పీకర్, డిఎల్ఆర్ (జర్మనీ), మిహై డాట్కు ప్రొఫెషనల్ యాక్టివిటీస్ వైస్ ప్రెసిడెంట్, ఐఐటి బాంబే, అవిక్ భట్టాచార్య, ఐఐఐటీ బెంగళూరు నుండి రహిషా తొట్టొలిల్, చెన్నైలోని అన్నా యూనివర్శిటీకి చెందిన శోబా పెరియసామి వంటి వక్తలు తమ పరిజ్ఞానం పంచుకున్నారు.

ప్రారంభమైన దుబాయ్ ఫిట్‌నెస్ ఛాలెంజ్

దుబాయ్: అందరికీ వినోదం, ఫిట్‌నెస్, కమ్యూనిటీ అనుభవాలతో నిండి ఉన్న దుబాయ్ ఫిట్‌నెస్ ఛాలెంజ్ (డిఎఫ్‌సి) మొదటి వారం ప్రణాళికతో ప్రారంభమయింది. ఎక్కడా లేని రీతిలో ఉచిత, 30-రోజుల ఆరోగ్యం ఫిట్‌నెస్ యాక్టివేషన్ ద్వారా 30 రోజుల పాటు ప్రతిరోజూ కేవలం 30 నిమిషాల వ్యాయామానికి కట్టుబడి ఉండమని డిఎఫ్‌సి మిమ్మల్ని సవాలు చేస్తుంది. మీకు అడుగడుగునా మద్దతు ఇవ్వడానికి. నవంబర్ 24, ఆదివారం వరకు ఇది అందుబాటులో ఉంది, మీ ఆరోగ్యం, వెల్నెస్ ప్రయాణాన్ని ప్రారంభించడానికి, ఫిట్‌నెస్‌ను మీ రోజువారీ అలవాటుగా మార్చుకోవడానికి ఈ అవకాశాన్ని కోల్పోవద్దని కోరుతోంది. టవల్, రీఫిల్ చేయగల వాటర్ బాటిల్ తీసుకురావాలని గుర్తించుకోవాలని, ఉత్తేజకరమైన కార్యకలాపాలు, ఫోటో అవకాశాలతో నిండిన ఈ ఛాలెంజ్ ఫిట్‌నెస్, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కోసం శక్తివంతమైన గమ్యస్థానంగా నిలుస్తుంది. షెడ్యూల్‌లను తనిఖీ చేయడానికి దుబాయ్‌ఫిట్‌నెస్‌ఛాలెంజ్.కామ్‌ని సందర్శించాలని కోరింది.

భవిష్యత్తు మొబిలిటీ విజన్‌ని ప్రదర్శించిన హీరో మోటోకార్ప్

ముంబయి: 'బి ది ఫ్యూచర్ ఆఫ్ మొబిలిటీ' అనే మా విజన్‌తో, వినూత్నత, సుస్థిరత్వంలో హద్దులను అధిగమించడం, కొత్త ప్రమాణాలను నిర్దేశించడాన్ని హీరో మోటోకార్ప్ లక్ష్యంగా పెట్టుకుంది. పర్యావరణ సుస్థిరతపై దృష్టి సారిస్తూనే 120 మిలియన్ల కస్టమర్లకు సేవలందించడంలో సంస్థ అంకిత భావాన్ని పటిష్టం చేస్తూ వారి కార్యకలాపాలను విస్తరించినట్లు హీరో మోటోకార్ప్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ పవన్ ముంజాల్ తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద మోటార్ సైకిళ్లు, స్కూటర్ల తయారీదారు అయిన హీరో మోటోకార్ప్ ఈఐసీఎంఏ 2024లో అనేక ఉత్తేజకరమైన, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త మోటార్‌సైకిళ్లను, ఒక ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఆవిష్కరించింది. 2025 రెండో అర్ధభాగం నాటికి పలు యూరోపియన్ దేశాలు, యూకే మార్కెట్లలోకి ప్రవేశించాలని కంపెనీ తన ప్రణాళికలను ప్రకటించింది. 'బి ది ఫ్యూచర్ ఆఫ్ మొబిలిటీ' అనే తన విజన్‌కు అనుగుణంగా హీరో మోటోకార్ప్ తన ప్రీమియం శ్రేణి కొత్త, ఇప్పటికే ఉన్న ఇంటర్నల్ కంబుషన్ ఇంజిన్ (ఐసీఈ), ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) ఉత్పత్తులను ప్రదర్శించింది.

రాజస్థాన్ ప్రభుత్వంతో హిందుస్థాన్ జింక్ అవగాహన ఒప్పందం

ముంబయి: హిందుస్తాన్ జింక్ లిమిటెడ్ రాజస్థాన్ ప్రభుత్వ విద్యా శాఖతో తాజాగా అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది, రాబోయే ఐదు సంవత్సరాల్లో విద్యాభివృద్ధికి రూ.36 కోట్ల పెట్టుబడికి కట్టుబడి ఉంది. రాష్ట్రం. జైపూర్‌లో జరిగిన రైజింగ్ రాజస్థాన్ చొరవలో భాగంగా ఎడ్యుకేషన్ ప్రీ-సమ్మిట్ సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి ప్రేమ్ చంద్ బైర్వా, రాజస్థాన్ విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్, రాజస్థాన్ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి కల్నల్ రాజ్యవర్ధన్ రాథోడ్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ పెట్టుబడి తన ఫ్లాగ్‌షిప్ ఎడ్యుకేషన్ ఇనీషియేటివ్, శిక్షా సంబల్ ప్రోగ్రామ్ కింద 72 ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి సారిస్తుంది. టీచర్ ట్రైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్, వొకేషనల్ ట్రైనింగ్‌తో సహా వివిధ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా విద్య నాణ్యతను పెంచడం కంపెనీ లక్ష్యం.

అహ్మదాబాదు నుండి మాటర్ ఏఈఆర్ఏ డెలివరీస్ షురూ

అహ్మదాబాదు: ఈవి సాంకేతికత, ఇంధన నిల్వ పరిష్కారాలలో అగ్రగామి అయిన మాటర్ గ్రూప్, శక్తివంత నగరం అహ్మదాబాదులో మొట్టమొదటి ఎక్స్‌పీరియన్స్ హబ్‌ను ప్రారంభించింది. ఈ వేడుకలో మాటర్ వ్యవస్థాపకులు, ఇతర బృందముతోపాటు రాజ్యసభ పార్లమెంట్ సభ్యులు గోవింద్ భాయ్ ధోలకియా పాల్గొన్నారు. ఈ కొత్త స్పేస్ ఆవిష్కరణ, ఆడంబరం, సుస్థిరతలకు ఉదహరిస్తుంది. వినియోగదారులకు భౌతిక, డిజిటల్ ప్రపంచాలను ఒక 'ఫిజిటల్' వాతావరణాలను సమ్మిళితం చేయడం ద్వారా తర్వాతి-తరం రీటెయిల్ అనుభవాన్ని అందిస్తుంది. అహ్మదాబాదు నడిబొడ్డులోని నవరంగపురాలో ఉన్న మాటర్ ఎక్స్‌పీరియన్స్ హబ్ కేవలం ఒక రీటెయిల్ అవుట్‌లెట్ మాత్రమే కాదు, ఇది ద్వి-చక్ర వాహన కొనుగోలు అనుభవాన్ని పునర్నిర్వచించుటకు సాంకేతికత, ఉత్పత్తి అన్వేషణ, జీవనశైలి, కస్టమర్ కేర్ కలిసే ఒక ప్రత్యేకమైన, వినూత్నమైన చోటు. ఆధునిక ఓపెన్ స్పేసెస్ నుండి ప్రేరణ పొందిన ఈ హబ్‌లో భవిష్యత్, ఆచరణాత్మక ఇంటీరియర్స్ ఉంటాయి.

విద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి కీలకం

హైదరాబాద్: ఆక్సిలో ఫిన్‌సర్వ్ నిర్వహించిన 'ఎడ్యువిజన్ 2024' అనే కార్యక్రమంలో ప్రముఖ పరిశ్రమ దిగ్గజాలు, పాఠశాలల యాజమాన్యాలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా విద్య నాణ్యతను మెరుగుపరచడం, విద్యా మౌలిక సదుపాయాలను ఆధునీకరించడం, అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడం గురించి ఇక్కడ చర్చించారు. ఎడ్యువిజన్ కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్కే మహమూద్ 'ముఖ్య అతిథి'గా హాజరయ్యారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇతర పరిశ్రమ ప్రముఖులలో సౌమ్య వేలాయుధం, డైరెక్టర్, ఎడ్యుకేషన్ అండ్ స్కిల్లింగ్ కెపిఎంజి ఇన్ ఇండియా, సాక్షి సోధి, సీనియర్ టెక్నికల్ అసిస్టెన్స్ అడ్వైజర్, ఆపర్చునిటీ ఇంటర్నేషనల్, ఇండియా, రేష్మా బేగం, ప్రిన్సిపాల్, వాక్సాన్ ఇంటర్నేషనల్ స్కూల్, డాక్టర్ సస్మిత పురుషోత్తం, చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి), బొగెన్‌విల్లే డా.స్కూల్, ఎస్.శివరామకృష్ణ ఆచార్య, చైర్మన్, ఎస్ఆర్‌కె గ్రూప్ ఆఫ్ స్కూల్స్, అశోక లతా బీరా, ఫౌండర్, సీఈఓ, నోబుల్ పామ్స్ స్కిల్స్, నీరజ్ శర్మ, సీబీఓ, ఆక్సిలో ఫిన్సర్వ్ ఉన్నారు.

సంపాదకీయం

అమెరికీకరణ

అమెరికా రాజకీయ పరిణామాలు కేవలం ఆ దేశం మీదే కాక అంతర్జాతీయ రాజకీయాల మీద కూడా అమితమైన ప్రభావం చూపడం కొత్త కాదు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ 2016లో మొదటిసారి అమెరికా అధ్యక్షుడైతే 78వ ఏట ఇప్పుడు రెండవసారి అధ్యక్షుడయ్యారు. ఇది చరిత్రాత్మక విజయం అని అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న వారూ ఉన్నారు. ట్రంప్‌తో తలపడ్డ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ భారతీయ మూలాలు ఉన్నవారు. రిపబ్లికన్ పార్టీ కన్నా డెమొక్రాటిక్ పార్టీ కాస్త ప్రగతిశీలమైంది అన్న అభిప్రాయం చాలాకాలం ఉండేది. కానీ ఇటీవలి రాజకీయ పరిణామాలు ఆ సరిహద్దు రేఖను చెరిపేశాయి. సైద్ధాంతికంగా ఆ రెండు పార్టీల మధ్య అభేదమే గోచరిస్తోంది. కానీ కమలా హారిస్ రెండు ప్రధానాంశాల ఆధారంగా అధ్యక్ష ఎన్నికలలో పోటీకి దిగారు. ఒకటి: ప్రజాస్వామ్య పునరుద్ధరణ. అంటే అమెరికాలో ప్రజాస్వామ్యం పలచబడిందనే అనుకోవాలి. రెండు: మహిళల హక్కుల పరిరక్షణ. అది ప్రధానంగా సంతానం కనడంపై మహిళలకు ఉండవలసిన హక్కులకు సంబంధించింది. కమలా హారిస్ ఓటమి ఈ రెండు ఎజెండాలను తిరస్కరించింది. అమెరికా ప్రజలు తమ అధినేతగా ఎవరిని ఎన్నుకుంటారు అన్నది ఆ దేశ పౌరులే నిర్ణయించుకుంటారు. అది వారి హక్కు కూడా. ట్రంప్ గత ఏలుబడిని చూసినా ఆయన ప్రజాస్వామ్యాన్ని అంతగా ఖాతరు చేసిన దాఖలాలులేవు. విచిత్రం ఏమిటంటే ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు మన దేశంలో ఆనందోత్సాహాలు మిన్నంటుతున్నాయి. ట్రంప్ భారత ప్రధాన మంత్రి అయ్యారా లేక భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడై పోయారా అన్నంతగా ఆనందం వ్యక్తమవుతోంది. అధికార పక్షమైన మోదీ నాయకత్వంలోని సంఘ్ పరివార్ శ్రేణుల్లో ఈ ఆనందం వెల్లివిరిస్తే పెద్దగా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. ట్రంప్ విజయం పట్ల మన దేశంలోని మితవాదవర్గాలలో వ్యక్తమవుతున్న ఉత్సాహం ఆశ్చర్యం కలిగిస్తోంది. మరి ట్రంప్ విజయం వల్ల భారత–అమెరికా సంబంధాలలో మౌలికమైన సానుకూల ప్రభావం ఏమైనా ఉంటుందా? ట్రంప్ గెలుపు భారత ప్రయోజనాలను పరిరక్షించడానికి ఇసుమంతైనా ఉపకరిస్తుందా? ట్రంప్ భారత ప్రధానమంత్రికి మిత్రుడే కావచ్చు. కానీ ఏ దేశ విదేశాంగ విధానమైనా ఆ దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తుంది కనక ట్రంప్ విజయంపై ఇంత ఉత్సాహం ఎందుకు? అమెరికా అధ్యక్ష ఎన్నికలపై భారత మీడియాలో కనిపిస్తున్న ఉత్సాహం అమెరికాలోని న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్ పత్రికలలోనూ కనిపించడం లేదు. ఈ హడావుడిచూస్తే ట్రంప్ భారత్ ఎన్నికలలో విజయం సాధించినట్టుగా కనిపిస్తోంది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ బలం తగ్గి ఉండవచ్చు. కానీ అంతకుముందు పదేళ్లనుంచి భారత ప్రధానమంత్రిగా ఉన్న మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయినప్పుడూ ఇంత మహోత్సాహం మన మీడియాలో కనిపించలేదు. ట్రంప్‌ను మోదీ "నా ప్రియమైన స్నేహితుడు విజయం సాధించినందుకు హృదయపూర్వక అభినందనలు" అని ఉండవచ్చు. కానీ గత జూన్‌లోనే మోదీ పదవీ విరమణ చేయనున్న అమెరికా అధ్యక్షుడు బైడెన్‌ను కూడా "నా ప్రియమిత్రుడు" అనే సంబోధించారుగా. మోదీ అభినందన అధికార పూర్వక మర్యాదల ప్రకారం ఉచితమైందే. అది ఆయన బాధ్యత కూడా. ట్రంప్‌తో మోదీ ఫోన్లో మాట్లాడారని అంటున్నారు. ట్రంప్ విజయానికి జయకేతనాలు ఎత్తడంలో భారత పత్రికలు చేస్తున్న హడావుడి అవి అమెరికా నుంచి వెలువడుతాయా లేదా అమెరికా కోసం వెలువడుతాయా అన్న అభిప్రాయం కలగడంలో అనౌచిత్యం ఏమీ కాదు. ట్రంప్‌ను "డాన్" అని సంబోధించి భారత పత్రికలు తరించిపోయాయి. ఇది అమెరికా ప్రభావం మన దేశాన్ని సంపూర్ణంగా ఆవహించిందనడానికి నిదర్శనం.

నిజానికి ట్రంప్ విజయం అమెరికా ప్రజాస్వామ్యాన్ని మరోసారి ప్రశ్నార్థకం చేసేదే. ఆయన ప్రభుత్వం కచ్చితంగా మితవాదం వేపే మొగ్గుతుంది. అమెరికా ప్రజలూ మితవాదాన్నే కోరుకుంటున్నట్టున్నారు. అందుకే మన దేశంలోని మితవాదులు అంతగా ఆనంద భరితులవుతున్నట్టు ఉంది. "అమెరికా ఫస్ట్" అని నినదించించే ట్రంప్ హెచ్ 1–బి వీసాలలో కోత పెట్టరన్న భరోసా ఎక్కడైనా ఉందా? ట్రంప్ విధానాలు రెక్కలు కట్టుకుని అమెరికాలో వాలిపోవాలన్న భారతీయుల ఆశలపై కచ్చితంగా నీళ్లు చల్లేవిగానే ఉంటాయి. అంటే ట్రంప్‌కు జయజయ ధ్వానాలు పలికేవారు స్వస్వరూప జ్ఞానాన్ని కూడా వదిలేసినట్టున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే కూడా ట్రంప్‌ను అభినందించారు. ఆయన సందేశంలోని మాటలకు, మోదీ అభినందనలోని మాటల మధ్య పూర్తి సామ్యం ఉంది. ఖడ్గే అభినందించడం కూడా అధికార మర్యాదల్లో భాగం అని సరిపెట్టుకుందాం. కానీ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సందేశం కూడా మర్యాదలో భాగం అని కొట్టి పారేయడానికి ఆస్కారమే లేదు. మన ప్రతిపక్షం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కంకణం కట్టుకున్నామని చెప్తోంది. రాహుల్ సందేశం ఎంతమాత్రం దీనికి అనుగుణంగా లేదు. అమెరికా ఎన్నికలలో ఓడిపోయింది కేవలం కమలా హారిస్ కాదు. ప్రజాస్వామ్య పరిరక్షణ అన్న భావనే పరాజితమైంది. ఒకవేళ కమలా హారిస్ గెలిచి ఉంటే మన అధికార పక్షం, మీడియా ఇంతటి భారీస్థాయిలో అభినందనలతో వెల్లువెత్తించేవా? ట్రంప్ విజయం తరవాత మన దేశంలో కనిపిస్తున్న ఉల్లాసం చూస్తే ప్రతిపక్షాలు కూడా కమలా హారిస్ అపజయాన్ని ప్రజాస్వామ్య అపజయంగా భావించడం లేదేమోనన్న అనుమానం కలుగుతోంది. ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ అన్న మాటలను కనీసం ట్రంప్‌ను అభినందించే తొందరలో పక్కన పెట్టినట్టుగా ఉంది. కమలా హారిస్‌ను అమెరికా ప్రజలు ఓడించడం అంటే 2024లో మోదీ ప్రభావం తగ్గడంపై ప్రతీకారం తీర్చుకున్నారన్న భావన కమ్ముకున్నట్టుంది. ఇప్పటిదాకా ఒక్కసారి కూడా మహిళ అమెరికా అధ్యక్షురాలు కాలేదు. మొదట హిల్లరీ క్లింటన్, ఇప్పుడు కమలా హారిస్ అవకాశాన్ని జారవిడుచుకున్నారు. ఇటీవల రాహుల్ గాంధీ టెక్సాస్‌లో మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి ప్రస్తావించారు. హారిస్ ఓడడం అంటే ప్రజాస్వామ్యం పరాజయం పాలైందన్న భావన ఎందుకు కలగలేదో! ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడేవారి గొంతులు కూడా మూగవోయాయి. ఎలాన్ మస్క్ లాంటివారు ట్రంప్ విజయానికి ఆనందభరితులు కావడం అంటే ఇది బడా పెట్టుబడిదార్ల విజయమే అనుకోవాలి. పెట్టుబడిదారుల విజయం అంటే నిశ్చితంగా సామాన్య ప్రజల ఓటమే. జర్నలిస్టులపై దౌర్జన్యం జరిగితే ఆనందించిన ట్రంప్‌ను మన గోదీ మీడియా అంతగా ఎగిరెగిరి సమర్థిస్తోందంటే వారి ఆత్మలు ఎక్కడ తాకట్టు పడి ఉన్నాయో చెప్పక్కర్లేదు. మన ప్రతిపక్షాలు ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ కనీసం నినాదాలుగా కూడా మిగలవు.

బహుజనులకు నామినేటెడ్ పోస్టులేవి?

డా. ముచ్చుకోట సురేష్‌బాబు

బీసీలకు 34 శాతం నామినేటెడ్ పోస్టులు అని బూటకపు ప్రకటన తప్ప ఊసే లేదు, అనేక వాగ్దానాలు చేసి బహుజనుల ఓట్లు వేయించు కున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలలో తొంభై శాతం ప్రజలు వ్యవసాయం, పాడి పరిశ్రమ, చేతివృత్తులు, గ్రామీణ కూలీలుగా జీవనోపాధి సాగిస్తున్నారు. రైతులకు పెట్టుబడి సాయం రూ.20,000 ఇస్తామన్న ప్రభుత్వం వాగ్దానం మరచి, చార్జీలు పెంచమని మానిఫెస్టోలో చెప్పి, సర్దుబాటు చార్జీల పేరుతో రూ.11,000 కోట్లు వినియోగదారుల నుంచి ముక్కుపిండి వసూలు చేయడానికి సిద్ధపడ్డారు. వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. సమగ్ర కుల గణన జరిగితే సమాజంలో ఏ వర్గాలు బాగుపడ్డాయో తెలుస్తుంది. వీటితోపాటు ఎంతమంది నాబార్డ్, అపార్డ్, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్, శీతల గిడ్డంగులు, బ్యాంకుల ద్వారా రుణం తీసుకున్న కులాలవారి జాబితా అన్ని పత్రికల్లో ప్రచురిస్తే బహుజనులు ఎంతమేరకు అభివృద్ధి చెందారో అర్థం అవుతుంది. ఏమాత్రం సామాజిక సమగ్రతలేని పార్టీలు బహుజనుల అభివృద్ధి కాంక్షిస్తారని అనుకోవడం ఎండమావే. తిరుమలలో స్వామివారి పవిత్రతకు, ప్రసాదాలకు అనవసర విషయాల పట్ల మొత్తం హిందూ సమాజానికి ప్రతినిధులుగా మాట్లాడుతున్నవారు, తమ పార్టీకి మూడు మంత్రి పదవులు ఇస్తే అందులో రెండు తన సామాజిక వర్గానికి, ఒకటి కమ్మ సామాజిక వర్గానికి కేటాయించారు. పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణం పట్ల ఏమాత్రం అవగాహనలేని వ్యక్తులు పచ్చని పంట పొలాల్లో యురేనియం మంట పెడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో హోం మినిస్టర్ దళితురాలు కాబట్టి నేను హోం మంత్రి అయితే పరిస్థితి వేరుగా ఉంటుంది అంటూ ఆంధ్రాలో శాంతి భద్రతలు ఉత్తర్ ప్రదేశ్‌తో పోలుస్తున్నారు. ఇంతకూ ఆంధ్రను ఉత్తరప్రదేశ్ లాగా మార్చాలని అనుకుంటున్నారా ఈ మేధావి. మరో వైపు పక్కనున్న తెలంగాణాలో పదిహేను వేల కోట్లు రైతు రుణ మాఫీ చేపట్టి, పదకొండు వేల ఉపాధ్యాయ పోస్టులు, మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం, నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా స్కూల్, మూసీ నది అక్రమ కట్టడాలు, చెరువులు, కుంటలు, తలపరిలో ఆక్రమించిన రియల్ ఎస్టేట్ అక్రమార్కుల ఆటకట్టించడానికి హైడ్రా, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పునర్నిర్మించడం, నోటిఫికేషన్లు జారీ చేయడం, పరీక్షలు సక్రమంగా నిర్వహించడం, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుచేసి దేశంలోనే ప్రగతిపథాన సమగ్ర కులగణనచేపట్టి ఆదర్శ రాష్ట్రంగా మెరుగైన సమాజం వైపు అడుగులేస్తున్నది. కులం మన సమాజంలో ఎంతో ప్రధానమైనది, దానికి ఉన్న ప్రభావం ఎంతటిదో అన్ని కోణాల నుంచి వివరంగా అర్థం చేసుకోకుండా మన సామాజిక వ్యవస్థను సమగ్రంగా తెలుసుకోవడం సాధ్యం కాదు.

ప్రాథమికంగా మన సమాజంలో ఏ కులానికి చెందిన వారు ఎంతమంది ఉన్నారు, వారు మొత్తం రాష్ట్ర జనాభాలో ఎంత శాతం, వారికి వారి జనాభా నిష్పత్తిలో విద్య, ఉద్యోగ, సంపద అవకాశాలు దక్కుతున్నాయా అనే మౌలికమైన ప్రశ్నలకు జవాబులు తెలుసుకున్నప్పుడు సామాజిక న్యాయం అనే భావన సార్థకం అవుతుంది. ఈ దేశంలో ఆ అసమానతలు,దోపిడీకి కారణం కులం అని అంబేద్కర్ చెప్పారు. ఎక్కువగా శూద్ర కులాలు, అతి శూద్ర కులాలు మాత్రమే అసమానతకు, అన్యాయనికి, దోపిడీకి గురికావడాన్ని కాదనలేము. వాటిని రూపుమాపడానికి ఈ దేశంలో రాజ్యాంగం ద్వారా ప్రయత్నించి హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బహుజనుల హక్కుల ఆలంబనగా, విముక్తి కోసం, విడుదలకోసం పోరాటం చేయడం అనివార్యం. ఆధిపత్య శక్తులు తమ దామాషాకు, మూడు నాలుగు రెట్ల అవకాశాలను నొక్కుతున్న నేపథ్యంలో, గత ఏడు దశాబ్దాల రాజ్యాంగ పాలనలో, ఎవరి హక్కుల కోసం వారు, ఎవరి ఆధిపత్యం కోసం వారు పరిమితం అయిపోతుండగా, యితరులకు కరివేపాకు లాగే మిగిలి పోతున్న బీసీ వర్గం, తమ హక్కులు తాము దక్కించుకోవాలంటే ప్రముఖంగా చేయవలసింది ఏమిటి అనే దానికి సరైన సమాధానం కావాలి.

బీసీ కులాల అస్తిత్వ నిర్మాణం చిక్కబడాలి. బీసీ కులాల మధ్య అంతర్గత ఐక్యత పెరగాలి. ఈ రెండూ జరగడానికి వీలుగా, దామాషా హక్కుల కోసం సమిష్టి కృషి కొనసాగిస్తునే, దొరుకుతున్న అవకాశాలు బీసీ కులాల మధ్య సమానంగా పంపిణీ జరగాలి. సరైన నాయకత్వ నిర్మాణం బీసీలకు కావాలి. జాతీయ స్థాయిలో, బీసీలకు సరైన గుర్తింపు దొరకాలి. అది జాతీయ స్థాయిలో, బీసీ సంఘాన్ని వ్యవస్థీకృతం చేయకుండా వీలుకాదు. వ్యవస్థీకృత నిర్మాణం ద్వారా, బీసీల కీలక సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు జరగాలి. అంతిమంగా, బీసీ నాయకత్వంలో బలమైన రాజకీయ వేదిక నిర్మాణం జరగాలి. తద్వారా జాతీయ స్థాయిలో బీసీలకు రాజ్యాధికారం చేపట్టాలి. దాంట్లో ఎవరి దామాషా హక్కులు వారికి చెందాలి. అదే సమ సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుంది. బీసీలు వారికి చెందవలసిన అవకాశాలు వారికి దొరకడానికి ఇలాంటి కృషి చాలా అవసరం. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈబిసి రిజర్వేషన్లు ఎత్తివేయాలి.

మధ్య తరగతి జీవనం అధ్వానం

కృష్ణ ఝా



పేదరికం, ఆకలి, నిరుద్యోగంతో ఇండియా మునిగిపోయింది. ఆదే సమయంలో మధ్యతరగతి జీవనం అధ్వానంగా తయారైంది. మధ్య తరగతి ప్రజానీకం ఏ మాత్రం ఉపశమనం పొందడంలేదు. ప్రజలంతా ఇబ్బందులతో ఆవేదన చెందుతున్నారు. పేదలతోపాటు మధ్యతరగతి ప్రజలు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. మధ్య తరగతి ప్రజలకు, కార్మిక వర్గానికి పెద్ద తేడా ఏమీలేదు. దేశ వనరులు కొద్దిమంది గుత్తాధిపతుల వద్దకు చేరాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ గరిష్టస్థాయికి చేరింది. అనేక సంవత్సరాలుగా నిజవేతనాలు, వినిమయం ఏ మాత్రం పెరగకుండా స్తంభించి పోయాయి. ప్రజానీకంలో అధికంగా వినిమయం నిలిచిపోవడానికి కారణం ప్రభుత్వం ఏమీ వివరించకుండా ప్రజల ఆదాయాలు పెరిగాయని, పేదరికం తగ్గిపోయిందని, ప్రజల వినిమయం పెరిగిందని అబద్ధాల ప్రచారం మోగిస్తోంది. జాతీయనమూనా సర్వే (ఎన్‌ఎస్‌ఎస్‌ఓ) ప్రకారం, వినిమయం ఖర్చు దాదాపు దశాబ్దికాలంలో ఏడాదికి 3.5శాతం తగ్గింది. జీడీపీలో ఇది దాదాపు సగం ఉంటుంది. కుటుంబ పొదుపు సహజంగా పెరగవలసి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా కుటుంబాల పొదుపు గణనీయంగా పడిపోయింది. జీడీపీ వృద్ధి రేటును మితిమీరిచూపడంవల్ల ఆదాయం తగ్గిపోయిందని గణాంకాలు వెల్లడించాయి. అయితే, మధ్యతరగతి ఆదాయం స్తంభించడం, వినిమ యంపై మరింత అధ్యయనం చేయవలసి ఉంది.

అమెరికా ప్యూ-పరిశోధనా కేంద్రం ప్రకారం, మధ్యతరగతి జనాభా 2010 లో దాదాపు 50 మిలియన్ల నుంచి 70 మిలియన్లకు పెరిగారు. 2020 నాటికి 150 మిలియన్ల నుంచి 200 మిలియన్ల వరకు మధ్యతరగతి పెరిగింది. 2017లోనూ ఇండియా, చైనాలలో మధ్య తరగతి ప్రజలు ఎంతమంది ఉన్నారనేది ప్యూ పరిశోధనా కేంద్రం సర్వేచేసింది. దీని ప్రకారం, ఆదాయం, రోజుకు కొనుగోలు శక్తి ప్రకారం రోజుకు 10 డాలర్ల నుంచి 70 డాలర్ల దాకా నమోదైంది. ఈ సర్వే ప్రకారం, భారతదేశంలో మధ్యతరగతి ప్రజలు 2016నాటికి 108 మిలియన్లు ఉండగా, చైనాలో 707 మిలియన్ల మంది ఉన్నారు. ఖచ్చితంగా చెప్పాలంటే 61శాతం చైనా ప్రజలు రోజుకు 10డాలర్ల కంటే ఎక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు. అదే సమయంలో 3శాతం భారతీయులు మాత్రమే 10 డాలర్లకు కొద్దిగా మించిన ఆదాయంతో జీవిస్తున్నారు.

గడచిన పదేళ్లకాలంలో జీడీపీలో పన్ను నిష్పత్తి దాదాపు 15 నుంచి 18శాతం వరకు ఉంది. ఇండియాలో మధ్యతరగతి జనాభా గత పదేళ్లలో పెరగడంలేదు. అయితే ఇటీవలి సంవత్సరాల్లో అనుభవం ఏమంటే, ఆదాయాలు, పొదుపు మరింత కుచించుకుపోయి స్తంభించింది. కొన్ని శతాబ్దాలక్రితం ఫ్యూడల్ సమాజం అంతరించిపోతున్న దశలో పెట్టుబడీదారీవ్యవస్థ ఆవిర్భవించింది. రెండు వర్గాల మధ్య వైరుధ్యం ఉంది. ఇది కొత్త అవతారమే. ద్వంద్వత్వం వీటి లక్షణం. ఈ వ్యవస్థలో నూతనవర్గాలు, అణచివేతకు సంబంధించిన నూతన పరిస్థితులు, నూతన తరహా పోరాటాలు, ప్రాచీన పరిస్థితుల స్థానంలో వచ్చిచేరాయి. ఆధునిక ప్రపంచంలో పెట్టుబడీదారీ వ్యవస్థ నెమ్మదిగా కార్పొరేటీకరణ, ద్రవ్య పెట్టుబడి నియమ నిబంధనలు అత్యంత దారుణంగా ఉన్నాయి. బూర్జువా వ్యవస్థ చాలా భిన్నమైన విధానం. సమాజం మొత్తం మరింత విభజనకుగురై రెండు పరస్పర విరుద్ధమైన క్యాంపులుగా మారిపోయాయి. రెండు గొప్ప వర్గాలు కూడా ఏర్పడ్డాయి. ఒకదానికొకటి నేరుగా అవతరించాయి. ఇవి ఏమంటే: బూర్జువా, కార్మికవర్గం. సైన్సుపరమైన కష్టాలను లెనిన్ మహాశయుడు రూపొందించినందునే ఈ రెండు వర్గాలను పేర్కొన్నారు. లెనిన్ పెట్టుబడీదారీ వ్యవస్థ ముందుకు అడుగు వేస్తున్నప్పటి పరిణామాన్ని వివరించారు. మారుతున్న అవసరాలను తీర్చడంకోసం కొత్తదశ రాజకీయ చైతన్యాన్ని పెంపొందించారు. పరిణామ క్రమంలో నూతన అధ్యయనాన్ని లెనిన్ రూపొందించారు. ఈ దశలో ఆధునిక పరిశ్రమలు ఏర్పడ్డాయి. అలాగే ఆధునిక రాజ్యాలలో ప్రపంచ మార్కెట్టు అవతరించింది. ప్రపంచ మార్కెట్‌ను అనురించి ఆధునిక దేశాలు ఏర్పడ్డాయి.

> పెట్టుబడిదారీ వ్యవస్థ గరిష్టస్థాయికి చేరింది. అనేక సంవత్సరాలుగా నిజవేతనాలు, వినిమయం ఏ మాత్రం పెరగకుండా స్తంభించి పోయాయి. ప్రజానీకంలో అధికంగా వినిమయం నిలిచిపోవడానికి కారణం ప్రభుత్వం ఏమీ వివరించకుండా ప్రజల ఆదాయాలు పెరిగాయని, పేదరికం తగ్గిపోయిందని, ప్రజల వినిమయం పెరిగిందని అబద్ధాల ప్రచారం మోగిస్తోంది.

ఈ దశనాటికి అన్ని ఫ్యూడల్, పితృస్వామ్యవ్యవస్థ దాదాపు అంతరించింది. ఈ నూతన వర్గాన్ని లెనిన్ విశ్లేషించారు. అన్ని ఫ్యూడల్ మార్మిక సంబంధాలు అంతరించాయి. అయితే నిజంగా దాని క్రూరత్వాన్ని బైటపెట్టాయి. కొత్త పంధాలలో ముఖ్యమైనది స్వేచ్ఛా వాణిజ్యం. మతపరమైన, రాజకీయపరమైన మార్మికాలు బహిరంగంగా, దారుణంగా, ప్రత్యక్ష శక్తిగా బూర్జువా ముసుగుకింద ఉన్నది. గొప్ప మేధావులు, రచయితలు, శాస్త్రవేత్తలు తదితరులు చెల్లింపుల కార్మికులుగా మారిపోయారు. ఈ పరిణామం కొత్త పంథాను ఏర్పరచింది. మధ్యతరగతి జీవుల పరిస్థితి దిగజారుతోంది. పెట్టుబడీదారీ వ్యవస్థ పరిపక్వం చెందుతోంది. పరిణామ క్రమంకూడా దీన్ని పెంచుతోంది. ఈ దశలోనే మధ్యతరగతి వర్గం రూపొందింది. లెనిన్ మధ్యతరగతి ద్వంద్వ పరిస్థితిని ఆవిష్కరించారు. ఈ అంశాలను "టూ టాక్టిక్స్ ఆఫ్ సోషల్ డెమోక్రసీ" పుస్తకంలో వివరించారు.

క్షీణిస్తున్న భూసారం

టి.వి. సుబ్బయ్య

ప్రపంచమంతటా, ప్రత్యేకించి ధనిక దేశాలలో, అలాగే భారతదేశంలో గణనీయంగా భూసారం క్షీణించింది. జీవావరణం కోలుకోలేనంతగా కలుషితమైందని, ఇప్పటికైనా వేగంగా తగిన చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు హెచ్చరించినా సంపన్న దేశాలు కావలసినంతగా శ్రద్ధ తీసుకొని కాలుష్యాన్ని, దాని ఫలితంగా విపరీతంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించడంలేదు. అనేక రకాలైన కృత్రిమ రసాయన ఎరువులు, పైర్లకు పట్టే చీడ, పీడలను, క్రిమికీటకాలను నాశనం చేసేందుకు వాడే పురుగుల మందులవల్ల భూసారం తగ్గుతోంది. ఫలితంగా పంటలు తగ్గిపోతున్నాయి. భారత దేశంలో భూసారం ఇప్పటికే 33శాతం హరించుకుపోయింది. వివిధ రాష్ట్రాల్లో పంటలశాతం తరతమ విభేదాలుగా ఉన్నాయి. పంటల దిగుబడి తగ్గిపోవడం, రైతులు తీవ్రంగా నష్టపోవడం మూలంగా ప్రతి ఏటా అనేక పదులవేల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

హానికరమైన ఎరువుల వాడకం పెరిగింది. ప్రకృతి సిద్ధమైన, సేంద్రియ పంటలకు ప్రాధాన్యం ఇవ్వడంలేదు. వాతావరణ మార్పులు దేశంలో బీభత్సాన్ని సృష్టిస్తోంది. ఇవన్నీ కలసి అహార భద్రతకు ముప్పు కలిగించే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితులు ప్రపంచమంతటా ఉండే అవకాశాలున్నాయి. పంటపొలాల్లో భూసారం వేగంగా తగ్గిపోతోంది. భూసారం చక్కగా ఉన్నట్లయితే కోట్లాదిమందికి ఆహారభద్రత ఉంటుంది. వివిధ రూపాల్లో భూసారం ప్రతి ఏటా తగ్గుతుందని అంచనాలు వేస్తున్నారు. దేశం మొత్తం పంటపొలాల్లో 33శాతం భూసారం కోల్పోవడమైంది. నీటికొరత, వాయు బీభత్సం, క్షారత, వృక్ష సమూహాలను నరకడం తదితర కారణాలు భూసారం తగ్గడానికి కారణం. ఇటీవల అధికమవుతున్న ఈ సమస్యపైన సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్‌ఇ) సదస్సును నిర్వహించింది. ఈ సమస్యలతో ముడిపడిఉన్న వాతావరణ శిక్షణాసంస్థలో సదస్సు జరిగింది. సిఎస్‌ఇ ప్రధాన శాస్త్రవేత్త అనిల్ అగర్వాల్ ఆధ్వర్యంలో జరిగింది. దేశంలోని మొత్తం పంట భూములు 360 మిలియన్ల హెక్టార్లలో 115 నుంచి 120 మిలియన్ల హెక్టార్లలో భూసారం క్షీణించిందని ఈ సదస్సులో అంచనా వేశారు. ఇస్రో శాటిలైట్ ద్వారా, భూసార సైన్సుసంస్థ, భూసార సర్వే జాతీయ భ్యూరో తదితర సంస్థల ద్వారా సమాచారం సేకరించి చర్చించారు. రసాయనాలు, పాదార్థిక వస్తువుల ద్వారా భూసారం క్షీణిస్తుంది. రసాయనాలు భూమిని యాసిడ్‌మయంగా తయారు చేస్తున్నాయి.

ఒక్కోప్రాంతంలో ఒక్కోవిధంగా భూసారం తగ్గుతోంది. రైతులు వివిధ కారణాలతో యూరియాను అధికంగా వినియోగించడం కూడా భూసారం తగ్గడానికి ఒక కారణం. దీనివల్ల పంట దిగజారిపోతోంది. పొలంలో పదిరెట్లు భూసారం కోతకు గురైంది. తాజాగా ఎడారుల పరిస్థితి భూమి తరిగిపోతున్న అంశాలతో ఎస్‌ఏసి ఇండియా అట్లాస్‌ను ప్రచురించింది. నీటికొరత భూసారం క్షీణతకు ప్రధాన కారణం. దీనివల్ల దేశంలో పంటభూములు తగ్గిపోతున్నాయి. దేశంలో 11.01శాతం భూమి దెబ్బతింటోంది. మొక్కలు, చెట్ల సమూహం 9.15శాతం, తీవ్రమైన వాయుకోత 5.46 శాతం భూసారం తగ్గడానికి కారణం. వ్యవసాయం చేసే విధానాలు లోపభూయిష్టంగా ఉన్నాయి. అడవుల నరికివేత వేగంగా పెరగడం కూడా భూసారం కోతకు ప్రధాన కారణం. ఎడారుల ప్రభావం భూసారంపై ఉంటుంది. 2003–05 సంవత్సరాల మధ్యకాలంలో లక్ష మిలియన్లహెక్టార్లు ఎడారిగా తయారయ్యాయి.

కొంతమేరకు సహజసిద్ధమైన కోత, మనుషుల కార్యకలాపాలు ఉదాహరణకు గనుల తవ్వకం, మితిమీరిన పచ్చికబయళ్లు, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం, వివిధరకాల వాహనాలు, ప్రత్యేకించి విమానాల ద్వారా వెలువడే కాలుష్యం భూసారం క్షీణతను మరింతగా పెంచుతోంది. రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ రాష్ట్రాలలో అత్యంత తీవ్రంగా క్షీణిస్తున్న భూసారం ఇతర రాష్ట్రాలకంటే చాలా దారుణంగా ఉంది. ఉదాహరణకు రాజస్థాన్‌లో 21మిలియన్ల హెక్టార్లలో భూమి సారం క్షీణించింది. భూముల్లో తక్కువ పంటలుంటున్నాయి. అనేక ప్రాంతాల్లో నీటికొరతలు ఎక్కువగా, కొన్ని ప్రాంతాల్లో తక్కువగా ఉంటున్నాయి. ఫలితంగా ఈ ప్రాంతాల్లో పంటలు తక్కువగా ఉంటున్నాయి. మన దేశంలో వ్యవసాయరంగంపైన భూసారం క్షీణత అత్యంత ప్రభావం చూపుతోంది. కార్బన్ తక్కువగా ఉండటంతో ఎరువులు ఎక్కువగా వాడవలసి ఉంటుంది. కర్బనపు వాయువులు (కలుషిత వాయువులు) విడుదల పెరుగుతోంది.

తమిళనాడు వ్యవసాయంపై ఎక్కువగా ఆధారపడుతుంది. ఈ రాష్ట్రంలో భూసారం క్షీణత గణనీయంగా ఉంది. 2018–19లో 1.60 మిలియన్ల హెక్టార్లలో వివిధ రూపాల్లో భూసారం తగ్గుతోంది. తమిళనాట కొండ ప్రాంతాల్లో పంట భూములు తగ్గడం వల్ల ప్రజల వలసలు పెరుగుతున్నాయి. ఏటవాలుగా ఉన్న కొండప్రాంతాల్లో వర్షాలు ఎక్కువగా ఉన్నప్పుడు కూడా భూసారం, కొండచరియలు జారి పడడం కూడా భూసారం కోతకు గురవుతున్నాయి. భూసారం కోతను నిరోధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా తగిన చర్యలు తీసుకోవాలి. పర్యావరణ కాలుష్యాన్ని తద్వారా పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించడం వల్ల అనారోగ్యాలను ముఖ్యంగా కేన్సర్, తదితర అనేక వ్యాధులను తగ్గించవచ్చు. అయితే ఇంతవరకు అంతర్జాతీయంగా 28 వాతావరణ సదస్సులు జరిగినా అమలు చేయవలసిన అంశాలపై తీర్మానాలు చేశారు. ఐక్యరాజ్యసమితి, వాతావరణ శాస్త్రవేత్తలు ఆయా ప్రభుత్వాలను హెచ్చరిస్తున్నప్పటికీ పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది.

రాంచీలో స్వతంత్ర అభ్యర్థికి సీపీఐ మద్దతు

రాంచీ: జార్ఖండ్‌లో రాంచీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్రంగా పోటీ చేస్తున్న ఆర్జేడీ మహిళా విభాగపు రాష్ట్ర మాజీ అధ్యక్షులు రాణి కుమారికి సీపీఐ మద్దతు ప్రకటించింది. రాణి కుమారి ఇటీవల ఆర్జేడీకి రాజీనామా చేసి రాంచీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం 11 స్థానాల్లో సీపీఐ పోటీ చేస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహేంద్ర పాఠక్ తెలిపారు. బీజేపీ ఓటమే లక్ష్యంగా మిత్రపక్షాలతో కలిసి మిగతా స్థానాల్లో పనిచేస్తున్నట్లు చెప్పారు. ఇదే క్రమంలో రాణి కుమారికి సీపీఐ మద్దతిస్తున్నదని మహేంద్ర తెలిపారు. రాష్ట్రంలో అధికారమే ధ్యేయంగా... రాష్ట్ర వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే లక్ష్యంగా బీజేపీ అగ్ర నేతలు ఉన్నారని మహేంద్ర వ్యాఖ్యానించారు.

గుత్తాధిపత్యానికి వ్యతిరేకం: రాహుల్

నూఢిల్లీ: తాను వ్యాపార వ్యతిరేకిని కాదని, కేవలం గుత్తాధిపత్యాన్ని వ్యతిరేకిస్తానని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. తనను వ్యాపార వ్యతిరేకిగా చిత్రీకరించడానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. 'ఓ విషయంపై స్పష్టత ఇవ్వాలని అనుకుంటున్నా. బీజేపీలోని కొందరు వ్యక్తులు నన్ను వ్యాపార వ్యతిరేకిగా చిత్రీకరిస్తున్నారు.

ఉద్యోగాల కల్పన, వ్యాపారానికి, ఆవిష్కరణలకు, పోటీతత్వానికి మద్దతు ఇస్తా. నేను వ్యాపార వ్యతిరేకిని కానే కాదు. గుత్తాధిపత్యానికి, మార్కెట్ నియంత్రణ శక్తులకు వ్యతిరేకం. కేవలం కొద్దిమంది వ్యక్తులు ఆధిపత్యం చెలాయించడానికి విరుద్ధం. మేనేజిమెంట్ కన్సల్టెంట్‌గా నా కెరీర్‌ను ప్రారంభించా. వ్యాపార విజయానికి అవసరమైన అంశాలను అర్థం చేసుకోగలను' అని పేర్కొంటూ సోషల్ మీడియాలో రాహుల్ గాంధీ ఓ వీడియో పోస్టు చేశారు. దేశంలో కొందరు

వ్యాపారవేత్తలు గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారని ఇటీవల ఓ ఆంగ్ల వార్తా పత్రికకు రాసిన వ్యాసంలో రాహుల్ పేర్కొన్నారు. మార్కెట్‌ను నియంత్రిస్తున్న అటువంటి శక్తుల వల్ల అనేక వ్యాపారాలు క్షీణించాయని, ఉద్యోగాల సృష్టి కూడా కష్టమైందని అభిప్రాయపడ్డారు. అనేకమంది యువ వ్యాపారవేత్తలు ఇటువంటి గుత్తాధిపత్యాన్ని చూసి భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. దీనిపై బీజేపీ నుంచి విమర్శలు వ్యక్తం కావడంతో రాహుల్ దీనిపై స్పష్టత ఇచ్చారు.

మహిళల గదుల్లోకి మగ పోలీసులు వెళ్లడం తగదు: ప్రియాంక

వయనాడ్: కేరళలోని పలక్కాడ్‌లో ఉప ఎన్నిక వేళ అక్కడి హోటళ్లలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కాంగ్రెస్ మహిళా నేతలు ఉన్న గదులను సోదా చేశారు. ఈ ఘటనను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా గురువారం తీవ్రంగా ఖండించారు. నల్లధనం తెచ్చారన్న అనుమానంతో హోటల్‌లో తనిఖీ చేయాలన్న నెపంతో అర్ధరాత్రి సమయంలో మహిళల గదుల్లోకి మత పోలీసులు వెళ్లడం ఆక్షేపణీయమన్నారు. వయనాడ్ అభ్యర్థిగా ఆమె ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఈ ఘటనను ఖండించారు. కాంగ్రెస్ కార్యకర్త ఒకరు ట్రాలీ బ్యాగ్‌తో హోటల్‌లోకి వెళుతున్నట్లు సీసీటీవీ ఫుటేజి బయటకు రావడంతో కేరళలో రాజకీయంగా దుమారం రేగింది. దీనిపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇదంతా ముందస్తు కుట్ర అంటూ యూడీఎఫ్ ఆరోపించింది. నల్ల ధనాన్ని హోటల్ నుంచి తరలించేందుకు కాంగ్రెస్ నేతలకు పోలీసులు సహకరించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్రన్ ఆరోపణలు చేశారు. కాగా, బిందు కృష్ణ, షానిమోల్ ఉస్మాన్ వంటి కాంగ్రెస్‌కు చెందిన ప్రముఖ మహిళా నేతల హోటల్ గదులను పోలీసులు సోదా చేశారు. ఇదిలావుంటే స్థానిక ఉత్సవం కారణంగా పలక్కాడ్ అసెంబ్లీ ఉప ఎన్నికకను ఈనెల 13 నుంచి 20వ తేదీకి ఎన్నికల సంఘం వాయిదా వేసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే షఫీ పరంబిల్ లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

దమ్ముంటే ముందు నుంచి పోరాడండి

బీజేపీకి హేమంత్ సోరెన్ సవాల్

న్యూఢిల్లీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బీజేపీపై నిప్పులు చెరిగారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో దొడ్డి దారిన పైరవీలు చేస్తోందని కాషాయ పార్టీని దుయ్యబట్టారు. తన ప్రతిష్ఠను దిగజార్చేందుకు కోట్లు ఖర్చు చేసోందని, కేంద్ర సంస్థలను దుర్వినియోగిస్తోందని విమర్శించారు. వెనుక నుంచి కాదు ధైర్యముంటే ముందు నుంచి పోరాడాలంటూ బీజేపీకి హేమంత్ సవాల్ విసిరారు. 'దమ్ముంటే ముందు నుంచి పోరాడండి. వెనుక నుంచి దాడులు ఇంకెంత కాలం. కొన్నిసార్లు ఈడీ, మరికొన్ని సార్లు సీబీఐ, ఇంకొన్ని సార్లు వేర్వేరు సంస్థలు... వ్యక్తులు... ఇది బీజేపీ తంతు. నా ప్రతిష్ఠను దిగజార్చేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నది. ఇది వింత పరిస్థితి' అంటూ ఆయన గురువారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. బీజేపీ డబుల్ ఇంజిన్ వ్యాఖ్యలను హేమంత్ దుయ్యబట్టారు. జార్ఖండ్‌లో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు బడులు మూసివేసిందని, రేషన్ కార్డులు రద్దు చేసిందని, జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ) పరీక్షను ఐదేళ్లల్లో ఒక్కసారి కూడా నిర్వహించలేదని విమర్శించారు. '11ఏళ్లుగా కేంద్రంలో బీజేపీ పాలన సాగుతోంది. రాష్ట్రాన్ని ఐదేళ్లు పాలించింది.

ఆ ఐదేళ్లలో 13వేల స్కూళ్లు ఎందుకు మూతబడ్డాయి? 11 లక్షల రేషన్ కార్డులు ఎందుకు రద్దు అయ్యాయి? ఒక్కసారి కూడా జేపీఎస్సీ పరీక్ష ఎందుకు జరగలేదు? వృద్ధులు/వింతు పింఛన్లను ఎందుకు పెంచలేదు? వందలాది మంది ఆకలితో ఎందుకు మరణించారు? యువతకు ఉద్యోగాలు ఎందుకు లేవు? సైకిళ్లు తయారు చేయండి... అరటి కాయలు అమ్ముకోండని యువతకు ఎందుకు సలహా ఇచ్చారు' అని బీజేపీకి హేమంత్ సోరెన్ వరుస ప్రశ్నలు సంధించారు. కాగా, 81 మంది సభ్యులుగల జార్ఖండ్ అసెంబ్లీకి ఈనెల 13, 20 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఓట్లను 20వ తేదీన లెక్కిస్తారు. 2020లో జేఎంఎం 30 స్థానాల్లో గెలవగా, బీజేపీ 25, కాంగ్రెస్ 16 సీట్లు చొప్పున పొందాయి.

ఎంవీఏ హామీలు ఆచరణ సాధ్యమా? అజిత్‌పవార్

ముంబై: మహారాష్ట్రలో ఎలాగైనా అధికారంలోకి రావాలన్న అత్యాశతో విపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) కూటమి ఆచరణ సాధ్యం కాని హామీలు గుప్పిస్తోందని ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ నేత అజిత్ పవార్ వ్యాఖ్యానించారు. ఇందులో భాగంగానే అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని మహిళలకు నెలకు రూ. 3,000 ఇస్తామని ఎంవీఏ వాగ్దానం చేసిందని చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మహాయుతి ప్రభుత్వం లడ్కీ బహిన్ యోజన కింద మహిళలకు నెలకు 1,500 రూపాయలు అందిస్తామన్నప్పుడు ప్రతిపక్షాలు దాని సాధ్యాసాధ్యాలను ప్రశ్నించాయని పేర్కొన్నారు. ఇప్పుడు నెలకు రూ. 3వేలు ఏ విధంగా ఇస్తామంటున్నారని ప్రశ్నించారు.

అధికారంలోకి వస్తే... మహారాష్ట్రలోని మహిళలకు నెలకు రూ. 3వేలు అందిస్తామని... శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సిపి (ఎస్‌పి), ఉద్ధవ్ ఠాక్రే శివసేన (యుబిటి), కాంగ్రెస్‌తో కూడిన ఎంవీఏ కూటమి బుధవారం హామీ ఇచ్చింది. దీనిపై అజిత్ పవార్ స్పందిస్తూ... ప్రతిపక్షాలు ఇలాంటి వాగ్దానాలు చేస్తూ ప్రజల్ని ప్రలోభ పెడుతున్నాయని ఆరోపించారు. తాము లడ్కీ బహిన్ యోజన కింద రూ. 1,500 (నెలకు) ఇవ్వాలని నిర్ణయించామని, అది ఆచరణ సాధ్యమేనని చెప్పారు. ఎంవీఏ హామీ ఇచ్చినట్లుగా మహిళలకు నెలకు రూ. 3వేలు ఇవ్వడానికి ఖర్చు రూ. 90వేల కోట్లు అవుతుందని... నిరుద్యోగ యువతకు నెలకు రూ. 4వేలు ఇస్తామంటున్నారని... లక్ష మంది నిరుద్యోగ యువతకు లబ్ధి చేకూర్చేలా చేస్తే ఆ ఖర్చు దాదాపు రూ. 40,000 కోట్లు అవుతుందని ఆయన చెప్పారు. పూణే జిల్లా బారామతి అసెంబ్లీ స్థానంలో ప్రధాని నరేంద్ర మోదీ తన కోసం బహిరంగ సభ నిర్వహిస్తారా అనే ప్రశ్నకు అజిత్ పవార్ స్పందిస్తూ... "లేదు. బారామతిలో నేను ఎవరి సభను కోరుకోవడం లేదు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఇవి అవసరమవుతాయి' అన్నారు.

బీజేపీ విధానాలతో ప్రజలు విసిగిపోయారు

కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్

భోపాల్: బీజేపీ విధానాలు, ప్రభుత్వ సంస్థల దుర్వినియోగంతో దేశ ప్రజలు విసిగిపోయారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సచిన్ పైలట్ పేర్కొన్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలలో ఇండియా ఐక్యసంఘటన విజయం తథ్యమని విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీతు పట్వారీ నివాసంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... "దేశవ్యాప్తంగా బీజేపీ గ్రాఫ్ క్షీణిస్తోంది. రాబోయే ఎన్నికల్లో మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుస్తుంది. నేను జంషెడ్‌పూర్ (జార్ఖండ్)కి వెళ్లాను. ఆ రాష్ట్రంలో ఇండియా కూటమివైపు గెలుపు గాలి వీస్తోంది" అని అన్నారు. రాజస్థాన్ సరిహద్దులోని షియోపూర్ జిల్లాలో గల విజయపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో నవంబర్ 13న జరగనున్న ఉప ఎన్నికలో కాంగ్రెస్ తరపున ప్రచారం చేసేందుకు పైలట్ ఇక్కడికి వచ్చారు. 'మంగళ సూత్రాన్ని లాక్కోవడం', 'మీ గేదెలను తీసుకెళతారు' ఇటీవల యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్న 'బాటేంగే తో కటేంగే' (విభజిస్తే...మేము పూర్తిచేస్తాం) వంటి బీజేపీ నేతల వ్యాఖ్యలను ఆయన ప్రస్తావిస్తూ...లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ నాయకులు దిగజారి మాట్లాడారని అన్నారు. 'పడేంగే తో బడేంగే' (చదువుకుంటేనే అభివృద్ధి చెందుతాం) వంటి సానుకూలతతో కూడిన నినాదాలు ఇవ్వడంపైనే కాంగ్రెస్ దృష్టి

సారిస్తోందన్నారు. ఈ రకమైన సంస్కృతిని ప్రోత్సహించాలని అన్నారు. అధికారం, కేంద్ర సంస్థల దుర్వినియోగం, అసమర్థ పాలనతో దేశంలోని ప్రజలు ఇప్పుడు బీజేపీతో విసిగిపోయారన్నారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడంపై పైలట్ బీజేపీని నిందించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ప్రస్తుత అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇండియా ఐక్యసంఘటన నేతలు దేశాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో జరగబోయేదానికి ఎంపీ ఉపఎన్నికల ఫలితాలు నాంది పలుకుతాయని ఆయన అన్నారు. విజయ్‌పూర్‌తో పాటు గతంలో మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రాతినిధ్యం వహించిన బుద్ని నియోజకవర్గానికి కూడా నవంబర్ 13న ఉప ఎన్నిక జరగనుంది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

బెంగాల్ ఉప ఎన్నికలు...

ఏడుగురు అభ్యర్థులపై తీవ్ర నేరాభియోగాలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న 41 మంది అభ్యర్థుల్లో ఏడుగురిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అలగా అభ్యర్థుల్లో మరో ఏడుగురు కోటీశ్వరులు. వీరు ఈసీకి సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. కూచ్‌బెహర్ సితాయ్ (ఎస్సీ), హరోవా, నైహతి, మెదినీపూర్, తల్దాంగ్రా, మదారిహత్ (ఎస్టీ) అసెంబ్లీ నియోజకవర్గాల్లో నవంబర్ 13న ఉప ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమ బెంగాల్ ఎలక్షన్ వాచ్ అండ్ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) 42 మంది అభ్యర్థుల్లో 41 మంది స్వీయ ప్రమాణ పత్రాలను విశ్లేషించింది. మదారిహత్ నుండి పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి పంకజ్ లోహ్రాకు సంబంధించిన అఫిడవిట్ ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పూర్తిస్థాయిలో అందుబాటులో లేనందున విశ్లేషించడం సాధ్యం కాలేదు. ఇక తీవ్రమైన క్రిమినల్ కేసులున్న వారిలో నలుగురు అభ్యర్థులు బీజేపీకి చెందినవారు కాగా... తృణమూల్ కాంగ్రెస్ (2), కాంగ్రెస్ (1) ఉన్నారు. తీవ్రమైన క్రిమినల్ కేసుల్లో గరిష్టంగా ఐదు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష విధించే నేరాలు, నాన్‌బెయిలబుల్ నేరాలు, ఎన్నికల నేరాలు, ప్రభుత్వ ఖజానాకు ఆర్థిక నష్టం కలిగించడానికి సంబంధించిన నేరాలు ఉన్నాయి. దాడికి సంబంధించిన నేరాలు, హత్యలు, కిడ్నాప్‌లు, అత్యాచారాలు, అవినీతి నిరోధక చట్టం లేదా మహిళలపై నేరాలకు సంబంధించిన ఉల్లంఘనలకు కూడా వీరు పాల్పడినట్లు తేలింది. ఇక అభ్యర్థుల సంపద విషయానికి వస్తే కాంగ్రెస్ పార్టీ (3) ముందుంది. ఆ తర్వాత బీజేపీ (2), సీపీఐఎం(ఎల్), టీఎంసీలకు ఒక్కో అభ్యర్థి ఉన్నట్లు విశ్లేషణ వెల్లడించింది.

ఓటేస్తే పెళ్లి చేస్తాం...

అవివాహితులకు ఎమ్మెల్యే అభ్యర్థి తాయిలం

ముంబై: తనకు ఓటేసి గెలిపించిన యువకులకు పెళ్లిళ్లు జరిపిస్తామంటూ ఓ ఎమ్మెల్యే అభ్యర్థి ఇచ్చిన హామీ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. మరత్వాడాలోని బీడ్ జిల్లా పర్లి అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్సీపీ అభ్యర్థిగా రాజేసాహెబ్ దేశ్‌ముఖ్ పోటీ చేస్తున్నాడు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైతే పర్లీకి చెందిన బ్రహ్మచారులందరి పెళ్లి చేసే బాధ్యత తనదే అంటూ వాగ్దానం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో వెలుగులోకి వచ్చింది. 'పర్లిలో అబ్బాయిలకు పెళ్లిళ్లు కావడం లేదు. ఎక్కడికెళ్లినా అబ్బాయిలు ఉద్యోగాలు చేస్తున్నారా లేదా ఏదైనా వ్యాపారంలో ఉన్నారా అనే ప్రశ్నలే అడుగుతున్నారు. ప్రభుత్వం ఉపాధి కల్పించకపోతే వారికి ఉద్యోగాలు ఎలా వస్తాయి... సంరక్షక మంత్రి ధనంజయ్ ముండే చొరవ చూపకపోతే పరిశ్రమలు ఎలా వస్తాయి... నిరుద్యోగుల పరిస్థితి ఏంటి... నాకు ఓటేసి గెలిపిస్తే అవివాహితులకు పెళ్లి చేయడంతో

పాటు జీవనోపాధి కల్పిస్తానని హామీ ఇస్తున్నాను' అని ఇటీవల పర్లీలో జరిగిన ప్రచార ర్యాలీలో దేశ్‌ముఖ్ చెప్పారు. ఈ నెల 20న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో దేశ్‌ముఖ్... సిట్టింగ్ ఎన్సీపీ ఎమ్మెల్యే, క్యాబినెట్ మంత్రి ధనంజయ్ ముండేపై పోటీ చేస్తున్నారు. దేశ్‌ముఖ్ వ్యాఖ్యలను ఎన్సీపీ ముఖ్య అధికార ప్రతినిధి అంకుశ్ కాక్డే సమర్థించారు. 'యువత పెళ్లి చేసుకోకపోవడం - ముఖ్యంగా మరత్వాడాలో బీజేపీ, దాని మిత్రపక్షాలు అభివృద్ధి చేశాయని చెప్పినప్పటికీ గత దశాబ్దం కాలంగా ఉపాధి దాదాపు శూన్యం. ఇది సామాజిక సమస్యగా మారింది. అలాంటి యువతకు సహాయం చేస్తామని మన నాయకులు ఎవరైనా ప్రతిజ్ఞ చేస్తే తప్పు లేదు. మాట్రిమోనీలు ఏర్పాటు చేయడం సామూహిక వివాహ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా అవసరమైన వారికి మేలు చేయొచ్చు' అని అతను చెప్పారు. ప్రతిపక్ష అభ్యర్థి ముండే మాట్లాడుతూ... 'నా నియోజకవర్గంలో నేను చేసిన అభివృద్ధి, సృష్టించిన ఉపాధి అవకాశాల గురించి పర్లి ప్రజలకు తెలుసు. నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పర్లిలో సిమెంట్ ఫ్యాక్టరీ, సోయాబీన్ పరిశోధన కేంద్రం, సీతాఫలం ఎస్టేట్, వ్యవసాయ కళాశాలలు వచ్చాయి' అన్నారు. రిజర్వేషన్ సమస్య కారణంగా మరాఠ్వాడాలో పర్లీ వెనుకబడిన నియోజకవర్గాలలో ఒకటిగా ఉంది. ఎన్నికల బరిలో మరాఠా వర్సెస్ ఓబీసీ పోరు కనపడుతోంది.

దాతృత్వంలో శివ నాడార్ అగ్రస్థానం

న్యూఢిల్లీ: ప్రముఖ పారిశ్రామిక వేత్త, హెచ్‌సీఎల్ టెక్నాలజీ వ్యవస్థాపకుడు శివ నాడార్ దాతృత్వంలో మరోసారి అగ్రస్థానంలో నిలిచారు. ఏడాది కాలంలో ఆయన రూ. 2,153 కోట్లను దాతృత్వ కార్యక్రమాలకు వెచ్చించారు. ఈ మేరకు ఎడెల్‌గివ్ హురున్ ఇండియా దాతృత్వ జాబితాలో ఆయన మరోసారి తొలి స్థానం దక్కించుకున్నారు. ఈ జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ రెండో స్థానంలో నిలవగా... బజాజ్ కుటుంబం మూడో స్థానంలో ఉన్నది.



శివ నాడార్ గతేడాది రూ. 2042 కోట్లు విరాళంగా ఇచ్చారు. గతేడాది కంటే ఈసారి 5 శాతం అధికంగా విరాళాలు ఇచ్చారు. రెండో స్థానంలో నిలిచిన రిలయన్స్ అధిపతి ముకేశ్ అంబానీ రూ. 407 కోట్ల విరాళం ఇచ్చారు. గతేడాది కంటే 8 శాతం ఎక్కువ విరాశం అందించి ఉదారత చాటుకున్నారు. ఈ జాబితాలో మూడో స్థానంలో ఉన్న బజాజ్ కుటుంబం రూ. 352 కోట్లు దాతృత్వం కోసం కేటాయించారు. గతేడాది కంటే ఈ మొత్తం 33 శాతం ఎక్కువ. ఐదో స్థానంలో ఉన్న గౌతమ్ అదానీ రూ. 330 కోట్లను సమాజసేవ కోసం వెచ్చించారు.

గతేడాది కంటే 16 శాతం ఎక్కువగా విరాళాలు అందించారు. కృష్ణ చివుకుల (7వ స్థానం), సుస్మిత-సుబ్రోతో బాగ్చి (9వ స్థానం) తాజాగా హురున్ ఇండియా దాతృత్వ జాబితాలో టాప్ 10లో నిలిచారు. హురున్ ఇండియా దాతృత్వ జాబితాలోని టాప్ 10 మంది మొత్తం రూ. 4,625 కోట్లు అందించినట్లు నివేదిక పేర్కొంది. వితరణశీలుల్లో ఆరుగురు ప్రాథమికంగా విద్య కోసం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చుపెట్టినట్లు వెల్లడించింది.

ఉగ్రవాదం అంతానికి కొత్త వ్యూహం: అమిత్ షా

న్యూఢిల్లీ: ఉగ్రవాదాన్ని ఏరివేయడానికి మోదీ సర్కార్ కృషి చేస్తోందని కేంద్రమంత్రి అమిత్ షా గురువారం అన్నారు. అందుకు గొప్ప వ్యూహంతో ముందుకెళుతున్నామని తెలిపారు. 'యాంటీ టెర్రర్ కాన్ఫరెన్స్-2024' ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశానికి

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తోంది. అంతర్గత భద్రత కోసం సరిహద్దుల వద్ద ఇప్పటివరకు 36 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వారందరికీ నివాళులర్పిస్తున్నా. దేశం తరపున వారి కుటుంబాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఉగ్రవాద కార్యకలాపాల కట్టడి విషయంలో మోదీ ప్రభుత్వం 'జీరో టాలరెన్స్' నినాదంతో ముందుకెళ్తోంది. ప్రస్తుతం ప్రపంచమంతా ఈ విధానాన్నే అనుసరిస్తోంది' అని అమిత్ షా పేర్కొన్నారు. 'ఉగ్రవాదంపై పోరాడేందుకు బలమైన వ్యవస్థను ఏర్పాటుచేశాం. ఉగ్రవాదులు ఏ రూపంలో దాడి చేసినా దాన్ని మనం ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకు యువ అధికారులకు అత్యున్నత సాంకేతిక నైపుణ్యం అవసరం. భవిష్యత్తులో వారి శిక్షణలోను దీన్ని భాగం చేస్తాం. ఉగ్రవాదంపై పోరాడేందుకు కేంద్ర మంత్రిత్వశాఖ మరో అడుగు ముందుకువేస్తోంది. జాతీయ ఉగ్రవాద నిరోధక విధానాన్ని, మరింత బలమైన వ్యూహాన్ని తీసుకువస్తాం' అని తెలిపారు.

రాజీ పడితే కేసు రద్దు చేస్తారా?

లైంగిక వేధింపుల కేసుపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల కేసు విషయంలో గురువారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఫిర్యాదుదారుడు, నిందితుడికి మధ్య రాజీ కుదిరిందని కేసు కొట్టేయడమేమిటని ప్రశ్నించింది. రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అసంతృప్తి వ్యక్తం చేసింది.

దిగువ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. రాజస్థాన్‌లోని గంగాపూర్‌లో 2022లో ఈ లైంగిక వేధింపుల కేసు నమోదైంది. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఓ బాలిక ఫిర్యాదు చేసింది. దాంతో పోక్సో చట్టం కింద నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ మైనర్ బాలిక వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. తర్వాత బాలిక కుటుంబం నుంచి భిన్నమైన వాంగ్మూలం వచ్చింది. అపార్థంతోనే పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఆ ఉపాధ్యాయుడిపై ఎలాంటి చర్యలు వద్దని తెలిపింది. దీనికి అనుగుణంగా దిగువ న్యాయస్థానంలో పోలీసులు నివేదిక సమర్పించారు. అయితే దానిని కోర్టు తిరస్కరించడంతో... నిందితుడు హైకోర్టుకు వెళ్లాడు. బాధిత కుటుంబం వాంగ్మూలాన్ని అంగీకరించిన హైకోర్టు... ఎఫ్ఐఆర్ రద్దు చేయాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చింది. అయితే ఈ తీర్పును సామాజిక కార్యకర్త ఒకరు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం... హైకోర్టు తీర్పును రద్దు చేసింది. ఈ కేసును తిరిగి విచారించాలని ఆదేశించింది.

అనిల్ అంబానీకి మరో ఎదురుదెబ్బ

ముంబై: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ లిమిటెడ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. రిలయన్స్ పవర్, దాని అనుబంధ సంస్థలపైనా సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ మూడేళ్లు నిషేధం విధించింది. నకిలీ బ్యాంక్ గ్యారెంటీలు సమర్పించినట్లు తేలడంతో ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో భవిష్యత్తులో మూడేళ్ల పాటు ఈ కంపెనీ ఎస్ఈసీఐ నిర్వహించే బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు వీలుండదు. ఎస్ఈసీఐ జూన్‌లో ఒక గిగావాట్ సోలార్ పవర్, రెండు గిగావాట్ స్టాండలోన్ బ్యాటరీ ఎనర్జీ సోలార్ సిస్టమ్ కోసం బిడ్లను ఆహ్వానించింది. ఇందులో రిలయన్స్ పవర్ అనుబంధ సంస్థ రిలయన్స్ ఎన్‌యూబీయూఎస్ఎస్ పాల్గొంది. అయితే చివరి రౌండ్ బిడ్డింగ్‌లో ఆ సంస్థ నకిలీ గ్యారెంటీలు అందించినట్లు తమ దర్యాప్తులో తేలిందని ఎస్ఈసీఐ తాజాగా ప్రకటించింది. దీంతో ఆ బిడ్డింగ్ ప్రక్రియను నిలిపివేసి, వెంటనే సంస్థపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ నిషేధంతో అనిల్ అంబానీకి మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఏడాది ఆగస్టులోనే మార్కెట్ల నియంత్రణా సంస్థ సెబీ... సెక్యూరిటీస్ మార్కెట్ల నుంచి ఐదేళ్ల పాటు నిషేధం విధించిన విషయం తెలిసిందే. నిధుల మళ్లింపు ఆరోపణలతో రూ. 25 కోట్ల జరిమానా విధించింది. అయితే అక్టోబర్‌లో సెక్యూరిటీ అప్పిలేట్ ట్రిబ్యునల్ సెబీని పెనాల్టీ వసూలు చేయకుండా ఆపినప్పటికీ... ఆయనపై నిషేధం కొనసాగుతోంది.

నా భర్త గురించి పార్లమెంట్‌లో మాట్లాడండి

రాహుల్‌కు యాసిన్ మాలిక్ భార్య లేఖ

శ్రీనగర్: తన భర్తకు న్యాయం విషయంలో సహాయం చేయాలని కోరుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి వేర్పాటువాది యాసిన్ మాలిక్ భార్య ముషాల్ లేఖ రాశారు. పాకిస్థాన్ జాతీయురాలైన ఆమె రాసిన లేఖ చర్చనీయాంశంగా మారింది. దీనిపై బీజేపీ నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. 'రాహుల్‌జీ... యాసిన్ మాలిక్‌కు తగిన అవకాశం ఇస్తే... జమ్మూకశ్మీర్‌లో శాంతి నెలకొల్పడంలో ఒక శక్తిగా మారతాడు. ప్రస్తుతం నా భర్తతో వ్యవహరిస్తోన్న తీరు వేధింపులకు ఏ మాత్రం తీసిపోదు. ఆయనకు న్యాయం చేకూర్చడంలో మీ సహాయం కోరుతున్నాం' అని ఆమె ఆ లేఖలో కోరారు. తన భర్త అనారోగ్యంతో బాధపడుతున్నారని, అది తీవ్ర పరిణామాలకు దారితీయకముందే జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడాలని అడిగారు. దీనిపై బీజేపీ స్పందించింది. 'తన భర్త గురించి భారత పార్లమెంట్‌లో మాట్లాడాలంటూ పాకిస్థాన్ మద్దతున్న ఉగ్రవాది మాలిక్ భార్య రాహుల్‌కు లేఖ రాయడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు' అని విమర్శించింది. కాగా, ముషాల్ పాకిస్థాన్ దేశస్థురాలు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసింది. 2009లో యాసిన్‌ను వివాహం చేసుకుంది. అప్పటికి ఆమె వయసు 23 ఏళ్లు కాగా... యాసిన్‌కు 42 సంవత్సరాలు. ముషాల్‌కు చిత్రకారిణిగానూ పేరుంది. ఆమె గీసిన కొన్ని చిత్రాలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం ముషాల్ 2014లో రెండుసార్లు భారత్‌కు వచ్చింది. ఆ తర్వాత తన వీసా రెన్యువల్ చేసుకోలేదు. 2019లో యాసిన్ అరెస్టుతో మళ్లీ వీసా కోసం దరఖాస్తు చేసుకుంది. వీరికి ఒక కుమార్తె ఉంది. కశ్మీర్ వేర్పాటువాదిగా యాసిన్ మాలిక్ తీహార్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చాడనే ఆరోపణలు రుజువు కావడంతో అతడికి శిక్ష పడింది.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ విక్రేతల కార్యాలయాల్లో సోదాలు



న్యూఢిల్లీ: అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఇ-కామర్స్ సంస్థలతో వ్యాపారాలు చేసే కొందరు విక్రేతలపై గురువారం ఈడీ దాడులు చేసింది. విదేశీమారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఎఫ్ఈఎంఏ) విచారణలో భాగంగా ఢిల్లీ, హర్యానా (గురుగ్రామ్), తెలంగాణ (హైదరాబాద్), కర్నాటక (బెంగళూరు)లో సోదాలు జరిపినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

ఈ సంస్థలకు చెందిన కొందరు ప్రధాన విక్రేతలు చేస్తున్న ఆర్థికలావాదేవీలకు సంబంధించిన చర్య అని పేర్కొన్నాయి. భారత్‌కు చెందిన యాంటీట్రస్ట్ బాడీ రెండు కంపెనీలు, వారి అమ్మకందారులు ప్లాట్‌ఫామ్‌లలో ఎంపిక చేసిన విక్రేతలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పోటీ చట్టాలను ఉల్లంఘించాయని జాతీయ మీడియా ఇటీవల నివేదించిన సంగతి తెలిసిందే. ఈ వార్తల ఆధారంగా ఈడీ సోదాలు జరిపింది.

బెంగళూరులో బ్రిటన్ మాజీ ప్రధాని

బెంగళూరు: బ్రిటన్ మాజీ ప్రధాని, భారత సంతతికి చెందిన రిషి సునాక్ బెంగళూరులో ప్రత్యక్షమయ్యారు. తన భార్య అక్షతా మూర్తితో కలిసి ఓ కాఫీ షాప్‌లో సందడి చేశారు. స్థానికులతో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఆకట్టుకున్నారు. రిషి సునాక్, ఆయన భార్య అక్షతా మూర్తి ఇటీవలే బెంగళూరులోని థర్డ్ వేవ్ కాఫీ షాప్‌లో కాఫీ డేట్‌ను ఆస్వాదించారు. ఇద్దరూ టేబుల్ వద్ద కాఫీ తాగుతూ సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆ సమయంలో కాఫీ షాప్‌కు వెళ్లిన స్థానికులు రిషి సునాక్ జంటను చూసి థ్రిల్ అయ్యారు. వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ఎగబడ్డారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. కాగా, రిషి సునాక్ 2022 నుంచి 2024 వరకు యూకే ప్రధాన మంత్రిగా పనిచేశారు. ఇటీవలే జరిగిన ఎన్నికల్లో ఆయన పార్టీ ఓటమి చవి చూసింది.

విశాలాంధ్ర హైదరాబాద్

సమగ్ర సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇంటింటి సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. నార్సింగ్ మున్సిపాలిటీ కోకాపేటలో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోకాపేటలో అపార్ట్మెంట్‌లో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్‌ను సర్వేకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్వే సందర్భంగా సమగ్ర వివరాలు తీసుకున్న అనంతరం సంబంధిత ఇంటికి సర్వే పూర్తి చేసినట్లు వేసిన స్టిక్కర్‌ను కలెక్టర్ పరిశీలించారు. కుటుంబ సర్వే నిర్వహణ కోసం అతికించిన స్టిక్కర్లను చూసి, వాటిపై నమోదు చేసిన ఇంటి నెంబరు, ఎన్యూమరేషన్ బ్లాక్, క్రమ సంఖ్య తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వేకు సంబంధించి ఎన్యూమరేటర్ కు కలెక్టర్ పలు సలహాలు సూచనలు చేశారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరిపిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని కలెక్టర్ అన్నారు. సర్వే కోసం ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు వాస్తవ వివరాలతో కూడిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఆయా ఇళ్లను సందర్శించి ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా సర్వే జరపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నార్సింగ్ మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 17, 18 తేదీల్లో గ్రూప్-III పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్-III పరీక్ష ఈ నెల 17, 18 తేదీలలో నిర్వహిస్తున్న పరీక్షలకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 115 పరీక్షా కేంద్రాలలో 65,361 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం పొట్రు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు రెండు సెషన్‌లు ఉంటాయని పేపర్-1 ఉదయం 10 నుండి 12:30 గంటల వరకు పేపర్-2, 3 నుండి 05:30 గంటల వరకు, 18న పేపర్ 3, ఉదయం 10 నుండి 12:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని అభ్యర్థులు 10 నుండి కమిషన్ వెబ్‌సైట్ https://www.tspsc.gov.in నుండి హాల్ టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టరు సూచించారు. పరీక్ష రోజు ఉదయం 8:30 గంటల నుండి ముందస్తు సెషన్‌కు మధ్యాహ్నం 1:30 గంటల నుండి మధ్యాహ్న సెషన్‌కు అభ్యర్థులు పరీక్షా కేంద్రం లోపలికి అనుమతించబడతారు. పరీక్షా కేంద్రం గేట్ ఉదయం 09:30 గంటలకు, మధ్యాహ్నం సెషన్ కోసం మధ్యాహ్నం 2:30 గంటలకు మూసివేయబడుతుందని, గేట్లు మూసివేసిన తర్వాత అభ్యర్థులెవరూ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడరన్నారు. పరీక్షలకు మొదటి సెషన్‌కు ఉపయోగించిన హాల్ టికెట్ కాపీని మిగిలిన సెషన్‌లకు ఉపయోగించాలని సూచించారు. తుది ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్ అన్ని సెషన్‌ల ప్రశ్నా పత్రాలను భద్రపరచుకోవాలని సూచించారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉన్నట్లయితే అభ్యర్థులు టి.జి.పిఎస్.సి టెక్నికల్ హెల్ప్ డెస్క్‌ని ఫోన్ నంబర్లు 040-23542185 లేదా 040-23542187లో సంప్రదించవచ్చు లేదా helpdesk@tspsc.gov.in కు ఇమెయిల్ చేయవచ్చు.

ప్రారంభమైన సమగ్ర కులగణన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కులగణన కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో వివేకానంద నగర్‌లోని సప్తగిరి కాలనీలో గల పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఇంటికి డీసీ కృష్ణయ్య, జీహెచ్ఎంసీ అధికారులు స్టిక్కర్ అంటించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడు తూ దేశ చరిత్రలో తొలి సారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సమగ్ర కుల గణన చేపట్టడం జరిగినది అని, చాలా గొప్ప విషయం అని, ఎన్నో ఏండ్ల కల నేటితో నెరవేరుతుందని, సమగ్ర కులగణన చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సమగ్ర కులగణన ద్వారా బడుగు బలహీన వర్గాలకు, వెనుకబడిన తరగతుల కులాల జాబితాను సిద్ధం చేసి అభివృద్ధి ఫలాలు అందరికి అందేలా మంచి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ప్రజలు కూడా కులగణన కోసం వచ్చిన అధికారులకు పూర్తిగా సహకరించాలని, నిజాలు మాత్రమే చెప్పాలని అప్పుడే సరైన కుల జాబితా రూపొందుతుంది అని, ప్రతి ఒక్కరు కులగణన కార్యక్రమంలో పాల్గొని పూర్తి వివరాలు అందించాలని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు.

బీబీ నగర్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనికీ

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీసు స్టేషన్లలో అధికారులు సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు గురువారం ఆకస్మికంగా బీబీనగర్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్శనలో బీబీనగర్ ఇన్ స్పెక్టర్ ఎం ప్రభాకర్ రెడ్డి, బీబీనగర్ పీఎస్ ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు. అదే సమయంలో పోలీస్ స్టేషన్ విజిట్ లో భాగంగా అక్కడికి వచ్చిన బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ విద్యార్థులను కలిసి వారికి విలువైన సూచనలు చేశారు.

అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం శంకుస్థాపన

విశాలాంధ్ర - హైదరాబాద్ : హుస్నాబాద్ నియోజకవర్గంలో హుస్నాబాద్ మున్సిపాలిటీలో 3,4,5,18 వార్డుల్లో ఒక్కో వార్డుకు 50లక్షల చొప్పున 2 కోట్ల రూపాయలతో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు సిద్ధిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలోని 20 మున్సిపల్ వార్డుల్లో 50 లక్షల చొప్పున ప్రతి వార్డులలో పనులు చేపట్టడం జరిగిందన్నారు. 3,4,5,10 వార్డులలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. హుస్నాబాద్‌లో రీడింగ్ రూమ్స్ పేరుతో అన్ని కులాలకు 45 లక్షల చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. బుడగ జంగాలకు కూడా ఇందిరమ్మ పేరు మీద కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. బుడగ జంగాల కాలనీ వద్ద ఇందిరమ్మ విగ్రహం ఏర్పాటు చేసి ఆ చౌరస్తాను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. బుడగ జంగాల కాలనీకి అవసరమైన రోడ్లు నిర్మిస్తామని అందుకు సంబంధించిన వాటి వివరాలు సేకరించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. హుస్నాబాద్ పట్టణంలో గాంధీ, అంబేద్కర్, నాగరం, కరీంనగర్ చౌరస్తాల అభివృద్ధికి 50 లక్షల చొప్పున కేటాయించుకున్నామన్నారు. ఎల్లమ్మ చెరువు బండ్ అభివృద్ధికి 18 కోట్ల రూపాయలు టెండర్ ఐపోయి సిద్ధంగా ఉందనీ హుస్నాబాద్‌లో పూర్తైన భవనాలు ఏసిపి, ఆర్డీవో, మార్కెట్, లైబ్రరీ, మున్సిపాలిటీ, కరీంనగర్ 4 లైన్ల రహదారి మొదటి దశకు 75 కోట్లకు కేటాయించడం జరిగిందనీ,150 పడకల ఆసుపత్రి, సర్వాయి పాపన్న గౌడ్ టూరిజం అభివృద్ధి, మహాసముద్రం గండి అభివృద్ధి, ఆర్డీవో ఆఫీస్ స్థలం సేకరించడం జరిగింది. స్టేడియం పనులు ఇలా అన్నిటికీ ఒకేసారి ప్రారంభించుకోవడానికి ముఖ్యమంత్రి లేదా ఉప ముఖ్యమంత్రిని తీసుకొచ్చి ఫౌండేషన్ వేయాలని కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. హుస్నాబాద్‌లో వర్షాలకు వరద నీరు ఇళ్లలోకి రాకుండా డ్రైనేజీ సిస్టమ్ ఏర్పాటు చేయడానికి ఒక ప్రణాళిక బద్దంగా ముందుకు పోతున్నామన్నారు. వరి ధాన్యం కొనుగోలు, పత్తి మార్కెట్ కేంద్రాలు ప్రారంభించుకున్నామని తెలిపారు. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయడానికి ఇండస్ట్రియల్ ఎండీతో కలిసి చౌటపల్లి వద్ద స్థల పరిశీలన చేశామని దాని వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. హుస్నాబాద్ ప్రాంతాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి నియోజకవర్గ ప్రజల గౌరవాన్ని పెంచుతానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఒక రోల్ మోడల్ గా దేశానికి దిక్సూచి లాగ కుల గణన సర్వే జరుగుతుందనీ ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ సర్వే ఎక్స్‌రే మాదిరి సమాజంలో ఉన్న రుగ్మతలు తేడాలు తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. హుస్నాబాద్ పట్టణంలో ఎన్యూమరేటర్స్‌తో కలిసి ఇంటికి స్టిక్కరింగ్ వేశారు. సమగ్ర కులగణన ఇంటింటి కుటుంబ సర్వేకి ప్రజలంతా సహకరించాలని కోరారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే 10 లక్షల ఆరోగ్య శ్రీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 కి గ్యాస్ ఇస్తున్నామని ఎవరికైనా రాకపోతే అధికారులను సంప్రదించాలన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అందిస్తున్నామన్నారు. వ్యవసాయానికి సంబంధించి 2 లక్షల లోపు రైతు రుణమాఫీ పూర్తైందనీ. 2 లక్షల పైన ఉన్న వారికి కుటుంబ నిర్ధారణ పూర్తైంది పైన డబ్బులు చెల్లిస్తే మిగిలినవి మాఫీ అవుతాయి త్వరలోనే దానికి సంబంధించిన విధి విధానాలు వస్తాయన్నారు. హుస్నాబాద్ పట్టణంలో 2006లో 8 రేషన్ షాపులు ఉంటే 2024లో కూడా 8 ఉండడం దురదృష్టకరమన్నారు. ఎంత జనాభాకి ఎన్ని రేషన్ షాపులు ఉండాలని వివరాలు సేకరించాలనీ అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ పట్టణంలో కొత్త రేషన్ షాపులు తీసుకొచ్చి ప్రజల ఇబ్బందులు తొలగిస్తామని హామీ ఇచ్చారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ ఐలేని అనిత, సిద్దిపేట గ్రంథాలయ కమిటీ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు మార్గదర్శకాలు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యతనిచ్చే దిశగా స్వచ్ఛమైన, పవిత్రమైన ఎన్నికలను నిర్వహించేందుకు జాతీయ ఎలక్షన్ కమీషన్ గత అనుభవాలతో ఎప్పటికప్పుడు నూతన మార్గదర్శకాలను రూపొందిస్తుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల పరిశీలకులు రహమ్మత్ అలీ అన్నారు. గురువారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విసి హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి మల్కాజిగిరి నియోజక వర్గ ఎంఎల్ఏ మర్రి రాజశేఖర్రెడ్డి, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు గౌతం పొట్రుతో కలిసి జిల్లా ఎన్నికల పరిశీలికులు రహమ్మత్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ గత ఎన్నికలలో జరిగిన లోటు పాట్లను, చిన్న చిన్న అంశాలను కూడా దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో స్వచ్ఛమైన, పవిత్రమైన ఎన్నికలను నిర్వహించేందుకు గాను జాతీయ ఎన్నికల కమీషన్ అవసరమైన మార్గదర్శకాలను రూపొందిస్తూ ఎప్పటికప్పుడు సవరిస్తూ ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. ఓటరు ఎన్రోల్మెంట్ ప్రక్రియను తీవ్రంగా పరిగణించి సవరణలు, డెత్ కేసులను ఎప్పటికప్పుడు సవరించేలా సంబంధిత ఫారాలలైన 6,6ఎ,7ఎ, 8లలో నమోదు చేసుకునేలా బిఎల్ఎలు, బిఎల్ఒలు ప్రజలకు తెలయజేసి ఓటరు జాబితాను అప్ డేట్ చేయాలన్నారు. సవరణ జాబితలో పెండింగ్ లో ఉన్న 6642 నమోదులను డిసెంబరు నాటికి పూర్తిచేయాలన్నారు. ఈ ఆర్ఓలు, పార్టీ ప్రతినిధులు, బిఎల్ఓలు, బిఎల్ఎలు బూతు, గ్రామీణ, మండల స్థాయిలలో క్రమం తప్పకుండా సమావేశాలను ఏర్పాటు చేసి ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 60 శాతం జిహెచ్ఎంసి పరిధిలో ఉందని, అందుకు గాను జనాభా ఎక్కువగా ఉందన్నారు. గ్రామీణ స్థాయిలో ఓటరు శాతం తగ్గుతుందన్నారు. ఎంఎల్ఏ తెలిపిన సమస్యలకు సమాధానమిస్తూ కలెక్టరు ఆన్ లైన్ లో నమోదు ప్రక్రియలో సాఫ్ట్ వేర్ సర్వర్ సమస్యను కేవలం ఎలక్షన్ కమీషన్ వారు మాత్రమే సవరించగలరని తెలపారు. ఓటర్లు స్థల మార్పిడి జరిగనప్పుడు వారు ఫారం 8లో దరఖాస్తు చేసుకునేలా బిఎల్ఎలు అవగాహన కల్పించాలన్నారు. మల్కాజిగిరి నియోజక వర్గ ఎంఎల్ఏ మర్రిరాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఆన్ లైన్ లో నమోదు చేసుకునే వారికి సాఫ్ట్ వేర్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, చాలా సమయం కేటాయించినప్పటికి రిజిస్ట్రేషన్ కావడం లేదని తెలిపారు. మేడ్చల్-మల్కాజగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, ఆర్డిఓ సైదులు, స్వేప్ అధికారి సాంబశివరావు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.1.20 కోట్లతో ఆర్‌సీసీ పైప్‌లైన్ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని న్యూ మిర్జాలగూడలోని జాతీయ సేవ సంఘం నుండి చిన్మయీ మార్గ్ వరుకు రూ.1 కోటి 20 లక్షలు వ్యయంతో ఆర్‌సిసి పైప్‌లైన్‌ను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి ప్రాంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు డి.ఈ.ఈ లౌక్య, ఏ.ఈ.ఈ దివ్య జ్యోతి, వర్క్ఇన్స్పెక్టర్ సుబ్రహ్మణ్యం, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాము యాదవ్, గౌతమ్ నగర్ డివిజన్ నాయకులు, మహిళా నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : లాభాల బాట పట్టింది తెలంగాణ వ్యవసాయం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం హన్వాడ మండలం, వేపూర్ గ్రామంలోని రైతు వేదిక దగ్గర ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తూ, అందరికి అన్నం పెట్టే రైతు క్షేమంగా ఉండాలని ప్రజా ప్రభుత్వం కోరుకున్నది కాబట్టి రైతులను రుణ విముక్తులను చేసిందని ఆయన స్పష్టం చేశారు. రైతు సంతోషంగా ఉన్నప్పుడే సమాజం సంతోషంగా ఉంటుందని ఆయన అన్నారు. అందుకే రైతు పండించిన పంట కొనుగోలు చేసి, 48 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు జమ చేస్తారని ఆయన స్పష్టం చేశారు. అంతే కాకుండా రైతులకు మేలు చేయాలనే చిత్తశుద్ధి మా ప్రభుత్వానికి ఉంది కాబట్టి వారికి మద్దతు ధర కల్పించడంతో పాటు సన్నాలకు 500 రూపాయల బోనస్ కూడా అందిస్తున్నాం అని ఆయన చెప్పారు. ఎవరి మాటలు విన వద్దని, దళారులను నమ్మి మోసపోరాదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో మీ ధన్యం అమ్ముకునే సౌలభ్యం కల్పించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రామకృష్ణ, అచ్చన్న, వెంకటాద్రి, నాయకులు యాదవ రెడ్డి, నవనీత, రఘు, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహులు, రవి, బొట్టు శీను, ఖాజా పాషా, సుబ్బారెడ్డి, వెంకటయ్య, అంజిలయ్య, లక్ష్మారెడ్డి, పెంట్యా నాయక్ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే...

హన్వాడ మండలం, లింగన్న పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తిరుమలయ్య అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మరణించారు. ఆ విషయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మృతుని ఇంటికి వెళ్ళి తిరుమలయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే, మృతుని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

అంగన్వాడీ సేవలు అందరికీ అందుబాటులో ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంగన్వాడి సేవలు అందరికీ అందేలా తగిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి ఐసిడిఎస్ అధికారులు ఆదేశించారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమగ్ర శిశు అభివృద్ధి సేవ ఐసిడిఎస్ సేవలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం కోసం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అంగన్వాడి స్వంత భవనాలలో కమ్యూనిటీ భవనాలలో నిర్వహిస్తున్న వాటిలో త్రాగునీరు, మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని వాటి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. అంగన్వాడీలను అక్రిడేషన్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. స్పెషల్ గ్రోత్ మానిటరింగ్ నిర్వహించిన డేటా శాతాన్ని సమర్పించాలని ఆయన అన్నారు. సిడిపిఓలు, సూపర్వైజర్లు ప్రతినెల నిర్దిష్టమైన తనిఖీలు చేపట్టాలని ఆయన సూచించారు. పిల్లల బరువు, తీవ్ర లోపపోషణ, సరిగా బరువులేని పిల్లల సంఖ్య ఇవ్వవలసిందిగా ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, సిడిపిఓలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్తర భారతీయుల ఛత్ పూజలు

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్ : ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో ఉత్తర భారతీయులు నిర్వహించే చత్ పూజలు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీహారీలు, ఉత్తరప్రదేశ్, గుజరాతీ భక్తులు ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ ఈ పూజల వల్ల తమ పిల్లలు, కుటుంబ సభ్యులు సుఖశాంతులతో ఉంటారని, చట్ పూజల సందర్భంగా మహిళ భక్తులు ఉపవాస దీక్షలను కొనసాగించి, సాయంత్రం చెరువుకు ప్రత్యేక పూజలు చేసి తమ ఉపవాస దీక్షలను భర్త సమక్షంలో వదలడం అనవాయితీగా వస్తుందని అన్నారు. భారత దేశంలో సంస్కృతి సంప్రదాయాలతో ప్రపంచంలోనే గొప్ప దేశంగా విరాజిల్లుతుందని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా కఠిక ఉపవాసాలు పాటించి సూర్యదేవుడికి సూర్యాస్తమయం సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్ వైస్ చైర్మన్ నటరాజ్, కౌన్సిలర్ చింటూ, నాయకులు పిల్లి శేఖర్, చెట్ల నరసింహా, జూపల్లి శంకర్, అడ్డు, రవి యాదవ్, గుండు అశోక్, గుడ్డు యాదవ్, బాబ ఘోరీ, నవీన్ పులిజాల, చెర్క శివ, శ్రీకాంత్, రాజశేఖర్, శ్రీనివాస్, సల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి కార్మికుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న జలమండలి కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. హైదరాబాద్, ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జలమండలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐ.ఎన్.టి.యు.సి అనుబంధ జలమండలి కాంగార్ యూనియన్ రి.నెం.బి.1804 అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి నేతృత్వంలో టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను యూనియన్ నేతలు, కార్మికులు కలసి జలమండలి ఉద్యోగ, కార్మికుల సమస్యలు ముఖ్యంగా జలమండలి ఉద్యోగుల ప్రభుత్వ హెల్త్ కార్డ్స్ జారీ, ఖాళీగా ఉన్న 3000 పోస్టుల భర్తీ, అప్‌గ్రేడ్ ప్రమోషన్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్దీకరణ వంటి సమస్యలను అయన దృష్టికి తీసుకెళ్లి, త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వ పెద్దల పై ఒత్తిడి తీసుకరావాలని కోరారు. బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ స్పందించి మాట్లాడుతూ త్వరతగతిన జలమండలి కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు. 2013 సంవత్సరంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం 650 మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పెర్మనెంట్ చేసిందని అయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కరమౌతాయని తెలిపారు. జలమండలిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలనీ తద్వారా ఐ.ఎన్.టి.యు.సి బలోపితం చేస్తూ వచ్చే జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో జలమండలి కాంగార్ యూనియన్ గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు బహుమతిగా ఇవ్వాలని బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కోరారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ భూమయ్య, కార్యదర్శి సురేష్ బాబు, ట్రెజరర్ సురేష్, నేతలు ఆర్.సీతయ్య, బిల్డర్ శ్రీనివాస్, జంగారెడ్డి, గణేష్, రఘు, నరేంద్ర, కుమార్, అర్జున్, శ్రీనివాస్, బాలరాజ్, బషయ్య, వెంకట్ సుబ్బయ్య, జగన్మోహన్, ప్రసాద్, సుగుణాకర్ రెడ్డి, సంజీవ, మహమ్మద్ గౌస్, వెంకటేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా సాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిహెచ్ఎంసిలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నవంబర్ 6 నుండి సర్వే రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసిలో మొదటి దశలో ఎన్యుమరేటర్ బ్లాక్‌లో ప్రతి ఇంటిలో గల కుటుంబాల వివరాలను నమోదు చేస్తూ వాటికి సంబంధించిన ఇంటి నంబర్, కుటుంబ యజమాని పేరుతో కూడిన ఇండ్ల జాబితా 6వ తేదీ నుండి 8 వరకు ఇండ్ల జాబితాను తయారు చేయడంతో పాటు స్టిక్కర్ ఇంటి గోడలపై అతికిస్తారు. నేటి వరకు 13,35,673 ఇళ్లను లిస్ట్ పూర్తి చేసి ప్రతి ఇంటికి స్టిక్కర్ వేసారు. శుక్రవారం స్టిక్కర్ వేసే ప్రక్రియ ముగియనున్నది. రెండో దశలో 9 తేది నుండి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టనున్నారు. క్షేత్ర స్థాయిలో సర్వేలో కుటుంబం సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ఎన్యూమరేటర్లు సేకరించిన డేటాను కంప్యూటరైజ్ చేసి గోప్యంగా ఉంచుతారు. ఈ సర్వే ప్రకారంగా ప్రభుత్వం అమలు చేసే పథకాలలో అర్హులైన వారిని గుర్తించి, ఈ నేపథ్యంలో సర్వేను ఎప్పటికిప్పుడు పర్యవేక్షణకు డిప్యూటీ, జోనల్ కమిషనర్లు పరిశీలిస్తారు. వీరితో పాటు 10 మంది నోడల్ అధికారులను నియమించారు.

ఘనంగా ఛత్ పూజ

విశాలాంధ్ర - మల్కాజిగిరి : బీహార్ ప్రాంతం వారు చేసే ఛత్ పూజ సూర్య భాఘవనుడికి పూజలు గురువారం లల్వానీ నగర్ బేబీ పాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలు ఆయా ప్రాంతాల ప్రజలు ఏకం కావడానికి, ఐక్యతను పెంపొందించడానికి దోహదపడుతాయని వినాయక్ నగర్ డివిజన్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీహార్ సహ్యోగ్ సమితి, బీహార్ మహిళ అసోసియేషన్ నాయకులు అధ్యక్షులు వినయ్ యాదవ్, ఉపాధ్యక్షులు మనోజ్ యాదవ్, బివాష్ జా, దీపక్ యాదవ్, కార్యదర్శి సాగర్ భగత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి : బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని రాజశేఖర్ కాలనీలో రూ. 40 లక్షలు నిధులతో డ్రైనేజీ, సిసి రోడ్లు అభివృద్ధి పనులకు గురువారం ఉదయం మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ భూక్య సుమన్ నాయక్‌లు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుమన్ మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక ఫ్లాగ్ డే వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : 75వ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక, ఫ్లాగ్ డే వేడుకలు గురువారం సికింద్రాబాద్‌లోని సౌత్ లాలా గూడ రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్‌లో జరిగాయి. ఈ సందర్భంగా స్కౌట్ అధికారులు స్కౌట్స్-గైడ్స్ రైల్వే కాలనీలో జరిగిన వాకథాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కమీషనర్ (అడల్ట్ రిసోర్సెస్), దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పర్సనల్ ఆఫీసర్, జి.ఆర్.ఎస్. రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథితో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి, దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ సి.ఎమ్.ఎమ్ ఏ.కె.రావత్, స్కౌట్ అధికారులు పాల్గొన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పాట్రన్ అరుణ్ కుమార్ జైన్‌ని కలిసి వారికి ఫ్లాగ్ డే స్టిక్కర్‌ను అందజేసి 75 సంవత్సరాల వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ లోగోను వారిచే ఆవిష్కరింపజేశారు. దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రెసిడెంట్ దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర కమీషనర్, దక్షిణ మధ్య రైల్వే, పి.సి.సి.ఎమ్ పద్మజ, దక్షిణ మధ్య రైల్వే భారత్ స్కౌట్స్, గైడ్స్ ప్రెసిడెంట్ డివిజనల్ రైల్వే మేనేజర్ హైదరాబాదు డివిజన్ లోకేష్ విష్ణోయ్‌కు కూడా ఫ్లాగ్ డే స్టిక్కర్‌ను అందజేశారు. స్కౌట్ గైడ్ వీక్-2024 (నవంబర్ 3 నుండి 9 వరకు)లో భాగంగా ఈ వారంలో ప్రధాన ఆకర్షణ అయిన 5వ రోజున "ఫౌండేషన్ డే" జరుపుకుంటారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అనేక సంస్థల కలయికతో నవంబర్ 7, 1950న స్థాపించ బడింది. అందువలన ప్రతి సంవత్సరం నవంబర్ 7న వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంటారు. స్కౌటింగ్, గైడింగ్ సూత్రాలకు అనుగుణంగా నాయకత్వం, స్వావలంబన, సమాజానికి సేవ, పర్యావరణ అవగాహన వంటి విలువలను ప్రోత్సహించడం ద్వారా యువత అభివృద్ధికి దోహదపడటం భారత్ స్కౌట్స్, గైడ్స్ ముఖ్య లక్ష్యం. భారతదేశం వ్యాప్తంగా స్కౌట్, గైడ్ యూనిట్లు నిర్వహించే వివిధ కార్యక్రమాలు, కార్యకలాపాలు, వేడుకలతో ఫౌండేషన్ డే జరుపుకుంటారు. ఈ కార్యకలాపాలలో జెండా ఎగురవేయడం, ర్యాలీలు, సమాజ సేవా ప్రాజెక్టులు, స్కౌట్స్, గైడ్స్ ఉద్యమం ఆదర్శాలను బలోపేతం చేసే కార్యక్రమాలు, ఇతరులకు సహాయం చేయడం సమాజానికి గొప్ప శ్రేయస్సు కోసం పని చేయడం వంటివి ఉన్నాయి. భారతదేశంలో బాధ్యతాయుత మైన పౌరులను రూపొందించడంలోఈ సంస్థ ప్రభావం, ప్రాముఖ్యతను ప్రతిబింబించే అవకాశాన్ని కూడా అందిస్తుంది.

శ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ పోస్టర్ విడుదల : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం ఫరూక్ నగర్‌లోని జనంపేటలో ఈనెల 20న శ్రీ వీరాంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా నవగ్రహాలు గణపతి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జమ్రుద్ ఖాన్, గంధం ఆనంద్, అప్ప, వీరేశం, కుడుముల శివయ్య, గుడిపల్లి బీరప్ప, గుడిపల్లి శ్రీశైలం, లక్ష్మి నర్సింహా, పిల్లి శేఖర్ మేడిగ వీరేశం ఆకుల సంపత్, మహేందర్, శివరాజ్, జడల గుపాల్, కోట్ల రవి కుమార్, వెంకటేష్, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కులగణనతోనే ప్రతి ఒక్కరికీ న్యాయం

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: కుల గణనతోనే ప్రతి ఒక్కరికి న్యాయం చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భాగంగా గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నివాసంలో ఎన్యూమరేటర్లు గోడకు స్టిక్కర్‌ను అమర్చారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కులగణన చేయాలనే ఉద్దేశంతో నవంబర్‌లోపు కులగణనను పూర్తి చేయాలనే సంకల్పంతో ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కి పలువురు నాయకులు, పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి, వివిధ కాలనీలలో సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. పలు వినతులు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే వాటి పరిష్కారం కోసం, కాలనీల అభివృద్ధి కోసం సత్వర చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. పలువురు మాజీ ఎమ్మెల్యేకి పలు శుభ కార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు అందజేశారు.

నిర్లక్ష్యపు నీడలో ఇనపయుగపు నిలువు రాయి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నాగర్ కర్నూలు జిల్లా, ఉప్పునుంతల మండలం, కంసానిపల్లె శివారులో దిండి నది ఒడ్డున ఇప్పటికి 3500 సంవత్సరాల నాటి ఇనుపయుగపు నిలువు రాయి నేడో రేపో కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పురావస్తు పరిశోధకులు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డా. ఈమని శివనాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వారసత్వ సంపదను కాపాడుకొని, భవిష్యత్ తరాలకు అందించాలన్న ధ్యేయంతో చేపట్టిన అన్వేషణలో భాగంగా ఆయన గురువారం ఉప్పునుంతల మండలం కొండారెడ్డిపల్లి- ఉప్పునుంతల మార్గంలో దిండినది దాటిన తర్వాత కుడివైపు 100 అడుగుల దూరంలో పొలాల్లో ఉన్న నిలువు రాతిని కనుగొన్నారు. ఇనుప యుగంలో మరణించిన ఒక ప్రముఖుని గుర్తుగా నిర్మించారని, దీన్ని మెన్హీర్ అంటారని ఆయన అన్నారు. ఇంతకుముందు ఇక్కడ పెద్ద పెద్ద బండరాళ్లను గుండ్రంగా అమర్చిన అనేక సమాధులు ఉండేవని, వ్యవసాయ భూముల విస్తరణలో అవి తొలగించారన్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన ఒకే ఒక నిలువు రాతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని శివనాగిరెడ్డి అన్నారు. భూమిపైన 8 అడుగుల ఎత్తు, 2 అడుగుల వెడల్పు, అడుగున్నర మందం గల ఈ నిలువు రాయి, గ్రానైటు రాతితో తీర్చిదిద్దబడిందని, ఇంత పెద్ద నిలువు రాతిని నిలబెట్టడం అలనాటి సామూహిక శ్రమశక్తికి నిదర్శనమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తిప్పర్తి జగన్మోహన్ రెడ్డి, అభిలాష్ రెడ్డి, బడే సాయికిరణ్ రెడ్డి పాల్గొన్నారని ఆయన చెప్పారు.

జన గణనలో కులగణన చేపట్టాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : జన గణనలో కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బి.సి బిల్లు పెట్టి చట్టసభలలో బి.సిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలని, బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. గురువారం బషీర్బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్వర్యంలో కోర్ కమిటీ సమావేశం జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్స్ గుజ్జ కృష్ణ, వై.నాగేశ్వరరావు యాదవ్, నూకాలమ్మల ఆధ్వర్యంలో జరిగింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఆర్. కృష్ణయ్య హాజరై మాట్లాడారు. రాజ్యాధికారంలో వాటా పంచకుండా బీసీలకు ఎన్ని రోజులు అన్యాయం చేస్తారని ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు.అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు ఒకే రోజులో బిల్లు పెట్టి అఘా మేఘాల మీద 10 శాతం రిజర్వేషన్లు పెట్టారని, బిసి లకు చట్ట సభలలో రిజర్వేషన్లు పెట్టాలని 30 సం.రాలుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ దేశంలో బి.సి లను బిచ్చగాళ్ళను చేశారని విమర్శించారు. బీసీలు రాజ్యాధికారం సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో వరప్రసాద్, ప్రసన్న, గురుమూర్తి, చక్రధర్, లక్ష్మణ్, సిహెచ్ శ్రీనివాసులు, శ్రావణి, నీల వెంకటేష్, సి. రాజేందర్, రామకృష్ణ, జీ.మల్లేష్ రాందేవ్ మోడీ, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడిఫైకి ఎస్ఎంబీసి ఆసియా రైజింగ్ ఫండ్ నుంచి 15 మిలియన్ డాలర్ల ఫండింగ్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : 2024 బీ2బీ బై నౌ, పే లేటర్ పరిష్కారాల్లో అగ్రగామి అయిన మోడిఫై, $ 15 మిలియన్ ఫండింగ్ రౌండ్ విజయవంతంగా పూర్తి చేసినట్లు ప్రకటించింది. ఈ రౌండ్‌ను జపాన్‌లోని ప్రముఖ బ్యాంకు సుమిటోమో మిట్సూయి బ్యాంకింగ్ కార్పొరేషన్ నేతృత్వం వహించగా, మాఏర్స్క్, ఇంటేసా సంపాలో, హెలియాడ్ వంటి ప్రముఖ గ్లోబల్ ఇన్వెస్టర్లు పాల్గొన్నారు. ఏస్ ఎంబీసీతో మోడిఫై అవగాహన ఒప్పందం కుదుర్చుకొని ఎస్ఎంఈ ఎగుమతిదారుల కోసం డిజిటల్ పరిష్కారాలను ముందుకు తీసుకురావడమే కాకుండా, పలు సంయుక్త కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఈ ప్రకటన సింగపూర్ ఫిన్‌టెక్ ఫెస్టివల్ సందర్భంగా వెలువడింది, ఇది మోడిఫై గ్లోబల్ ఫిన్‌టెక్ విభాగంలో తన నూతన ఆవిష్కరణల దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. కొత్తగా వచ్చిన ఈ పెట్టుబడులు చైనా, భారతదేశం వంటి వేగంగా ఎదుగుతున్న మార్కెట్లలో మోడిఫై విస్తరణకు ఊపిరి అందిస్తాయి. గ్లోబల్ వాణిజ్యం మారుతున్న కొద్దీ, మోడిఫై వ్యాపారాల అభివృద్ధికి అవసరమైన ఆర్థిక పరిష్కారాలను అందించడంలో ముందంజలో ఉంది అని సీఈఓ నెల్సన్ హెూల్జర్ అన్నారు. 2024లో ఫైనాన్షియల్ టైమ్స్ స్టాటిస్టా మోడిఫైను వేగంగా ఎదుగుతున్న యూరోపియన్ ఫిన్‌టెక్ కంపెనీలలో ఒకటిగా గుర్తించాయి, ఇది 2018 నుండి 1,800 కంపెనీలకు $ 3 బిలియన్ గ్లోబల్ ట్రేడ్‌ను సులభతరం చేసింది.

నాచారంలో ఎమ్మెల్యే ఆకస్మిక పర్యటన

విశాలాంధ్ర - కాప్రా : నాచారం డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్‌తో కలిసి గురువారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకస్మికంగా పర్యటించారు. డ్రైనేజీ వ్యవస్థ గురించి కార్పొరేటర్ అడగగా వెంటనే పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన సూచించారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి నాచారంలో ఎమ్మెల్యే ఆకస్మిక పర్యటన చేశారని డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి జాప్యం లేకుండా చూడాలని ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. రాష్ట్రం లోనే ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్ డీజీఎం సతీష్, అధికారులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా 60 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.24,60,000ల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను బాధిత కుటుంబాలకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి పునరుద్ఘాటించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, అక్తర్, శ్రీనివాస్, పోతుల రాజేందర్, కాశినాథ్ యాదవ్, ఎండీ ఇబ్రహీం, అష్రాఫ్, అనిల్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ పంతులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ అండ్ ఆటోమేషన్‌పై సెమినార్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ఫార్మా ఇండస్ట్రీ కోసం ఫైర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ అండ్ ఆటోమేషన్ (ఫెసా) పై రెండు రోజుల జాతీయ సెమినార్, ఈ అంశంపై భారతదేశంలోనే అతిపెద్ద సెమినార్ గురువారం నగరంలోని హెచ్ఐసిసిలో ప్రారంభమైంది. సెమినార్‌ను డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ వై. నాగిరెడ్డి, ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, తెలంగాణ ప్రభుత్వంలోని ఫ్యాక్టరీస్ డైరెక్టర్ బి. రాజ గోపాలరావు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనిని ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించింది. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఫార్మాలో పారిశ్రామిక భద్రతలో అగ్నిప్రమాదాలు ముఖ్యమన్నారు. గత పదేళ్లలో ఫార్మా పరిశ్రమల్లో 97 భారీ అగ్నిప్రమాదాలు జరగ్గా రూ.93 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లింది. నిన్నగాక మొన్న జరిగిన మరో ఘటనలో రూ.30 కోట్ల విలువైన సొత్తు దగ్ధమైందని తెలిపారు. వివిధ రకాల వాయువులు, రసాయనాల కారణంగా ఔషధ పరిశ్రమలో అగ్నిని నిర్వహించడం కష్టం. తెలంగాణ అగ్నిమాపక సేవా చట్టం 1999. ఈ చట్టంలోని సెక్షన్ 13 ప్రకారం భవనాలు, ప్రమాదకర పరిశ్రమలు తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ పొందవలసి ఉంటుంది. మరొక సెక్షన్, 19 ప్రకారం, స్థాపనలో అగ్నిమాపక వ్యవస్థకు యజమాని లేదా నివాసి బాధ్యత వహిస్తారు.

తొలగనున్న మురుగు నీటి సమస్య

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 22వ వార్డులో కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కోషిక ఐలయ్య కోటి రూపాయలతో చేపట్టనున్న మురుగు నీటి లైన్ పనులను ప్రారంభించారు. ఈసందర్బంగా అయన మాట్లాడుతూ ఈ ఫ్రంట్ లైన్ వల్ల రాజ్ రంజిత్ ప్రైమ్ హోమ్స్ కాలనీ, నవభారత్ కాలనీ, ప్రగతి నగర్ కాలనీ ఫేస్ 3, సాయి ప్రియనగర్ కాలనీ, వెంకటేశ్వర నగర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ మధ్య ఉన్న ప్రధాన మురుగు నీటి సమస్యకు ఇబ్బందులు తొలుగుతాయన్నారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రోడ్డు డౌలప్మెంట్ చైర్మెన్ మల్‌రెడ్డి రాం రెడ్డి, చైర్మెన్ అనురాధ సహకారంతో వార్డు ను మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్ నాయక్, రాజు నాయక్, రాగ్యా నాయక్, వెంకటేష్ యాదవ్, వివిధ కాలనీ అధ్యక్షులు, ప్రజలు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - అమనగల్లు : సమగ్ర కుటుంబ సభ్యులు ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములై తమ వివరాలను అధికారులకు తెలియజేయాలని కల్వకుర్తి అసెంబ్లీ జనరల్ సెక్రటరీ అలీమ్ అన్నారు. ఇంటింటికి తిరుగుతూ కుటుంబ సర్వే కార్యక్రమం పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, సోషల్ మీడియా కన్వీనర్లు మహేష్, నాజర్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలంతా సోదర భావంతో మెలగాలి

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : పండగలేవైనా ప్రజలంతా సోదర భావంతో మెలగాలని మాజీ కార్పొరేటర్ సురేష్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం 130 డివిజన్ సుభాష్ నగర్ పరిధిలోని చత్ పూజ పండగలో సురేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఛత్ పూజ, మహా పర్వ్ అని కూడా పిలుస్తారని, ఇది ప్రతి సంవత్సరం జరుపుకునే ముఖ్యమైన హిందూ పండుగలో ఈ పండుగను ప్రధానంగా బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో జరుపుకుంటారని అన్నారు. ఈ రోజున భక్తులు అస్తమించే సూర్యునికి నీరు (అర్ఘ్య) సమర్పిస్తూ, ఆహారం, నీరు లేకుండా భక్తితో ఉపవాసం ఉంటారని సురేష్ రెడ్డి అన్నారు. మిమ్మల్ని అందరిని మా అన్న, తమ్ములు, అక్కచెల్లమ్మల లాగ, మా కుటుంబంలోని ఒకరిగా చూస్తామని సురేష్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రామ్ రెడ్డి నగర్, సుభాష్ నగర్ ఛత్ పూజ నిర్వాహకులు, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ కమిటీ నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి సీఎం సోదరుడికి ఆహ్వానం

విశాలాంధ్ర - ఆమనగల్లు : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్ర వారం ఆమనగల్లులో ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఎం సోదరుడు కొండల్ రెడ్డిని హైదరాబాద్లోని ఆయన స్వగృహంలో రేవంత్ మిత్ర మండలి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీ, మాజీ మండల అధ్యక్షులు మండ్లి రాములు, పట్టణ అధ్యక్షులు మానయ్య,నాయకులు కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై అధికారుల మౌనం!

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : అనుమతులు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు మౌనం వహిస్తున్నారు. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వ అక్రమ నిర్మాణాలను సహించేది లేదంటూ ప్రతేక సంస్థలను ఏర్పాటు చేసి చర్యలకు ఉపక్రమిస్తుంటే రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీలో మాత్రం సపరేటుగా పాలన కొనసాగుతుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే సైతం ఆదిభట్ల పట్టణాన్ని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలన్న ఆదేశాలను సైతం అధికారులు బుట్ట దాఖలు చేస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు వెల్లడవుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై పలు ఫిర్యాదులు పత్రికల్లో కథనాలు ప్రచురితమైన అధికారుల్లో మాత్రం చలనం లేదు. అంతా తమ ఇష్టం తామెవరికీ జవాబు దారులం కాదన్నట్టు వ్యవహరిస్తున్నారు. తాము ఆడిందే ఆట పాడింది పాటగా అధికారం చెలాఇస్తూ నిర్మాణదారుల వద్ద బేరాలు కుదుర్చుచుకొని ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఇప్పటికైనా ఆదిభట్ల మున్సిపాలిటీలో కొనసాగుతున్న అవినీతిపై ఏసీబీ విజిలెన్స్ అధికారులు దృష్టిసారించాలని మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

కుల గణన సర్వేలో అధికారులకు సహకరించాలి

విశాలాంధ్ర - వనపర్తి : కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేలో ప్రతి ఒక్కరు అధికారులకు సహకరించి పూర్తిస్థాయిలో కుటుంబ వివరాలను నమోదు చేయించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటింటి సర్వేలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు విధిగా పాల్గొని ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదయ్యేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. వలసలు వెళ్లిన వారి కుటుంబ వివరాలను, డోర్ లాక్ చేయబడి ఉన్న కుటుంబ వివరాలను సైతం నమోదు చేయించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే వనపర్తి నియోజకవర్గాన్ని రోల్ మోడల్ అయ్యేవిధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

ప్రవీణ్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : నియోజకవర్గం పరిధి నిజాంపేట్ కార్పొరేషన్ ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి ప్రవీణ్ రెడ్డితో కేక్ కట్ చేపించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభా కాంక్షలు తెలియజేశారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని అన్నారు.

షారుక్ ఖాన్‌కు బెదిరింపులు

ముంబై: బాలీవుడ్‌లో మరో అగ్రనటుడు షారుక్ ఖాన్‌కు బెదిరింపులు వచ్చాయి. రూ.50 లక్షల డబ్బు ఇవ్వకపోతే...చంపేస్తామని నిందితుడు డిమాండ్ చేశాడు. దీనిపై ముంబైలోని బాంద్రా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. చత్తీస్‌గఢ్ నుంచి ఈ బెదిరింపులు వచ్చినట్లు దర్యాప్తులో తెలిసింది. షారుక్‌కు వచ్చిన కాల్స్‌ను ట్రేస్ చేయగా... చత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ నుంచి ఈ బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఫైజాన్ ఖాన్ అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడినట్లు అనుమానిస్తున్న పోలీసులు... అతడి కోసం గాలింపు చేపట్టారు. నిందితుడు ఓ న్యాయవాది ఫోన్ నుంచి బెదిరింపులకు పాల్పడ్డాడని, ఆ న్యాయవాదికి సమన్లు జారీ చేశామని పోలీసులు తెలిపారు. కాగా.. కృష్ణజింకలను వేటాడిన కేసు నేపథ్యంలో ఇప్పటికే చాలామార్లు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి సల్మాన్‌ఖాన్‌కు బెదిరింపులు ఎదురైన సంగతి తెలిసిందే. తాజాగా షారుక్ ఖాన్‌ను డబ్బు డిమాండ్ చేస్తూ బెదిరింపులు రావడం చర్చనీయాంశంగా మారింది.

ఎస్సీ వర్గీకరణపై ఏం చేద్దాం ?

- దళిత ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశం
- జనాభా దామాషా పద్ధతిలో జిల్లా యూనిట్‌గా అమలుకు నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎస్సీ వర్గీకరణ విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై కూటమి పార్టీల దళిత ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సచివాలయంలో సమావేశమయ్యారు. వర్గీకరణ అమలు ద్వారా దళితుల్లోని ఉప కులాలందరికీ దామాషా ప్రకారం సమాన అవకాశాలు కల్పించి... వారికి ఊతం ఇచ్చేలా పనిచేయాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుతో పాటు... ఎన్నికల హామీ కూడా ఉన్నందున కార్యాచరణపై ఎమ్మెల్యేలతో సీఎం చర్చించారు. జనాభా దామాషా పద్ధతిలో జిల్లా ఒక యూనిట్‌గా వర్గీకరణ అమలు చేస్తామన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో వర్గీకరణను అమలు చేశామని, తరువాత న్యాయ అడ్డంకుల కారణంగా ఆ కార్యక్రమం నిలిచిపోయిందని సీఎం గుర్తు చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో వివిధ రాష్ట్రాలు వర్గీకరణను అమలు చేయడానికి సిద్ధమయ్యాయని, ఎవరికీ అన్యాయం జరగకుండా జిల్లా ఒక యూనిట్‌గా వర్గీకరణ అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సీఎం తెలిపారు. తెలుగుదేశం పార్టీ దళితులకు మొదటి నుంచీ అండగా ఉందని, జస్టిస్ పున్నయ్య కమిషన్ ద్వారా అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలను రూపుమాపామని సీఎం గుర్తు చేశారు. 2014 తరువాత జీవో నెంబర్ 25 ద్వారా దళితులకు జనాభా దామాషా ప్రకారం నిధులు ఖర్చుపెట్టామని అన్నారు. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో వర్గీకరణపై స్పష్టత వచ్చినందున... దీనికి అవసరమైన కార్యాచరణ అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సీఎం వెల్లడించారు. వర్గీకరణ అమలుపై కమిషన్ వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీనితో పాటు దళిత వర్గాన్ని పైకి తెచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాల్సి ఉందని, ముఖ్యంగా విద్య, ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధితో పాటు వ్యాపార అవకాశాలు కల్పించడం ద్వారా దళిత జాతి సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం అన్నారు.

రాష్ట్రంలో మూడు క్రికెట్ అకాడమీలు

ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్

విశాలాంధ్ర-మంగళగిరి: రాష్ట్రంలో మూడు క్రికెట్ అకాడమీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఎంపీ అధ్యక్షతన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. మంగళగిరి క్రికెట్ స్టేడియం అభివృద్ధితో పాటు, రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి దాదాపు 16 అంశాలపై చర్చించారు. మంగళగిరి స్టేడియం లోపాలను సరిచేసేందుకు అహ్మదాబాద్ మోదీ స్టేడియంకు పనిచేసిన చెన్నైకి చెందిన ఎస్‌వీ అసోసియేట్స్ ఆర్కిటెక్చర్ కంపెనీలతో మాట్లాడి సలహాలు, సూచనలు తీసుకున్నారు. అనంతరం శివనాథ్ మాట్లాడుతూ... అనంతపురంలో మహిళా అకాడమీ, విజయనగరంలో మెన్స్ అకాడమీ, విజయవాడ మూలపాడు స్టేడియంలో సీనియర్ మెన్స్ అకాడమీ పెట్టబోతున్నట్టు చెప్పారు. బెంగుళూర్‌లో బీసీసీఐ ఏర్పాటు చేసిన 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏ విధంగా ఉందో అదేవిధంగా ఈ మూడు అకాడమీలను తీర్చిదిద్దుతామన్నారు. క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలపై కూలంకుషంగా చర్చించినట్టు చెప్పారు. శిక్షణ పొందేందుకు అనుకూలంగా అకాడమీలు ఉంటాయన్నారు. గ్రామీణా ప్రాంతాల్లో కూడా గ్రౌండ్స్ ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి శిక్షణ ఇప్పిస్తామన్నారు. అధికశాతం మంది ఆంధ్రప్రదేశ్ నుంచి ఐపీఎల్, ఇండియన్ క్రికెట్ టీమ్‌కు ఎంపికయ్యే విధంగా శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు. రాబోయే సీజన్‌లో రాష్ట్రంలో ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. దానికి అనువుగా వైజాగ్ స్టేడియాన్ని సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో క్రికెట్ టోర్నమెంట్‌లు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. అండర్ 19 క్రికెట్ టోర్నమెంట్‌లు తీసుకురాబోతున్నట్లు చెప్పారు. విజయనగరం, వైజాగ్, విజయవాడ, మంగళగిరి, అనంతపురం, కడప స్టేడియాల్లో జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మంగళగిరి-నిడమర్రు రైల్వే గేట్ దగ్గర నాలుగు వరుసల ఆర్‌ఓబీ నిర్మాణానికి అనుమతుల కోసం ఎదురుచూస్తున్నట్టు చెప్పారు. మంగళగిరి స్టేడియం నిర్మించి 12 సంవత్సరాలు దాటడం వల్ల నిపుణులతో మాట్లాడి ఆధునికంగా తయారు చేస్తామన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.వెంకట రామ ప్రశాంత్, సెక్రటరీ సానా సతీశ్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ దంతుగౌరు విష్ణు తేజ్ పాల్గొన్నారు.

ఇక ప్రజలు అంధకారంలోనే

- కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల
- విద్యుత్ చార్జీలకు నిరసనగా కాంగ్రెస్ లాంతర్ ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పెరిగిన విద్యుత్ చార్జీలతో ప్రజలు ఇక అంధకారంలో బతకాల్సిందేనని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ప్రతి ఒక్కరు లాంతర్లు కొనుకోవాల్సిందేనన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించాలన్న డిమాండ్‌తో విజయవాడ ఆంధ్రరత్నభవన్ నుంచి పాత బస్టాండ్ సమీపంలోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు కాంగ్రెస్ అధ్వర్యంలో లాంతర్ ర్యాలీ నిర్వహించారు. షర్మిల మాట్లాడుతూ, వైసీపీ హయంలో ప్రజల నుంచి రూ.35వేల కోట్లు వసూలు చేశారని, కూటమి ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే రూ.17 వేల కోట్ల భారాన్ని మోపిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. యూనిట్ ధరను రూ.4 నుంచి రూ.8కు పెంచడం న్యాయమా అని ప్రశ్నించారు. హిందూజా వంటి కంపెనీలకు అక్రమంగా చెల్లిస్తున్నట్లు షర్మిల ఆరోపించారు. జగన్ చేసిన తప్పు భారాన్ని ప్రజలు ఎందుకు మోయాలని ప్రశ్నించారు. ఇప్పటికే ఏపీలో విద్యుత్ చార్జీలు ఎక్కువన్నారు. తెలంగాణలో యూనిట్ ధర 4.80 పైసలు ఉంటే...ఆంధ్రలో యూనిట్‌కి రూ.6 వసూలు చేస్తున్నారని షర్మిల అన్నారు. సర్దుబాటు చార్జీలు పేరుతో 40 శాతం అధికంగా వసూలు చేస్తున్నారని, వైసీపీ మీద వ్యతిరేకతతో ప్రజలపై ఈ భారాన్ని మోపడం అన్యాయమని ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆమె అన్నారు. తక్షణమే వీటిని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, నాయకులు మస్తాన్‌వలీ, బొర్రా కిరణ్, రాజీవ్ రతన్, గుర్నాథం పాల్గొన్నారు.

అసభ్య పోస్టులు పెడితే కఠినంగా శిక్షించాలి

సామాజిక మాధ్యమాలతో సమాజానికి మంచి జరుగుతుందని, ఇలాంటి వ్యవస్థను కొంతమంది భ్రష్టు పట్టించారని షర్మిల విమర్శించారు. మానవ-రక్త సంబంధాలు మరిచి తల్లి, అక్కాచెల్లి కూడా మహిళలే అనే ఇంగితం లేకుండా చూశారన్నారు. ప్రశ్నించే మహిళలపై అసభ్య పోస్టులతో, వికృత చేష్టలతో పైశాచిక ఆనందం పొందే సైకోలపై కఠిన చర్యలు తీసుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. 'నా మీద, అమ్మ మీద, సునీత మీద అనుచిత పోస్టులు పెట్టారు. నేను వైఎస్ రాజశేఖర్ రెడ్డికి పుట్టలేదన్నారు. ఇంటి పేరు మార్చి శునకానందం పొందారు. అసభ్య పోస్టులు పెట్టిన వర్రా రవీందర్ రెడ్డిపై నేను కేసు పెట్టా. ఇలాంటి వారి అరెస్టును స్వాగతిస్తున్నా. ఇటువంటి వారు ఏ పార్టీలో ఉన్నాగానీ వారి అంతు చూడాలి. వ్యక్తిత్వ హననానికి, భయపట్టే చర్యలకు సామాజిక మాధ్యమాలు వేదికలు కాకుండా చూడాలి' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని షర్మిల డిమాండ్ చేశారు.

బెల్టు షాపులపై ఉక్కుపాదం

- తక్కువ ధరకే మద్యం విక్రయాలు
- సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం షాపుల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనలను సహించేది లేదని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపాలన్నారు. మద్యం షాపుల నిర్వహణపై మంగళగిరి ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో నూతన మద్యం విధానం అమలు, దుకాణాల కేటాయింపుపై మంత్రి చర్చించారు. దుకాణాల కేటాయింపు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించిన అధికారులను అభినందించారు. వివాదాలకు తావులేకుండా 3,396 మద్యం దుకాణాలు కేటాయించారన్నారు. మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనలు, బెల్టు షాపుల ఏర్పాటుపై వస్తున్న ఆరోపణలను పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. బెల్టు షాపు ఏర్పాటు చేసినట్లు తేలితే ఎంతటి వారినైనా ఉపేక్షించొద్దన్నారు. ఉల్లంఘనలను గుర్తిస్తే భారీ జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని, మాట వినకుంటే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించాలన్నారు. కల్తీ మద్యం నివారించడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మద్యం వినియోగదారుల ఆరోగ్యం దృష్ట్యా ప్రాథమిక స్థాయిలో ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్‌పై ఇప్పటివరకు ఆరు పారామీటర్ల ప్రకారం జరిగే పరీక్షలను 13కు పెంచినట్లు చెప్పారు. కల్తీ మద్యం రహిత ఏపీ లక్ష్యమని, అందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందించడమే కాకుండా డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడిందని మంత్రి రవీంద్ర చెప్పారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా, డైరెక్టర్ నిశాంత్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌శర్మ, అదనపు కమిషనర్లు, సంయుక్త కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

డిసెంబరులో ప్రభుత్వ శాఖల పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వివిధ ప్రభుత్వ శాఖల(డిపార్ట్‌మెంటల్) నవంబరు-2024 సెషన్ పరీక్షల షెడ్యూలు విడుదలైంది. దీనిని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) కార్యదర్శి జే.ప్రదీప్‌కుమార్ గురువారం విడుదల చేశారు. డిసెంబరు 18 నుంచి 23వ తేదీ వరకు ప్రభుత్వ శాఖల పరీక్షలు జరుగుతాయి. వాటికి ఈనెల 13 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తుల ప్రక్రియ, ఫీజు వివరాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

నిబంధనలు మార్చడం కుదరదు

ఉద్యోగ నియామకాలపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగుల నియామకాల ప్రక్రియ మొదలైన తర్వాత... ముందుగా చెప్పకుండా నిబంధనలు మార్చడానికి వీల్లేదని సుప్రీంకోర్టు గురువారం తేల్చి చెప్పింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం దీనిపై విచారణ జరిపింది. నియామక ప్రక్రియ మొదలుకావడానికి ముందే ఒకసారి నియమ నిబంధనలు ఏర్పాటుచేసుకొంటే... ఆ తర్వాత వాటిని మార్చడానికి వీల్లేదని పేర్కొంది. నియామక ప్రక్రియ నిబంధనలు ఎవరికి నచ్చినట్లు వారు మార్చడానికి వీల్లేదని ధర్మాసనం పేర్కొంది. ఇవి కచ్చితంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు అనుగుణంగా ఉండాలని పేర్కొంది. ధర్మాసనంలో జస్టిస్ హ్రిషికేశ్ రాయ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రా ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు కచ్చితంగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలని ధర్మాసనం పేర్కొంది. మధ్యలో నిబంధనలు మార్చి అభ్యర్థులను ఇబ్బందిపెట్టకూడదని వెల్లడించింది. దీంతో 2008లో కె.మంజుశ్రీ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించినట్లు అయింది. ఆ కేసు తీర్పు సరైనదని, దానిని తప్పు అని చెప్పడానికి అవకాశం లేదని పేర్కొంది. ప్రభుత్వాలు నియామక ప్రక్రియకు ముందే నిబంధనలు సిద్ధం చేసి ఆ తర్వాతే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాలని పేర్కొంది. చివరికి ఖాళీలను పూరించిన తర్వాత ఆ ప్రక్రియ ముగుస్తుందని తెలిపింది.

విద్యారంగాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దుతాం

- నవీన ఆవిష్కరణలపై యువత దృష్టి సారించాలి
- వీఐటీ అంతర్జాతీయ ఉన్నత విద్యా ప్రదర్శనలో మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాబోయే అయిదేళ్లలో ఏపీలో విద్యారంగాన్ని దేశంలోనే నెంబరు ఒన్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. విట్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'ఇంటర్నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్'ను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ... యువత ఉద్యోగం సాధించడంపై కాకుండా జాబ్ క్రియేటర్స్‌గా తయారుకావాలని అన్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని స్టార్టప్ లను ప్రారంభించాలన్నారు. ఇందుకు ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సంపూర్ణ సహాయ, సహకారాలను అందిస్తుందన్నారు. రూ.250 కోట్లతో సీడ్ ఫండ్ ను కూడా ఏర్పాటుచేశామని చెప్పారు. విశాలమైన ఆలోచనా దృక్పథంతో యువత తమ కలలను సాకారం చేసుకోవాలన్నారు. నైతిక విలువలతో కూడిన విద్యావ్యవస్థను తయారుచేయడమే లక్ష్యం అన్నారు. అధునాతన సాంకేతిక మార్పులకు అనుగుణంగా పునరావిష్కరణలపై దృష్టిసారించాలన్నారు. అవుట్‌పుట్స్‌పై కాకుండా అవుట్‌కమ్స్ పై విట్ వంటి విద్యాసంస్థలు శ్రద్ధవహించాలని కోరారు. అంతర్జాతీయ పరిణామాలను గమనిస్తూ నవీన ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలి. లక్ష్యసాధనకోసం ముందుకు సాగాలన్నారు. భారత సాఫ్ట్‌వేర్ రంగంలో 20 శాతం మంది తెలుగువారే ఉన్నారు. ప్రపంచస్థాయి దిగ్గజ కంపెనీలైన మైక్రో సాఫ్ట్, గూగుల్, అడోబ్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వంటి సంస్థల్లో భారతీయులు కీలకస్థానాల్లో ఉన్నారన్నారు. చైనా, అమెరికా, జపాన్ మోడల్ ను కాకుండా భారత్ మోడల్ విద్యావ్యవస్థను ఇతర దేశాలు అనుసరించేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు.

భారత్‌లో విద్యారంగ బడ్జెట్ పెరగాల్సిన అవసరం ఉందని విట్ - ఏపీ వ్యవస్థాపకుడు జి.విశ్వనాథన్ అభిప్రాయపడ్డారు. గత ఏడాది కేంద్రబడ్జెట్‌లో విద్యారంగా నికి కేవలం 2.9 శాతం మాత్రమే కేటాయించారన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో విద్యారంగానికి నాలుగు నుంచి ఆరు శాతం వరకు ఖర్చుచేస్తున్నారని చెప్పారు. వైస్ చాన్సలర్ ఎస్.వి. కోటారెడ్డి, రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర మురుగన్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ కోఆర్డినేటర్ గోస్వామి, ప్రొఫెసర్ రీతు వర్గీస్ పాల్గొన్నారు.

ఆవిష్కరణలను ఆసక్తిగా...

వివిధ దేశాల ప్రతినిధులు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను, విట్ వర్సిటీ విద్యార్థులు వినూత్నంగా రూపొందించిన వివిధ ఆవిష్కరణలను లోకేశ్ ఆసక్తిగా వీక్షించారు. వ్యవసాయ పనులకు తక్కువ ఖర్చులో లభ్యమయ్యే... వరదలను గుర్తించగల అత్యాధునిక డ్రోన్‌ను ప్రదర్శించగా మంత్రి దాని పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు రూపొందించిన డ్రైవర్ రహిత వాహనం, రోబోటిక్ హ్యాండ్ రోవర్, స్మార్ట్ డాగ్ కోలార్, నెక్ట్స్ జనరేషన్ పీహెచ్ సెన్సార్స్ కలిగిన శక్తి 2.0, మూడు సెకన్లలో 180 కి.మీ స్పీడ్ అందుకోగల హైస్పీడ్ డ్రోన్, హ్యూమనాయిడ్ రోబోట్ ను పరిశీలించారు. తమ సృజనతో అద్భుత ఆవిష్కరణలను రూపొందించిన విద్యార్థులను అభినందించారు. వారితో కలిసి సెల్ఫీలు, ఫోటోలు దిగుతూ కొద్దిసేపు సందడి చేశారు.

'ఆస్ట్రేలియా టుడే'పై కెనడా నిషేధం

తీవ్రంగా స్పందించిన భారత్

న్యూఢిల్లీ: కెనడా మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కింది. ఆస్ట్రేలియాలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సమావేశాన్ని ప్రసారం చేసిన అక్కడి ఓ మీడియా సంస్థపై నిషేధం విధించింది. గంటల వ్యవధిలోనే ఈ నిర్ణయం తీసుకుంది. దీనిపై భారత్ ఘాటుగా స్పందించింది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న జైశంకర్... ఆ దేశ విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్‌తో సంయుక్తంగా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. కెనడాలో ఆలయంపై దాడి ఘటనపై జైశంకర్ మాట్లాడుతూ ట్రూడో సర్కార్ తీరుపై విరుచుకుపడ్డారు. ఈ సమావేశాన్ని ఆస్ట్రేలియా టుడే ప్రసారం చేసింది. దీంతో కెనడా చర్యలు చేపట్టింది. 'ఆస్ట్రేలియా మీడియాపై కెనడా చర్యలు ఆశ్చర్యం కలిగించాయి. గంటల వ్యవధిలోనే ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దారుణం. భావ ప్రకటనా స్వేచ్ఛపై ఆ దేశానికి ఉన్న కపటనీతిని ఇది ఎత్తిచూపుతోంది. కెనడా గురించి జైశంకర్ మూడు ప్రధాన విషయాలు మాట్లాడారు. వాస్తవాలను జీర్ణించుకోలేని ఆ దేశం ఇలాంటి చర్యలకు ఉపక్రమించింది' అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. కాగా.. కెనడాలో హిందూ ఆలయం లక్ష్యంగా చేసుకుని ఖలిస్థానీ జెండాలతో సిక్కు వేర్పాటువాదులు వీరంగం సృష్టించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన జైశంకర్... కెనడా తీరు గురించి మూడు విషయాలు మాట్లాడారు. 'మొదటిది.. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇతరులపై ఆరోపణలు చేసే పద్ధతిని పాటిస్తూ వస్తోంది. రెండోది.. భారత దౌత్యవేత్తలపై కెనడా నిఘా పెట్టింది. ఈ తరహా చర్య ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇక మూడోది... ప్రస్తుతం మనమంతా చూస్తున్నది..! అందుకు ఈ వీడియోనే (ఆలయంపై దాడి ఘటనకు సంబంధించిన దృశ్యాలు) సాక్ష్యం. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే... అతివాద శక్తులకు రాజకీయాల్లో చోటు కలిస్తున్నారనే విషయం అవగతమవుతోంది' అని అన్నారు.

పంట వ్యర్థాలు దహనం చేస్తే జరిమానా

రైతులకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ: దిల్లీలో వాయు కాలుష్యాన్ని కట్టడి చేయడానికి కేంద్రం ముందుకు వచ్చింది. రైతులు తమ పంట వ్యర్థాలను దహనం చేస్తే అత్యధికంగా రూ.30 వేల వరకు జరిమానా విధించాలని నిర్ణయించింది. దేశ రాజధాని దిల్లీలో వాయు నాణ్యతను పెంచడానికి ఈ నిర్ణయం తీసుకొంది. తక్షణం అమల్లోకి వచ్చిన సరికొత్త నిబంధనల ప్రకారం 2 ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్న రైతు వ్యర్థాలు దహనం చేస్తే రూ.5 వేలు జరిమానా చెల్లించాలి. అదే 2-5 ఎకరాల మధ్యలోని వారు రూ.10 వేలు, అంతకంటే ఎక్కువ భూమి ఉంటే రూ.30 వేలు జరిమానా చెల్లించాలి. ఈ సరికొత్త నిబంధనలు 'ది కమిషన్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ చట్టం-2021'లో భాగం. గత నెల చివర్లో దిల్లీలో కాలుష్యంపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తీరును తప్పుపట్టింది. పర్యావరణ పరిరక్షణకు కేంద్రం పదును లేని చట్టాలు చేస్తోందని వ్యాఖ్యానించింది. ఈ చట్టాలు అమలుచేయడానికి అధికారులను నియమించడం లేదని ఆగ్రహం వెలిబుచ్చింది. దీనిపై అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటి స్పందిస్తూ పర్యావరణ చట్టాల్లో జరిమానాలను బలంగా అమలు చేస్తామని న్యాయస్థానానికి చెప్పారు. నిబంధనలను మరో పది రోజుల్లో కఠినతరం చేస్తామని హామీ ఇచ్చారు.

జరిమానా పెంచడం పరిష్కారం కాదు

- 'పంట వ్యర్థాల'పై ప్రభుత్వానికి పంజాబ్ రైతు సంఘాల సూచన
- రెట్టింపు జరిమానాలు చెల్లించేది లేదని స్పష్టీకరణ

చండీగఢ్: పంట వ్యర్థాలు తగలబెడితే రెట్టింపు జరిమానా చెల్లించాలంటూ రైతాంగానికి కేంద్రం ఆదేశించింది. కేవలం జరిమానాలు పెంచడం వల్ల ఈ సమస్య పరిష్కారం కాబోదని, పంట వ్యర్థాల నిర్వహణ యంత్రాలు ప్రతి రైతుకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పంజాబ్ రైతు సంఘాలు నొక్కిచెప్పారు. జరిమానా పెంపుదలను వ్యతిరేకించాయి. రెట్టింపు కాదు పది రెట్లు పెంచినా జరిమానాలు చెల్లించేది లేదని కేంద్రానికి తేల్చిచెప్పాయి. కేంద్ర తాజా చర్యలను రైతులకు వ్యతిరేకమైనవిగా పంజాబ్ రైతు సంఘాలు గురువారం ఖండించాయి. పంట వ్యర్థాల నిర్వహణకు యంత్రాలు కల్పించకుండా జరిమానా పెంచడం ఆమోదయోగ్యం కాదన్నాయి. 'పంట వ్యర్థాలను తగలబెట్టాలని రైతులు కోరుకోరు కానీ ప్రత్యామ్నాయం లేక బలవంతంగా ఆ పని చేస్తున్నారు. ఈ పరిస్థితిని నివారించేందుకు కావల్సిన యంత్రాలు లేవు కాబట్టి వారికిది తప్పడంలేదు. కాలుష్యం నెపంతో రైతులను లక్ష్యం చేసుకోవడం తగదు. కాలుష్యాన్ని పెంచుతున్న పరిశ్రమలపై చర్యల సంగతేమిటి?' అంటూ ప్రభుత్వాన్ని రైతు సంఘాలు ప్రశ్నించాయి. భారతీ కిసాన్ యూనియన్ (ఏక్తా ఉగ్రాహన్) ప్రధాన కార్యదర్శి సుఖ్‌దేవ్ సింగ్ కోక్రికలన్ స్పందిస్తూ జరిమానా పెంచాలన్నది రైతంగా వ్యతిరేక నిర్ణయమన్నారు. ఇలాంటి చర్యలతో రైతులపై ఒత్తిడిని పెంచాలన్నదే కేంద్రప్రభుత్వ వ్యూహమని దుయ్యబట్టారు. పంట వ్యర్థాల నిర్వహణ యంత్రాలు ఉన్న రైతులు వాటిని తగలబెట్టలేదని, అవి లేని వారు గత్యంతరం లేక ఊకకు నిప్పు పెడుతున్నారని సుఖ్‌దేవ్ చెప్పారు. రెట్టింపు కాదు పది రెట్లు పెంచినాగానీ ఆ జరిమానా చెల్లించేది లేదని తేల్చిచెప్పారు. కిసాన్ మజ్దూర్ మోర్చా నేత సర్వన్ సింగ్ పంధేర్ కూడా కేంద్రాన్ని తప్పుపట్టారు. రైతులకు 30శాతం పంట వ్యర్థాల నిర్వహణ యంత్రాలు మాత్రమే కల్పించారని తెలిపారు. వాయు కాలుష్యానికి రైతులను ఎప్పుడూ నిందిస్తుంటారు తప్ప 51శాతం కాలుష్యానికి కారణమైన పరిశ్రమలపై, 25శాతం కాలుష్యం కలిగించే రవాణా మాధ్యమాలపై చర్యలు తీసుకోరని ప్రభుత్వాన్ని విమర్శించారు. వాయు కాలుష్యం గురించి ఎప్పుడు చర్చ జరిగినా మొదట నిందించేది రైతులనే అని అన్నారు. రైతులపై జరిమానాలు విధించడం ద్వారా ఈ సమస్య పరిష్కారం కాబోదని, కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని పంధేర్ స్పష్టంచేశారు. డీఏపీ ఎరువుల కొరత విషయాన్ని కేంద్రం పట్టించుకోవడంలేదని ఆయనన్నారు. భారతీ కిసాన్ యూనియన్ (కాడియన్) నేత హర్మీత్ సింగ్ మాట్లాడుతూ సన్నకారు, పేద రైతులకు పంట వ్యర్థాల నిర్వహణ యంత్రాలు సమకూర్చుకునే స్తోమత లేదని, కేంద్రమే చొరవ తీసుకొని ప్రతి రైతును చేరుకొవాలని సూచించారు. అలా జరిగినప్పుడే ఈసమస్యకు పరిష్కారం సాధ్యమవుతుందని చెప్పారు. కేవలం జరిమానాలు పెంచితే... రైతులపై భారం మోపడం తప్ప జరిగేది ఏమీ ఉండదన్నారు.

మాకు నోటీసులు అందలేదు: వికీపీడియా

న్యూఢిల్లీ: ఆన్‌లైన్‌లో ఉచితంగా లభించే ఎన్‌సైక్లోపీడియా వికీపీడియాకు కేంద్రం నోటీసులు జారీ చేసినట్లు వార్తలు రావడంపై ఆ సంస్థ స్పందించింది. తమకు భారత ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక నోటీసులు అందలేదని వికీపీడియా మాతృ సంస్థ వికీమీడియా ఫౌండేషన్ పేర్కొంది. ఈమేరకు సంస్థ ప్రతినిధుల్లో ఒకరు ఓ మీడియా సంస్థకు వెల్లడించారు. 'వికీపీడియాలోని ఎడిటింగ్ పద్ధతులు, కంటెంట్‌లోని కచ్చితత్వానికి సంబంధించి భారత ప్రభుత్వం నుంచి వికీమీడియా ఫౌండేషన్‌కు ఎటువంటి నోటీసులు అందలేదు. వికీపీడియా వలంటీర్లు వారికి తెలిసిన సమాచారాన్ని సైట్‌లో అప్‌లోడ్ చేయరు. విశ్వసనీయ వార్తాసంస్థలు, ప్రముఖ ప్రచురణ సంస్థల నుంచి మాత్రమే సమాచారాన్ని సేకరిస్తారు. అందుకే మా ఆర్టికల్స్‌నూ విశ్వసిస్తారు. ప్రపంచవ్యాప్తంగా రెండు లక్షల మందికి పైగా వలంటీర్లు మా సైట్‌కు కంటెంట్‌ను అందిస్తున్నారు. అందులో ఎక్కువమంది భారతీయులే ఉన్నారు. మా సంస్థలోని తటస్థ నిబంధనలను సంపాదకీయులు ఆచరిస్తారు. రాజకీయ నేపథ్యం ఉన్న అనేకమంది వలంటీర్లు మా సంస్థలో భాగమై ఉన్నారు. ఏ ఆర్టికల్ అయినా విస్తృత సమాచారంతోనే రాస్తాము. ఆ సమాచారానికి సంబంధించిన సోర్సుల వివరాలు ఆర్టికల్ పేజీల్లో పేర్కొంటాం' అని ప్రతినిధి వివరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.